# హిమబిందు

నవల

- సుంకర వి. హనుమంతరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 169

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి డిసెంబర్ 2016 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

**ఆంధ్రుల ఖ్యాతిని అంతర్జాతీయంగా వ్యాపింపజేసిన శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్**

యు.యస్.ఎ నుంచి వచ్చే ఫ్లైట్‌కోసం ఎదురుతెన్నులు చూస్తున్న బంధుమిత్రులతో కిటకిటలాడిపోతోంది.

అర్ధరాత్రి దాటిపోయింది.

అంత టైం అయినా అందరి ముఖాల్లోనూ ఆప్తుల్ని చూడాలన్న ఆతృతే తప్ప నిద్ర, అలసట వంటి చిహ్నాలు మచ్చుకైనా కనిపించడంలేదు.

'ఫ్లైట్ ఎరైవల్ టైంకే ' అని ఎనౌన్స్ చేసేసారు. అందరిలో ఆనందం - హమ్మయ్య - అన్న తృప్తి.

కూతుర్ని చూడబోతున్నానన్న తృప్తితోబాటు, ఇది రెండు సంవత్సరాల తర్వాత ఒంటరిగా ఎందుకొస్తోందో? ఇన్ని ఆలోచనలతో సతమతమవుతున్న అనురాధాదేవి అసహనంగా ఉంది.

ఆమె కదలికల్నే గమనిస్తున్న భర్త వెంకటరత్నంగారు అమ్మాయిని కళ్ళారా చూసుకోవచ్చన్న ఏకైకకాంక్షతో ఎరైవల్ లాంజంతా కళ్ళతో వెదికేస్తున్నారు.

విజయవాడకు దాదాపు ఇరవై అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాలెం గ్రామంలో మోతుబరి ఆయన, ముప్పై ఎకరాల మాగాణి, అయిదెకరాల మెట్టపొలానికి యజమాని. ఊరికి పెద్దదిక్కు. ఇప్పుడు స్టేట్స్ నుంచి వస్తున్నది ఆయన పెద్ద కుమార్తె హిమబిందు. ఎమ్.సి.ఎ చదివిన తనకూతురు కోరుకున్న సంబంధం చేయలేని తన అసమర్ధతకు అనుక్షణం బాధపడుతూనే ఉండడం ఆయనకు అలవాటైపోయింది. మాట్లాడితే చాలు గయ్యాళిలా విరుచుకుపడే భార్య అనురాధాదేవి నోటికి భయపడి మౌనముద్ర దాల్చడం తప్ప మరో గత్యంతరం లేకుండా పోయింది.

భార్యాభర్తల మధ్య వారధి సుమసింధు. వెంకటరత్నంగారి రెండో అమ్మాయి. అందం, అణుకువలతోబాటు అల్లరి చేయడం కూడా ఆ అమ్మాయికి సహజంగా లభించిన అలంకారాలు. యాక్టివ్‌గా ఉండడమేకాదు తన చుట్టూ ఉన్న వారిని కూడా యాక్టివేట్ చేయడం ఆమె నైజం.

సుమకు అక్క హిమంటే ప్రాణం. హిమకైతే సుమ పంచప్రాణాలే.

అయితే హిమ అమెరికా వెళ్ళినప్పటి నుండి సుమతో మాట్లాడటం తగ్గించేసింది. దానికి కారణం తన తల్లేనన్న గట్టినమ్మకం సుమది. అదేదో అక్కనే అడిగి తెలుసుకోవాలని కాచుక్కూర్చుంది.

మాటిమాటికి తన రిస్ట్‌వాచ్ చూసుకుంటుంటే హఠాత్తుగా ఎరైవల్ లాంజ్‌లో కలకలం.

ఒక్కసారిగా ఆనందాల అలజడి.

ఫ్లైట్ దిగి ఒక్కరొక్కరుగా వచ్చి తమవారికి హాయ్ చెప్పి లగేజ్ కోసం పరుగులు తీస్తున్నారు.

'అమ్మా! '

ఎరైవల్ లాంజ్‌లోంచి పరుగెత్తుకుంటూ వచ్చి హిమబిందు తల్లిని కౌగిలించుకుంది.

'అమ్మా హిమా! ' పట్టలేనంత సంతోషం అనురాధాదేవి కంఠంలో.

'ఎలా వున్నావురా? ' ఆప్యాయంగా తలనిమురుతూ అడిగారు వెంకటరత్నంగారు.

'నాన్నా! ' తల్లిని విడిపించుకుని ఎయిర్‌పోర్టని కూడా చూడకుండా వంగి పాదాలకు నమస్కరించింది.

'అయిందా తల్లీ! ఇంకేమైనా మిగిలిపోయాయా? అయినా నా పిచ్చికాకపోతే పెళ్ళవకముందు చెల్లాయిగానీ అయిపోయాక జిల్లాయే. '

సుమసింధు బుంగమూతి మీద ముద్దుపెట్టి 'పెళ్ళవలేదుగా ఇంకా చెల్లాయివే' మురిపెంగా అంది హిమ. అందరూ హాయిగా నవ్వేసారు.

'లగేజ్ తీసుకొస్తా' అంటూ లాంజ్‌లోకి వస్తున్న హిమ కళ్ళల్లో అప్రయత్నంగా సుడులు తిరిగాయి కన్నీళ్ళు.

అందరూ పార్కింగ్ ప్లేస్‌లోకి వచ్చారు. కార్ డ్రైవర్ బాలయ్య పరుగెత్తుకుంటూ వచ్చి 'అమ్మా బేబమ్మ' అంటూ దండం పెడుతుంటే - 'అరే నువ్వెప్పుడు డ్రైవర్‌వయ్యావురా?' సంతోషంగా అడిగింది.

'అంతా పెద్దయ్యగారి దయేనమ్మా' లగేజి అందుకుంటూ వెలిగిపోతున్న ముఖంతో చెప్పాడు.

'అయితే నేను లేని టైంలో చాలా విశేషాలు జరిగిపోయాయన్నమాట' అని అనుకుంటూ అందరూ హ్యాపీగా ఉన్నా తల్లి ముఖంలో చిందులేస్తున్న అనుమానాన్ని గమనించి చిన్నగా నవ్వుకుంది హిమ.

'అక్కా! బావను తీసుకురాలేదేం?' అని అక్కతో ఆప్యాయంగా అనుకుంటూ నడుస్తూ అడిగింది సుమ. సమాధానం కోసం సుమకంటే తల్లే ఆత్రుతగా చూడడం - హిమదృష్టిని దాటిపోలేదు.

'బావకేదో న్యూ కాంట్రాక్ట్ వచ్చిందంట - నీకు తెలుసుగా ఐటి అసలే కుంటినడకల్లో ఉందని - ఛాన్స్ మిస్సయితే అంతే సంగతులు.'

'ఔనట - ఐటి పూర్తిగా డౌనయిపోయిందంటున్నారు. నేను లక్కీగా అమ్మ చెప్పినా వినకుండా మెకానికల్ ఇంజినీరింగ్ తీసుకున్నా, లేకపోతే నా బ్రతుకు ఏమయ్యుండేదో - కదా? ' సుమ మాటలకు అనురాధాదేవి ముఖంలో బాధ తొంగి చూసింది. కార్‌లో అంతా సర్దుకున్నాక బాలయ్య కార్‌ని కదిలించాడు.

తెలతెలవారుతుండగా కంకిపాడు దాటేసారు.

వెలుగురేఖలు నెమ్మదిగా ప్రకృతిని అలంకరిస్తున్నాయి -

ఉదయిస్తున్న బాలభానుని బంగారు కిరణాలు ప్రవహిస్తున్న కాలువ జలాల్లో పడి - నీటిని రాగరంజితం చేస్తున్నాయి.

రోడ్డుకు ఎడమ ప్రక్కగా ఏపుగా ఎదిగిన చెట్లు హిమ రాకకు సంతోషాన్ని ప్రకటిస్తున్నట్లు వీస్తున్న గాలికి తలలు ఊపుతున్నాయి.

రోడ్డుకు కుడిప్రక్కనున్న 'బందరు కాలువ' అంచులు తాకుతున్న నీటితో పూర్ణ గర్భిణిలా మందంగా ప్రవహిస్తోంది.

కారు చప్పుడికి బెదిరిన పక్షులు చెట్ల మీద నుండి పైకి ఎగురుతూ క్రిందకు చూస్తూ ఓ! ఈ అమ్మాయి మా అమ్మాయేగా? మాతో ఆటలాడిన అపురూప సుందరేగా? అనుకుంటున్నట్లున్నాయి.

బొడ్డుపాడు దాటి - పాలెం కు పరుగులు తీస్తుంటే పరిసరాలను గమనిస్తున్న హిమ 'నా జన్మభూమి ఎంత అందమైన దేశమూ' పాటను హమ్ చేస్తుంటే అనురాధాదేవి ఆశ్చర్యంగా చూస్తుండగానే,

'అక్కా! అమ్మగారి చెరువు దాటేసాం. నీకు గుర్తుందా కంకిపాడు సినిమాకెళ్తున్నాం - నువ్వేమో బోస్ సైకిల్ వెనుక నేనేమో?' అనురాధాదేవి ఆ సంగతులు ఇష్టంలేదన్నట్లు - 'సుమా! ఆ సుత్తాపవే - అందరం దిగి ఓసారి అమ్మవారి స్తంభానికి నమస్కారం చేద్దాం' అంది కోపంగా.

అమ్మగారి మాటల్ని వింటూనే - రోడ్డు ప్రక్కగా కారాపాడు బాలయ్య. అందరూ కారు దిగి చెఱువులో కాళ్ళు కడుక్కున్నారు. హిమ ముఖంలో తొంగిచూస్తున్న ఫీలింగ్స్‌ను అర్థంచేసుకున్నట్టు 'ఈ చిన్నదానికి ఎప్పుడు ఏం మాట్లాడాలో అర్థమైచావదు' అని విసుక్కుంది మనసులోనే.

హిమబిందుకు మాత్రం మనోనేత్రం ముందు - చిన్నప్పటి 'యాక్సిడెంట్' ఫ్లాష్ అయిపోయింది.

'బోసుబాబు ఇప్పుడెలావున్నాడు? ' అని అడగాలనుకుని అతి కష్టం మీద ఆపుకుంది.

తల్లికి బాబంటే అస్సలు పడేదికాదు. బాబు మీదున్న ఇష్టాన్ని ఇంటర్‌లోనే తుంచేసిన తల్లి ధోరణి గుర్తుకొచ్చేసింది. చెరువుకు నమస్కరించి చెల్లిని ప్రక్కకు తీసుకెళ్తుంటే -

ఇది ఆ బోసుగాడి గురించే అడుగుతుందని గ్రహించిన అనురాధాదేవి -

'ఇటు రా..' అంటూ సుమను పిలిచి తన ప్రక్కనే ఉండమంది.

అమ్మ, చెల్లి అలా కారు వెనక్కు వెళ్ళగానే, 'నాన్నా! బాబు - బోసుబాబెలా ఉన్నాడు?' అడిగింది నెమ్మదిగా.

'వాడికేం తల్లీ! లాయరైపోయాడు ప్రాక్టీస్ విజయవాడలో పెట్టాడు - మనూళ్ళోనే ఉంటున్నాడు.' నెమ్మదిగా చెప్పాడు.

కారు వెంకటరత్నంగారి లోగిలికొచ్చి ఆగింది. అప్పటికే ఇరుగూ పొరుగు స్త్రీలతో ఆ కాంపౌండ్ అంతా నిండిపోయింది.

హిమ కారులోంచి కాలు బయట పెట్టబోతుంటే - పళ్ళెం, చెంబులతో పరుగెత్తుకొని వచ్చి పళ్ళెంలో హిమకాళ్ళు పెట్టి చల్లటి నీళ్ళతో కడిగి భుజాన ఉన్న తెల్లని టవల్‌తో తుడిచేసింది 'సీత'.

ఒక్కసారిగా హిమకళ్ళు చెమ్మగిల్లిపోయాయి ఎవరీ అమ్మాయి అని ఆలోచిస్తూ 'నేనేమైనా కొత్తపెళ్ళికూతుర్నా' ఉద్విగ్నతను అదిమి పెట్టుకుంటూ అడిగింది. అవన్నీ నాకు తెలీదు తమరెప్పుడూ మా 'పల్లె కూతురే!'

సీత మాటలు వింటూనే -

'వావ్! వినవే అక్కా! వేటూరిగారు గనక బ్రతికి ఉండుంటే దీని మాటలు వినుంటే డెఫినెట్‌గా అసిస్టెంట్‌గా పెట్టుకునేవారు. నాదీ గ్యారంటీ.'

సుమ మాటలు వింటూ ఫక్కున నవ్వింది హిమ.

సీత అర్థంకానట్టు ముఖం పెట్టి 'ఆయనెవరు సింధమ్మా? అయినా ఆయన దగ్గర నేనెందుకు పనిసేత్తాను? ' బుగ్గలు నొక్కుకుంది.

'నిన్ను ఉడికిస్తుందే సుమ - నువ్వు దాని మాటలు వినకు' వెంకటరత్నంగారు సీతకు సపోర్టిచ్చారు.

'మరి దేవుడులాంటి మిమ్మల్ని వదిలేసి - ఎవరాయన? ఏటూరిగారో పాటూరిగారో ఆయన దగ్గర నేనెందుకు పని సేత్తాను? ' - అని సీత వాపోయింది.

'అమ్మ సీతమ్మ తల్లీ అజ్ఞానంతో ఏదో వాగాను వదిలెయ్' అంటూ సీత గడ్డం పట్టేసింది సుమ.

'అమ్మా హిమబిందమ్మా బాగున్నావా అమ్మా?' అందరూ పలకరిస్తూంటే - అందరి దగ్గరకెళ్ళి చేతుల్లో చేయికలిపి తన ఆప్యాయతను చాటుకుంది హిమ.

'రెండురోజుల ప్రయాణం కదా! బాగా అలిసిపోయింది. సాయంత్రం మాట్లాడుకుందాం' అంటూ హిమను ఇంట్లోకి తీసుకెళ్ళిపోయింది అనురాధాదేవి.

'అబ్బా! ఎంత తెల్లగా మారిపోయిందో ఆ దేశమంతా చలిదేశమంటగా! ' అంటూ అమ్మలక్కలు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

పెద్ద హాలు మధ్య లగేజంతా సర్ది వెళ్ళిపోయాడు బాలయ్య.

'అక్కా! నీ ప్రయాణ బడలిక పోవాలంటే? ' అంటున్న సుమ తల్లిని చూసి ఆగిపోయింది.

'ఊ ఆగిపోయావేం? పూర్తిచెయ్ తల్లీ' అంటున్న తల్లిని చూస్తూ

'తల్లీ నీకో దండం. బడలిక పోవాలంటే ముందు మంచమెక్కెయ్ అక్కా అని చెప్పబోతున్నా. మరి నువ్వేమనుకున్నావ్ మమ్మీ?' అదోలా అడిగింది సుమ నవ్వేస్తూ.

'మగరాయుడిలా తమరు సాగిస్తున్న ఈతల విన్యాసానికి తీసుకెళ్తావేమోనని'? అనురాధ దీర్ఘం తీసింది.

'అమ్మో! నా తల్లి మైండ్ రీడింగ్‌లో చైనా వాళ్ళనే మించిపోయింది' అనుకుంటూ 'నువ్వలా అనుకున్నావా? నేనంటే పక్కా పల్లెటూరు - కానీ అక్కేమో అమెరికా అమ్మాయి అలా ఎలా అలల్లో ఈతలు కొట్టిస్తానే మమ్మీ? నిజంగా ఈ మధ్య నీ బుర్ర డమ్మీ అయిపోయిందే '

'అమ్మాయిగారూ నేనూ వస్తానంటే వదిలేసెళ్ళారు అయ్యగారు. ముందు మీరు లేత ముంజులు తినండి' చేతిలో ఉన్న తాటాకు పొట్లాన్ని అపురూపంగా అందించాడు పాలేరు భీముడు.

వాడిని అభిమానంగా చూస్తూ 'ఎలావున్నావ్ భీముడు'? అడిగింది హిమ.

'నాకేటమ్మగారు దుక్క - దుక్కలా ఉన్నాను' చేతి కండరాలు బిగిస్తు అన్నాడు.

'ఒరేయ్ భీమా! ఇంత దుక్కవీ ఓ దోమకుట్టిందని పదిరోజులు పడకేశావ్ గుర్తుందా? '

'పొండమ్మాయిగారూ - చూడండి యిమమ్మా! చిన్నమ్మాయిగారికి ఇంకా చిన్నతనం పోలేదు. ఎప్పుడు నన్ను చూసినా 'సీతాభీముల కళ్యాణం చూదమురారండి' అంటూ పాట పాడేస్తార'ని సిగ్గుతో అన్నాడు.

'ఈ సీతాభీముల కళ్యాణమేమిటే అడిగింది' హిమ.

'అదా! అదో పెద్ద హిస్టరీ అక్కా' తర్వాత చెప్తాలే.

భీముడు వెళ్ళిపోయాడు.

'సీతంటే?'

'అదే తమరికాళ్ళు కడిగిందే అదన్నమాట'

'సీతేమో చాలా క్యూట్‌గా ఉంది. వీడేమో?'

'అదే మరి లవ్వంటే ఇది పల్లెటూరి లవ్‌లే - నువ్వలా పడుకుంటు అమెరికా కబుర్లు చెప్తుంటే నేను ఇలా తమరి సామాన్లు సర్దేస్తాను.' అంటూ లగేజ్ మీద వాలిపోయింది.

'ఈ బేగ్ అలానే ఉంచు దాన్నిండా గిఫ్టులున్నాయి. అమ్మకి, నాన్నకి నీకు నా ఫ్రెండ్స్‌కు. '

'అంటే లాయర్‌గారికి?' అంటూనే తల్లిరాకతో గప్‌చుప్ అయిపోయింది సుమ.

మళ్ళీ బోసుబాబు ప్రసక్తి రాగానే అదోలా అయిపోయింది.

ఆరోజంతా ప్రయాణ బడలికతో కేరాఫ్ బెడ్ అయిపోయింది హిమ.

తెల్లారిపోయింది.

హిమ ఆరుగంటలకే లేచి సుమను లేపబోయింది.

'ఫైవ్ మినిట్స్ - అక్కా ప్లీజ్' అంటూ మంచానికి అటు తిరిగి మూడంకె వేసింది.

'హిమా అప్పుడే లేచావెందుకే నేను లేపుతాలే నిద్రపో' అంటూ తల్లి వెళ్ళిపోబోతుంటే చెయ్యిపట్టుకులాగి మంచం మీద కూర్చోపెట్టి అమ్మ ఒళ్ళో తలపెట్టుకుంది. అనురాధాదేవి కదిలిపోయింది.

'ఏంట్రా బిందూ! చాలా మూడీగా మారిపోయావ్ అప్పటి చలాకీతనం ఏమైందిరా? అమెరికాలో గోపీ జాబ్ ప్రోబ్లమ్స్ ఏమైనా ఫేస్ చేస్తున్నాడా? ఇప్పుడు ఐటి అంతగా బాగలేదంటున్నారు.'

'అమ్మా! నన్నిలా కాసేపు పడుకోనీ' అంటూ తల్లి నడుం చుట్టు చేతులు బిగించింది.

ఎప్పుడు లేచిందో 'క్యాసీన్ హైరే' అంటూ వెనకనుండి మమ్మీ మెడను వాటేసుకుంది సుమ.

స్నానం చేసి లోపలికి వచ్చిన వెంకటరత్నం - 'తల్లీకూతుళ్ళు ఒకటై పోయారే! ' అంటుంటే 'మీకూ చోటుంది' అంటూ తండ్రి చెయ్యిపట్టుకులాగి కూర్చోపెట్టి ఆయన్ని అల్లుకుపోయింది సుమ.

పొగలుకక్కుతున్న బ్రూకాఫీ తెచ్చిన సీత - 'అమ్మో ఇదేదో సినిమాలాగా ఉన్నట్లుందే' అంటూ తెగసంబర పడిపోయింది.

'ఇంకా మేమెవరం ముఖాలు కడుక్కోలా' అంటూ సుమ ఆట పట్టిస్తుంటే -

'అమెరికాలో అంతా - పాచి ముఖాన్నే తాగుతారని కేశవయ్యగారి మనవరాలు చెప్పిందే మరి' అంటూ వెంకటరత్నం, అనురాధల చేతికి చెరో కప్పిచ్చి - 'అయితే ఈ రెండు కప్పులూ నాకే' అంటూ వెళ్ళిపోబోతుంటే

'కదిలావా కాల్చేస్తా'! అంటూ మంచం మీద నుండి దూకి రెండు కప్పులూ తీసుకుని హిమకొకటి ఇచ్చి తానొకటి తీసుకుంటుంటే కళ్ళప్పగించేసింది సీత. దాని అవస్థకు ఫక్కున నవ్వేసింది హిమ.

'హమ్మయ్యా అమ్మాయిగారు నవ్వారండి' అంటూ ట్రేతో లోపలికి పారిపోయింది సీత.

'అమ్మా! సీతంటే - అప్పుడు పైడయ్యని ఒకాయన ఉండేవాడు - వల్లూరు వెళ్ళిపోయాడని చెప్పారు. అతని కూతురేనా - మరి భీముడితో?'

'అదో పెద్ద టీవీ సీరియల్ గాని.. తమరు తయారైతే'

'నీ ఫ్రెండ్స్ - టాన్యా, అన్నపూర్ణ, నిర్మల హేమలతలు ఈ పాటికి వచ్చేస్తుంటారు, నేనలా నాలుగు రౌండ్లు ఈత కొట్టి వచ్చేస్తా. '

'స్విమ్మింగా'?

'ఏం.. సిటీల్లో జనాలు మనీ ఇచ్చి మరీ స్విమ్మింగ్ చేస్తుంటే - కాలువ పక్కనున్న మనం చేయకూడదా.. బై - సీయూ' అంటూ తుర్రుమంది సుమ.

'దానికెంత చెప్పినా ఇంతే చెట్లెక్కడం ఈతలు కొట్టడం తానింకా చిన్న పిల్లననుకుంటోంది', హిమకు తెల్లని ఇస్త్రీ టవలిస్తూ విసుక్కుంది.

'పోన్లే అమ్మా! మరో రెండేళ్ళయితే ఎలాగూ పెద్దరికం వచ్చేస్తుంది, అదే తెల్సుకుంటుంది' లేచి బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది హిమ.

'ఎలాంటి ప్లానూ లేకుండా ఎందుకొచ్చిందో ఏమో? ' మనసులో రేగుతున్న ఆలోచన్లను అణుచుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది అనురాధా దేవి.

హిమ స్నానం చేసి తయారై వచ్చిందో లేదో మిత్రబృందం అంతా దిగిపోయారు. వస్తూనే అందరూ వాటేసుకున్నారు. అందరిలోనూ చిలిపిగా కనిపించే హేమలత గట్టిగా ముద్దుకూడా పెట్టేసింది.

'నిజంగా ఈ రెండేళ్ళలో చాలా అందంగా తయారయ్యావే' అనేసింది.

టాన్యా కాస్త దూరంగా నిలబడి 'సూపర్ ఫిగర్ - ఆ కళ్ళకింద ఆ నలుపేంటే - కంప్యూటర్‌కి కళ్ళు తాకట్టు పెట్టేసావా?' అని అడిగింది పరిశీలనగా చూస్తూ.

ఏమనాలో తోచని హిమ - అదే కారణమన్నట్లు తలూపేసింది.

'ఇంతకీ ఈ లోన్లీ ట్రిప్పేంటే? తమరి హబ్బీ ఐ మీన్ బావగారెక్కడ? ఐటి జనాలు ఓరోజు సెలవు పెడితే మర్నాడు పింక్ కవరేనంటగా స్టేట్స్‌లో?' అడిగేసింది అన్నపూర్ణ.

నవ్వలేక నవ్వేసింది హిమ.

'అదేంటే గలగలా మాట్లాడే బిందు హిమంగా గడ్డకట్టుకుపోయిందేంటబ్బా! ' అంటున్న నిర్మలకేం చెప్పాలో అర్థంగాక

'ఏం లేదు జెట్-లాగ్' అనేసింది.

హిమ ఏం చెబుతోందోనని చెవులప్పగించిన అనురాధాదేవి - హు అంటూ నిట్టూర్చేసింది.

'అమ్మాయిగార్లూ! అందరికీ సున్నుండలు, జంతికలు' అంటూ ప్లేట్లు తెచ్చి మంచం మధ్య పెట్టేసింది సీత.

'అబ్బో సున్నుండలా! - అంతా నెయ్యే' అంటున్న నిర్మలను చూస్తూ 'ఈ వయసులో తినకపోతే మరే వయసులో తింటారు? - ఆశ్చర్యంగా అడిగింది సీత.

'నా బాధంతా వయసు గురించి కాదే తల్లీ - లావైపోతామనే భయం.' సున్నుండ కొరుకుతూ చెప్పింది - నిర్మల.

'ఏమే హిమా స్టేట్స్‌లో లైఫ్ ఎలా వుంది? నువ్వు జాబ్ చేస్తున్నావా? ఎంత సంపాదించారే? పిల్లల గురించి ప్లాన్ చేసుకున్నారా?' ఆరిందాలా అడుగుతున్న అన్నపూర్ణను ఆపుతూ.

'అబ్బో! నువ్విక్కడుండవలసిన దానివి కాదే - అర్జంటుగా హైదరాబాదెళ్ళిపోయి ఏదో ఒక టీవీలో ప్రశ్నలతో ప్రాణాలు తోడేసే యాంకరైపోవాలి ' టాన్యా జోకేసింది.

'పదండి అందరం బాదం చెట్టు క్రిందకి వెళదాం' - అందరూ లేస్తుంటే - నిస్సహాయంగా నిట్టూర్చింది - హిమతల్లి.

'ఆ ఇప్పుడు చెప్పవే'? అందరూ పాలిష్డ్ కడప రాళ్ళతో కట్టిన దిమ్మెల మీద సెటిలవుతూ ఒక్కసారే అడిగేసారు.

ఆలోచిస్తున్నట్లు పోజు పెట్టి 'ఏం చెప్పమంటారు? మీరే అడగండి' అంది హిమ.

'అమెరికా లైఫ్ ఎలావుందే?' నిర్మల అడిగింది.

'క్వైట్ థ్రిల్లింగ్ అండ్ వెరీ వెరీ బిజీ అండ్ ఫాస్ట్ లైఫ్ - అందరూ బిజీనే, ఐటి జనాలైతే - ఒక్క నిమిషం కూడా ఖాళీలేకుండా ఇంటర్నెట్‌తోనే కుస్తీ - ఇక యూత్ అయితే వీడియో గేమ్స్‌కో, డ్రగ్స్‌కో ఎడిక్ట్ అయిపోయివుంటారు. ఇక సామాన్య గృహిణుల లైఫ్ అయితే - ఇక్కడ ఫ్లాట్స్‌లో ఎలాగడుపుతారో అక్కడా అంతే. ఇక్కడయితే ఏ పక్కింటి ఆంటీనో పలకరిస్తూవుంటుంది. అక్కడ ఆ అవకాశం కూడా వుండదు. అందరూ నవ్వుతూ 'హాయ్' అంటారుగానీ దాంట్లో ఏ 'హాయీ' వుండదు. అంతా మెకానికల్ లైఫ్.

మంచి జాబ్‌లో వున్న వాళ్ళు హ్యాపీగానే వుంటారు. స్మాల్ జాబ్‌లో వున్నవాళ్ళకే మరీ ఇబ్బంది. జాబ్ గ్యారంటీ వుండదు. ఎప్పుడైనా పింక్ కవరిచ్చి బయటికి నెట్టేయొచ్చు.'

'ఇవన్నీ బుక్స్‌లో చదువుతుంటాము. నిజమేనన్నమాట.' టాన్యా కామెంట్ చేసింది.

'ఇక్కడెంతో సిన్సియర్‌గా వుండి - జాబ్స్ సంపాదించుకుని అమెరికా చేరిన యువత అక్కడ లభించే స్వేచ్ఛను ఆస్వాదించాలని పక్కదారులు పట్టి పతనమైపోతున్నారంటే బాధగావుంటుంది. ఇప్పుడు అన్ని జాతుల్నీ పట్టుకుని కుదిపేస్తున్న మహమ్మారి - లివింగ్ టుగెదర్. అంటే ఎలాంటి కమిట్‌మెంట్ లేకుండా కలిసి భార్యాభర్తలుగా జీవించడం వయసు అయిపోయాక విడిపోయి ఫ్రస్టేషన్‌తో డ్రగ్స్‌కు దాసోహమైపోతున్నారనేది అంతగా అందరికి తెలియని నిజం.

ఒంటరిగా అమెరికాలో అడుగుపెట్టాక  మనవాళ్ళే ఈ సంస్కృతికి అలవాటు పడిపోతున్నారంటే నమ్మబుద్ధికాదు. '

'అమెరికా అంటే దూరపుకొండన్నమాట?' హేమలత తను రాయితో కొట్టి పోగు చేసిన బాదం పప్పుల్ని ఆకులో పెట్టి హిమకిస్తూ కామెంట్ చేసింది.

'ఇప్పుడు ఐటీ జాబ్స్ పడిపోయాయ్ - ఇప్పటిదాకా లక్షల జీతాలు తీసుకుంటున్నవాళ్ళు వేలల్లో కూడా జాబ్స్ దొరక్క స్వదేశానికెళ్ళి ముఖం చూపించలేక త్రిశంకుస్వర్గంలో వున్నట్లు గడిపేస్తున్నారంటే ఎంత బాధ. బి.టెక్‌లూ, ఎమ్మెస్సీలూ, ఎమ్‌కాంలూ, ఎమ్‌ఫిల్‌లూ చేసిన వాళ్ళేకాదు ఇంజినీరింగ్‌లో ర్యాంకు హోల్డర్స్ కూడా బంకుల్లోనూ డిపార్ట్‌మెంట్ స్టోర్లలో క్యాజువల్ ఎంప్లాయిస్‌గా పనిచేస్తున్నారంటే నమ్మశక్యంకాదు - బట్ ఇది నిజంగా నిజం.' బాదంపప్పుల్ని తినడానికన్నట్లు ఆగింది హిమ.

'మరి జనాలెందుకే పిచ్చోళ్ళా పరుగులు తీస్తున్నారు? '

'అదంతా డాలర్ల మోజు ఒక్కసారిగా ధనవంతులైపోవాలన్న కాంక్ష' టాన్యా ప్రశ్నకు సమాధానమిచ్చింది హిమ.

'సరే మనూరి విశేషాలు చెప్పండి - మీరంతా ఎప్పుడు మ్యారేజ్ చేసుకుంటారు? '

ఆ ప్రశ్నకు అంతా ముసిముసి నవ్వులు రువ్వారు.

'ఔనూ అడగడం మర్చిపోయాం - బోస్ వచ్చాడా? అయినా అతనికి మనమెక్కడ కనిపిస్తాంలే. పెద్దలాయరైపోయాడు. '

బోస్ ప్రసక్తితో కొంచెం యిబ్బంది పడిపోయింది హిమ.

'అబ్బా! చాలా ఎదిగిపోయాడు. అసలే వాలీబాల్ ప్లేయర్ కదా!' నిర్మల కామెంట్.

'ఈమధ్య మనూరి రైస్‌మిల్ కేస్ చేస్తున్నాడు. మిల్లువర్కర్లందరికీ దేవుడైపోయాడంటే నమ్ము' అందరూ ఒక్కసారే 'కోరస్'గా అన్నారు.

ఈత ఎపిసోడ్ అయిపోయినట్లుంది తడిసిన బట్టలతో వస్తున్న సుమను చూసి అందరూ ఆనందంతో విష్ చేసారు.

'ఆ బోస్ మాతో మాట్లాడనే మాట్లాడడు. ఇదిగో - ఈ సుమతో తప్ప' నిష్ఠూరంగా అంది హేమలత.

'యా' అన్నట్లు గర్వంగా చూసింది సుమ - 'పోన్లే బోస్‌బాబు గురించెందుకు గానీ నీ మ్యారీడ్‌లైఫ్ గురించీ, తమరి భర్తగారైనటువంటి గోపీనాథ్ గురించి చెప్పవే తల్లీ విని తరించాలని తహ తహలాడిపోతున్నాం.'

'స్పెషల్‌గా ఏముంటుంది? అతను మంచి కాంట్రాక్ట్ చేస్తున్నారు. రోరింగ్ ఇన్‌కం. నేను కూడా జాబ్ చేస్తున్నాను.'

హిమ సమాధానం వింటూనే 'నీకేంటే గోల్డ్‌మెడలిస్ట్‌వి' ఆనందంగా కామెంట్ చేసింది టాన్యా.

ఏదో చెప్పాలని చెప్పింది. కానీ అప్పటికే ఆమె మనసంతా ఆక్రమించేసాడు బోస్‌బాబు.

సాయంత్రం అయిపోయింది. ఫ్రెండ్స్ అంతా వెళ్ళిపోయారు.

'అబ్బా వానవెలిసిందే అక్కా' మొక్కజొన్నకంకిని లాగిస్తూ రిలీఫ్‌గా కామెంట్ చేసింది సుమ.

సీత వడ్డిస్తుంటే నలుగురూ డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు.

'అమ్మా హిమా! ఇవ్వాళ మధ్యాహ్నం స్వామితాత అడిగారు ని గురించి. '

'ఎలావున్నారు నాన్నా?'

'మిల్లు గొడవలో పడిపోయిన దగ్గర్నుంచీ ఊరి పరిస్థితే మారిపోయిందిరా. దాదాపు వందమంది ఉపాధి కోల్పోయారు. స్వామితాత వాళ్ళందరి వెనుకా అండగా నిల్చాడు. '

'అసలింతకీ ఏమైంది నాన్నా?'

'ఏం చెప్పమంటావురా? కాలేజి.. పెళ్ళి గొడవల్లో పడిన నీకు మనూరి విశేషాలు అంతగా తెలియవు. అయిదేళ్ళ క్రిందటదాకా మన పాలెం స్వర్గసీమే. అప్పుడెప్పుడో జటప్రోలురాజుగారి ప్రయాణంలో మార్గం మధ్య విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన ఈ ఊరు చాలా చిన్నది. కేవలం పది కుటుంబాలు మాత్రమే వుండేవట. ఆ తర్వాత కాలక్రమంలో వ్యవసాయం అభివృద్ధి చెందడంతో ఊరు క్రమక్రమంగా పెరిగిపోయిందని చెబుతారు.

దాదాపు పదిహేనూ, పదహారు సంవత్సరాల క్రితమే గోపాలకృష్ణగారు మనూళ్ళో బాయిల్డ్‌రైస్ మిల్ కట్టించడంతో అవసరాలు పెరిగిపోయి ఎన్నో కుటుంబాలు యిక్కడకు వలస వచ్చేసాయి. మనూరి ప్రక్కనే బందరుకాలువ వుండడంతో వ్యాపార రంగం బాగా అభివృద్ధి అయిపోయింది.

ఫ్యాక్టరీ పునాదుల దగ్గరనుండి స్వామితాత యిక్కడేవున్నాడు. గోపాలకృష్ణకు కుడిభుజంలా వ్యవహరించేవాడు. ఆయనకూడా ఆస్థిపరుడే కొడుకు సూర్యం యిదే ఫ్యాక్టరీకి చీఫ్ మెకానిక్‌గా పనిచేసేవాడు. అంతా సవ్యంగా సాగిపోతున్న తరుణంలో పెద్ద ఉపద్రవమొచ్చిపడింది బాపిరెడ్డి రూపంలో.

బాపిరెడ్డిది కూడా యిదే బిజినెస్, కాంపిటీషన్‌కు తట్టుకోలేక చేతులెత్తేసి అక్రమ మార్గాలను అన్వేషించాడు.

అధికారుల్ని, ఏజంట్లనీ ప్రలోభపెట్టి గోపాలకృష్ణకు దూరం చేసాడు. మనూరి మెయిన్ టెక్నిషియన్స్‌ను కూడా అధిక జీతాల ఆశ చూపించి కొనేసాడు. ఆ సంవత్సరం అపరిమితమైన నష్టాల్ని ఎదుర్కొన్నాడు గోపాలకృష్ణ. జరిగిన నష్టాన్ని గుర్తించి తరువాత సంవత్సరం చాలా జాగ్రత్తగా వ్యవహరించినా ధాన్యం ధర పడిపోవడంతోబాటు రైస్ ఎగుమతుల మీద ప్రభుత్వం విధించిన బ్యాన్‌తో ఆ సంవత్సరంకూడా అధిక నష్టాన్ని రుచిచూసాడు. మిల్లు మూసేసాడు. కార్మికులంతా స్వగ్రామాల్లోని ఆస్థిపాస్తులన్నీ అమ్ముకుని వలసవచ్చిన వాళ్ళే, మళ్ళీ వలసపోవాలంటే శక్తికి మించిన పని. కొంతమంది రైతు కూలీలుగా మారిపోయారు. చాలామంది కార్మికులు బాపిరెడ్డి ఫ్యాక్టరీలో చేరిపోయారు.

స్వామితాత మళ్ళీ మిల్లు తెరిపించాలని చాలా ప్రయత్నాలు చేసాడు. దాదాపు రెండు సంవత్సరాలు కార్మికులంతా వేతనాలు లేకుండా పనిచేసారు. మిల్లు ఓపెన్ అయితే జీవితాలు బాగుపడతాయని శ్రమించారు. లాభం లేకపోయింది. వూరు వూరంతా ఆకలి కోరల్లో చిక్కుకుపోయింది.

నువ్వు హైదరాబాద్‌లో హాస్టల్లో వుండేదానివి చదువయ్యాక పెళ్ళిచేసుకుని అమెరికా వెళ్ళిపోయావు.

తోటి కార్మికులకోసం స్వామితాత తన ఆస్తుల్ని ధారపోసాడు. రైతులం మేమంతా సాధ్యమైనంత సాయం అందించాం, అందిస్తున్నాం. కార్మికుల కష్టాలకు చలించిపోయాడు స్వామితాత. ఎన్నోసార్లు విజయవాడ వెళ్ళి గోపాలకృష్ణ కాళ్ళావేళ్ళా పడేవాడు.

బాపిరెడ్డి చెప్పిన కల్లబొల్లి మాటల్ని పూర్తిగా నమ్మేసిన గోపాలకృష్ణ తన నష్టానికి పూర్తి బాధ్యత కార్మికులదేననే అపోహలో వుండిపోయాడు.

మెషినరీ పాడైపోడానికి బాయిలర్ పనిచేయకపోవడానికి 'సూర్యం - స్వామితాత కొడుకే' కారణమన్న విషాన్ని గోపాలకృష్ణ బుర్రలో నింపేసాడు.

ఆ విధంగా స్వామితాత, గోపాలకృష్ణ మధ్యనున్న సయోధ్యను తెంపేసాడు.

అప్పటివరకు అంతో యింతో సాయం అందుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న కార్మికులకు కష్టాలు ఎక్కువైపోయాయి.

నువ్వమెరికా వెళ్ళిపోయిన నెలలోనే బోసుబాబు ప్రోత్సాహంతో కోర్టుకెళ్ళాడు స్వామితాత. దీంతో యిద్దరిమధ్యనున్న దూరం ఎక్కువైపోయింది.

నేను కూడా చెప్పిచూసాను లాభంలేకపోయింది.

త్వరలో తీర్పువచ్చేస్తుంది. కార్మికులకు అనుకూలంగానే వుంటుందన్నాడు బోసు. ఊరి పరిస్థితి ఎలావుందంటే తినడానికి తిండికూడాలేని పరిస్థితి. ఎంతోమంది పస్తులుంటున్నారు. చాలామంది వైద్యం చేయించుకునే స్తోమతలేక చావుబ్రతుకుల మధ్యకొట్లాడుతున్నారు.'

'అదంతా యిప్పుడవసరమా? దాన్ని ముందు తిననివ్వండి' అడ్డం పడిపోయింది అనురాధాదేవి.

'నాన్నా నేను వెంటనే స్వామితాతను చూడాలి. 'ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ ఆర్తిగా అడిగింది.

'అలాగేనమ్మా, నువ్వు భోంచెయ్' తండ్రి మాటలకు తృప్తిపడిపోయిన హిమ మరోమాట లేకుండా మౌనంగా తినడం ప్రారంభించింది.

భోజనాలు పూర్తవుతుండగానే 'అమ్మా! తాతగారు వచ్చేసారు. నా మనమరాలు ఎక్కడ? అంటూ ఒకటే యిదైపోతున్నారు' సీత ఆనందంగా చెప్తుంటే ఒక్క గెంతులో బయటకొచ్చేసింది హిమ.

'తల్లీ హిమబిందూ!' ఆప్యాయంగా చేతులుపట్టుకుని పలకరిస్తున్న స్వామితాతను చూస్తూనే షాక్ తిన్నట్టు నిలబడిపోయింది హిమ.

కావిరంగు ధోవతిమీద అతుకులేసిన చేతులున్న బనీనుతో బాగా కృంగిపోయినట్లున్నాడు స్వామితాత.

ఆ ఊరిమిల్లు పుట్టినప్పటి నుండి మేస్త్రిగా జీవితాన్ని ప్రారంభించిన స్వామితాత ఊరందరికీ కావల్సిన వ్యక్తి అయిపోయాడు.

మేనేజ్‌మెంటును మెప్పిస్తూనే కార్మికులందరి వెనుకా ఓకోట గోడలా నిల్చేవాడు.

'ఎటువంటి తాత? - యిలా?' కన్నీరు ఆగలేదు. నడిపించుకొచ్చి అరుగుమీద కుర్చోబెట్టింది హిమ. సీతా! అని కేకవేయాలనుకుంటుండగానే ఓ చేతిలో నీటి గ్లాస్‌తో మరో చేతిలో పొగలుకక్కుతున్న కాఫీ గ్లాస్‌తో ప్రత్యక్షమయ్యింది.

'మనమరాలా ఎలా వున్నావు? భీముడేమంటున్నాడు?' సీతను పలకరించాడు.

వెంకటరత్నంగారు వస్తూనే 'ఏం స్వామి ఉన్నదంతా కార్మికులకు ఊడ్చి పెటేస్తున్నావు. నీకేమీ మిగుల్చుకోవా?' అడిగారు.

'ఏదో మీ పెద్దల దయ. నాకు మాత్రం ఎవరున్నారు? ఈ ఫ్యాక్టరీని ఓ దారిలో పెడితే నాకు అదే మహాభాగ్యం.'

'అమ్మా! గోపాలకృష్ణయ్య వర్కర్ల ఎరియర్స్‌తోపాటు గ్రాట్యుటీ కూడా యివ్వలేనని చేతులెత్తేశారు. దాదాపు వందమంది ఎంప్లాయిస్ వీధిన పడ్డారు. ' కళ్ళనీళ్ళెట్టుకున్నాడు స్వామితాత.

'రైతులమంతా సాయం చేశాంరా. అయినా ఆదాయం లేకుండా వంద ఫ్యామిలీలు. హాయిగా బ్రతికినోళ్ళంతా వీధిన పడిపోయారు. వయసున్న వాళ్ళంతా రైతు కూలీలుగా మారిపోయారు. పిల్లలు చదువులు మానేశారు. ఏదో మన బోసుబాబు లాయరయ్యాడు. ఈ యవ్వారమంతా వాడే చూసుకుంటున్నాడు' వెంకటరత్నం ముగించాడు.

'ఆ - బాబమ్మా దేవుడంటే! మా కోసం ఒక్క పైసా కూడా తీసుకోకుండా కోర్టులో కేసువేసి పోరాటం సాగిస్తున్నాడు' స్వామితాత కన్నీరు తుడుచుకుంటూ చెప్పాడు.

'హాయ్ తాతాజీ నమస్తే, వణక్కం' అంటూ చనువుగా వచ్చి ప్రక్కనే సెటిలైపోయింది సుమ.

'ఔనూ మామ్మగారూ, రమ్యలు ఎలావున్నారు? రమ్య ఈ మధ్య యిటు రావడంలేదే? ' అంటూ సీత తెచ్చిన లడ్డూలు తీసుకుని తాతనోటిలో పెట్టి తనొకటి మెక్కేసింది సుమ.

'ఇంకా చిన్నపిల్లలా తాతయ్యతో అలా బిహేవ్ చెయ్యడం తప్పుకదూ?' అంటూనే అనురాధాదేవి వచ్చేసింది.

'అమ్మా సుమతల్లిని నావీపు మీద మోసాను. తనెప్పుడూ నాకు చిన్నపిల్లే' తాతమాటలు వింటు 'వ్వెవ్వెవ్వె' అంటూ ఎక్కిరించి తండ్రి ప్రక్కకు చేరిపోయింది.

అనురాధాదేవి యింత సడన్‌గా వచ్చింది, బోస్ ప్రస్తావనను అడ్డుకోవాలనే. ఆ సంగతిని గ్రహించిన హిమ అతని గురించి అడగాలనుకున్న ప్రశ్నల్ని అణిచేసుకుంది.

'యివ్వాళో రేపో వాయిదావుందన్నాడు బోసు. నువ్వెళ్ళవా స్వామీ?' వెంకటరత్నం అడిగారు.

'రేపు వెళ్ళాలి బాబూ. బోసుబాబు తన బండిమీద రమ్మంటాడుగానీ నావల్ల కాదాయె. బస్సులో వెళ్ళిరావాలంటే అదో యాగమ్మాయె. పడవ మల్లేసుగాడు బందర్నించి వస్తే పడవలో వెళ్ళాలని చూస్తున్నా.'

'స్వామి రేపయితే ఇబ్బందిలేదు మనకి. నేనెలాగు ఇన్నోవాలో వెళ్ళాలి. నువ్వూ నాతో వచ్చేద్దువుగాని.'

'బాబూ - నా బాధలు నేను పడతాను తమరికి శ్రమెందుకు.'

'నాకు శ్రమేంటి స్వామి. ఇంతమందికోసం శ్రమిస్తున్నావు. ఈ చిన్నసాయమైనా చేయడం మాధర్మం. పొలం అమ్మేసావు. ట్రాక్టరు అమ్మేసావు. ఎవరికోసం? నీకోసం కాదుగా?'

'బాబూ తమరు ఆదుకోకపోతే యింతమంది బ్రతికివుండేవాళ్ళమా చెప్పండి. పని యిచ్చారు, ధాన్యం యిస్తున్నారు. ఇంతకంటే ఎవరు చేస్తారు?'

'మరి గోపాలకృష్ణ అంకుల్ ఏమంటున్నారు?' హిమ అడ్డొచ్చింది.

'నేనే చాలా నష్టపోయాను అంటున్నారు' స్వామితాత అన్నాడు.

'నేనూ ట్రై చేసానురా వర్కర్స్ ఎరియర్స్' అయినా యిమ్మని నావల్ల కాదన్నాడు. '

మరి 'బాబు - బోసుబాబు ఏమంటున్నాడు? ' 'బోసుబాబు' అంటుంటే అదోలా అనిపించింది హిమకు తనకెప్పుడూ బాబు అనిపిలవడమే తెలుసు.

'అతను చాలా హోప్‌తో వున్నాడు. తప్పకుండా కార్మికులకే కేస్ ఫేవర్ అవుతుందంటున్నాడు చూడాలి. '

'ఏమో తల్లీ! అంతా బోసుబాబు మీదే భారం వేసాం.'

'ఆ నాకేం నమ్మకం లేదు. వాడెంత? వాడి చదువెంత? ' అనురాధాదేవి తీసిపారేసినట్లు మాట్లాడుతుంటే మనసులోనే తల్లి ఉక్రోషానికి నవ్వుకుంది హిమ.

'బోస్‌కేం తక్కువ? విజయవాడ కోర్టులో లీడింగ్ లాయర్లలో ఒక్కడిగా చెప్పుకుంటారు.'

'మీరు అనడమే తప్ప ఏమీ సంపాదించినట్లు లేదు. మొన్న వాళ్ళ అమ్మను చూసాను. చాలా పేదరికంలో వున్నట్లుంది. '

'ఆ తల్లి దగ్గర ఏదున్నా మాకే పెట్టేస్తుంటే ఆయమ్మ దగ్గర ఏముంటుందమ్మా - మాదయగల తల్లి.' గాలిలోకి నమస్కరిస్తూ అన్నాడు స్వామితాత.

'తన తల్లి మిల్లు వర్కర్లకు మజ్జిగ కూడా అమ్మేది.'

ఆ విషయం గుర్తుకు రాగానే నోరంతా చేదు అయిపోయినట్లు ఫీలయింది హిమబిందు.

**ఆ రాత్రి నిద్రపట్టలేదు** హిమకి. బాల్యజీవితం గుర్తొచ్చి మనసంతా అల్లకల్లోలమైపోయింది. వచ్చినప్పటి నుండి తల్లిని గమనిస్తూనే వుంది. ఖాళీ దొరికితే చాలు 'గోపినాథ్ ఎలా వున్నాడు? ఇంత అకస్మాత్తుగా ఎందుకొచ్చావు? ఇద్దరూ పోట్లాడుకున్నారా?' ఇవే ప్రశ్నల్ని మార్చి మార్చి అడుగుతుంటే ఏమీ చెప్పలేక తనెంత క్షోభిస్తుందో గుర్తొచ్చి బిగ్గరగా ఏడ్వేయాలనిపించింది హిమకు.

'ఎప్పటికైనా చెప్పాలి - నిజం చెప్పాలి - చెపితే? తండ్రిని ఫేస్ చెయ్యొచ్చు - కానీ తల్లి విషయం?'

బోసుబాబు గుర్తొచ్చాడు. తన పెళ్ళి గోపీతో నిశ్చయమయ్యేదాకా - ఎంత అందమైన జీవితం? అరమరికలు లేని అందమైన స్నేహం. స్కూలు లైఫంతా బందరు కాలువ దాటి, అందమైన పొలాల మధ్య బళ్ళబాటలో చెరుకులు తింటూ, మొక్కజొన్న పొత్తులు తింటూ ఒకటేంటి చివరకు పెసరకాయల్ని కూడా వదిలి పెట్టకుండా - ఉదయం సాయంత్రం ఖాళీలేకుండా కబుర్లే కబుర్లు - నాలుగు మైళ్ళు వెళ్ళి, నాలుగైళ్ళు రావడం షికారులా గడిచిపోయేది. ఆదివారాలు - పండగలకు స్కూలుకు సెలవులొస్తే ఎంతో బోరనిపించేది. బందరు కాలువదాటి తోట్ల వల్లూరెళ్ళాలంటే మధ్యలో అందమైన 'రాణిగారి చెరువు'. ఆ చెరువు మధ్య అందమైన స్థంభం, దాని మీద వాలి చేపలను వేటాడే పక్షులను చూస్తూ అలాగే వుండిపోవాలనిపించేది. చెరువులో జటప్రోలు రాజావారి అంతఃపురకాంతలు దిగి స్నానాలు చేయడానికి వీలుగా అందమైన మెట్లు మీద కాళ్ళు ఊపుకుంటూ లేడిపిల్లల్లా గంతులేసే వాళ్ళం. ఒక్కోసారి మాతోబాటే అబ్బాయిలెవరూ లేకపోతే చెరువులో దిగి స్నానాలు కూడా చేసి బట్టలారేదాకా మండపంలోనే కూర్చుని సాయంత్రం స్కూలు సమయానికి యింటికి చేరేవాళ్ళం.

బోసుబాబుతో పాటు ఎలిమెంట్రీ స్కూలు హెడ్ మాస్టర్ గారి అబ్బాయి యశోరావు మరో యిద్దరు మాతో వచ్చేవాళ్ళు - అబ్బాయిలంతా ఈతలు కొడుతుంటే గట్టు మీది నుంచి మేం కేరింతలు కొట్టేవాళ్ళం. ఎప్పుడు ఈతకి వెళ్ళినా బోసుబాబు కలువ పుష్పాన్ని తెచ్చిచ్చేవాడు. కలువతూడును హారంగా చేసుకుని ఆ పుష్పాన్ని మెడలో ధరించి మురిసిపోయేదాన్ని. నాతో బాటున్న - నిర్మల - అన్నపూర్ణ - హేమలత, టాన్యాలు - 'ఏయ్ బోసూ! మాకెందుకు తేలేద'ంటే - 'అక్కడ ఒక్కటే వుంది' అని అబద్ధం చెప్పేవాడు. 'అదేంటి బోసూ' అంటే - 'అమ్మాయిగారు మొయ్యలేరు కదా' అనేవాడు.

'అంటే మేమంతా గాడిద బరువులు మోసే గాడిదల్లా కనిపిస్తున్నామా' అని కోపం తెచ్చుకుంటుంటే 'మిమ్మల్ని మీరే అనేసుకుంటే - నేనేం మాట్లాడగలను' అంటూ సైకిలెక్కి తుర్రుమనేవాడు.

సమ్మర్ వచ్చిందంటే - ఈతకాయలు - తాటిముంజులు - ఒకటేంటి పొలాల్లో దొరికే దేన్నీ వదిలిపెట్టేవాళ్ళం కాదు. సమ్మర్‌లో బందరు కాలువ కట్టేసేవాళ్ళు మిగిలిపోయిన నీటిగుంటల్లో చేపలు పట్టి కాల్చడం దగ్గర్నుంచి పొలాల్లో దొరికే పెండలం దుంపలను కూడా కాల్చి తినేవాళ్ళం. మా సరదాల్లో 'అమ్మే' ఎప్పుడూ 'ఆడవిలన్ లా' అడ్డుపడేది.

'మగపిల్లలతో ఆటలేంటే? హద్దూపద్దు లేకుండా పోతోంది' అంటూ అదమాయించేది - అందుకని అమ్మ నిద్రపోయినప్పుడో - పనిలో వున్నప్పుడో ఇటువంటి సరదాలు తీర్చేసుకునే వాళ్ళం.

పదో తరగతి పాసయ్యాక ఇంటర్ ఇందుపల్లిలో చేయాల్సి వచ్చింది. ఇందుపల్లి అమ్మ పుట్టిల్లు కావడమే ముఖ్య కారణం అయిపోయింది.

అప్పుడప్పుడు ఫ్రెండ్స్ రాసే ఉత్తరాలే తప్ప వేసవిలో కూడా అమ్మేరావడంతో ఆ రెండు సంవత్సరాలూ అక్కడే గడిచిపోయాయి.

అమ్మాయిల్లో చాలా మంది చదువు మానేస్తే అబ్బాయిలు మాత్రం ఉయ్యూరు జూనియర్ కాలేజ్‌లో చేరిపోయారని తెల్సింది.

ఇంటర్ పరీక్షలు రాసి వేసవి సెలవులకు తను పాలెం వచ్చింది. మళ్ళీ ఫ్రెండ్స్ - పాత జీవితం. 'పక్షికి రెక్కలొచ్చిన ఫీలింగ్. గాలికి పూలతావిలా మనసుకు స్నేహస్పర్శ.'

ఆ సమ్మర్ తన జీవితంలో మరుపురాని మధుర భావనయ్యింది.

దానికి తోడు బాబుతో స్నేహం మరో కోణంలో ఆవిష్కృతమైంది. అదే యిష్టం.

ఆ వేసవి సెలవులు ప్రత్యేక ఆకర్షణకు నెలవులయ్యాయి.

యవ్వన ప్రాంగణంలో 'ప్రేమ' నవవసంతాల్ని కురిపించింది.

'అక్కా! నువ్వలా కదలకే - బాబు' అంటూ గట్టిగా వాటేసుకుంటున్న సుమ మాటలతో ఊహల ఉయ్యాల ఒక్కసారిగా ఆగిపోయింది.

ఆ రాత్రి అలా కలత నిద్రతోనే గడిచిపోయింది.

తండ్రితో బాటు విజయవాడకు బయలుదేరిన హిమతో సుమ కూడా రెడీ అయిపోయింది.

బాలయ్య బండి తీస్తుంటే అనురాధాదేవి తనుకూడా బయలుదేరాలనే అభిప్రాయాన్ని వెంకటరత్నంగారి మాటలతో మార్చుకోవలసి వచ్చింది.

'నేను, స్వామి తాతను కోర్టులో దింపేసి - పిల్లలిద్దరినీ చౌదరిగారింట్లో దింపి - గోపాలకృష్ణగారింటికి వెళ్ళాలి. తిరిగి రావడానికి రాత్రి అయిపోవచ్చు. నువ్వూ నేనూ యిద్దరం లేకపోతే.. ' అంటున్న భర్త మాటను కాదనలేకపోయింది.

కానీ బోసుబాబు దీన్నెక్కడ కలుస్తాడోనన్న బెంగ.

'పెళ్ళైపోయి రెండేళ్ళయిపోయింది - ఇప్పుడు కలిసినా ఏమీకాదు.' మనసులో కదిలిన భావాలతో తృప్తిపడిపోయి - 'త్వరగా వచ్చేయండి' అంటూ ఇన్నోవాకి ఎదురొచ్చింది అనురాధాదేవి.

తల్లి వాలకాన్నే గమనిస్తున్న హిమ ఆమె మనసును పూర్తిగా చదివేసింది.

తననింకా ఇంటర్ మీడియట్ హిమగానే అనుమానిస్తోందని చిన్నగా నవ్వుకుంటుంటే -

'ఏయ్! అక్కా 'జోక్‌నుగానీ కేక్‌నుగానీ' నాతో షేర్ చేసుకోలేదనుకో ఆశకురుపులు గోరుచుట్టూ డెఫినెట్. నాది గ్యారంటీ.'

'అది కాదే చెల్లి నేను చెపితే వెరీ వెరీ సిల్లీ' అనేస్తావ్.

'అయితే - చెప్పు చెప్పు చెప్పు'

'రెండేళ్ళు - ఈ ఆనందాన్ని అనుబంధాన్ని వదిలి ఎలా వున్నానా అని అంటే అంతా గ్యాస్ 'నాదీ గ్యారంటీ' అంటావ్ - అసలు నవ్వెందుకొచ్చిందంటే - 'అమ్మకు చెప్పకుండా జంతికలు చేగోడీలు నొక్కేసిన నాచెల్లి స్కిల్స్ చూసి' దగ్గరకు తీసుకుని తలమీద ముద్దు పెడుతూ చెప్పింది హిమ.

'ఏం చేయమంటావక్కా? అమ్మేమో పెద్ద డిటెక్టివ్. చూసిందనుకో వందప్రశ్నలు - వెయ్యి చూపులు. '

ఇన్నోవా బయలుదేరి స్వామి తాత యింటి ముందు ఆగింది.

రమ్య పరుగెత్తుకుంటూ వచ్చి 'హిమక్కా నమస్తే' అంటుంటే.

'ఏయ్ రమ్యా! సుమక్క కూడా వుంది'. అంటూనే తాను చాటుగా తెచ్చిన 'సరంజామాను' రమ్యకిచ్చేసింది.

అంతలో స్వామితాత వచ్చేశాడు, వెంకటరత్నంగారికి నమస్కరిస్తు.

'రా స్వామీ! నువ్వు ముందుకురా' అంటూ బలవంతంగా కూర్చోబెట్టి హిమ పక్కనే సెటిల్ అయిపోతే సుమ బ్యాక్ సీటులోకి జంపైపోయింది.

'తాతా - అమ్మమ్మ లేదా? అని హిమ అడిగితే

'ఇంకా స్నానాలగది నుంచి రాలేదమ్మా' అన్నాడు స్వామి.

'పోన్లే వచ్చేటప్పుడు దర్శించుకుందాం' తేలిగ్గా చెప్పేసింది సుమ.

ఇన్నోవా' 'బొడ్డుపాడు' దాటుతుంటే - ఎదురొచ్చాడు బోసుబాబు తన బైక్‌మీద.

బోసుబాబును చూస్తూనే వెంకటరత్నం బండి ఆపించాడు.

ఇన్నోవాను చూసి బోసు బైక్ ఆపి వచ్చాడు.

దాదాపు ఆరడుగుల పర్సనాలిటీ -

ఈ రెండేళ్ళలో ప్రొఫెషన్ తెచ్చిన గాంభీర్యం ఓ నూతన వ్యక్తిని చూస్తున్న ఫీలింగ్. హిమ మనసు అదోలా అయిపోయింది. సైడ్‌గ్లాస్ దింపేసింది హిమ.

ఇన్నోవాలో హిమను చూస్తూనే త్రిల్లైపోయాడు బోసుబాబు.

గుండెల్ని తాకిన ఆనందాన్ని తన చిరునవ్వుతో దాచుకుంటూ 'హాయ్ హిమా! హౌ ఆర్ యూ?' అంటుంటే 'ఫైన్ బాబు, ఎలావుంది ప్రొఫెషన్?' కూడబలుక్కుంటూ సమాధానమిచ్చింది హిమ.

'అరేయ్ బోసూ! నువ్వుకూడా మాతో వచ్చెయ్ - 'వెంకటరత్నం మాటలకు వత్తాసుగా 'వచ్చేయండి లాయర్ సార్ ఒక్కదాన్నే బ్యాక్‌సీటుకు బలైపోతున్నాను' - సుమ అనేసింది.

'మీరు పదండి నేను చిన్నపని చూసుకుని మీకంటే ముందే వుంటాను కోర్టులో' - అని సున్నితంగా తిరస్కరిస్తుంటే -

'మీ బైక్‌కు పంక్చర్ అయిపోయి, అంతమంది ఆహ్వానించినా వెళ్ళలేదే అని డెఫ్‌నిట్‌గా ఫీలయిపోతారు. నాదీ గ్యారంటీ' అంది.

'నో ప్రోబ్లం సోమెనీ బస్సెస్ ఆర్‌దేర్' అంటే..

'బస్... బస్.. బస్' అంటూ మూతిముడుచుకుంది సుమ.

'స్వామి తాతా - మీరు మా ఆఫీస్‌లో దిగిపొండి. మన కేసు ఈవినింగ్ కొస్తుంది.',

'సీయూ సీమటపాకాయ్! సీయూ హిమా. వస్తాను సార్' అంటూ వెంకటరత్నంగారితో చెప్పి వెళ్ళిపోయాడు బోసు.

హిమ గుండెల్లో ఏదో చెప్పలేని బాధ -

'చూశావా హిమా! పెద్ద హీరోననుకుంటున్నాడు. ఏదో మనుమడు ఎండలో అవస్థపడిపోతాడు రమ్మంటే మామ్మ మాట కూడా వినకుండా ఎలా వెళ్ళిపోయాడో చూడు భడవ' అంటూ సుమ యిమిటేట్ చేస్తుంటే అందరూ నవ్వేసారు.

ఇన్నోవా దూసుకుపోతుంటే - అంతకంటే వేగంగా హిమ మనసును కమ్మేసాయి ఆలోచనలు.

'అమ్మ అడ్డుపడకపోతే తను బోసు భార్యనయ్యేది.'

హఠాత్తుగా వచ్చిన ఆ ఆలోచనతో తుళ్ళిపడింది హిమ.

'మొత్తానికి సాధించాడు'

తండ్రి కామెంట్‌తో ఈలోకంలోకి వచ్చింది హిమ.

'ఔను - భడవ ఎదిగిపోయాడు', మళ్ళీ మిమిక్రీ స్టార్ట్ చేసింది సుమ.

ఫ్రంట్ సీట్లో కూర్చున్న స్వామి తాత ముసిముసిగా నవ్వేసాడు.

'సుమమ్మా నీ యాక్షనంతా అమ్మమ్మతో చెప్తాలే' అంటుంటే

'ప్లీజ్ తాత ప్లీజ్ ఏదో అలా తమాషాగా అమ్మమ్మను ఇమిటేట్ చేసా' అంటూనే 'ఏమయ్యా ఎన్నిసార్లు చెప్పాలి ఆ చుట్టలు కాల్చి దగ్గు తెచ్చుకోవద్దని' మళ్ళీ యిమిటేట్ చేస్తే 'ఇంకా మానలేదా స్వామీ అడిగారు వెంకటరత్నంగారు.

'మానేసానయ్య ఏదో అప్పుడప్పుడూ'

'చిన్నాపెద్దా చూసుకోకుండా ఇలా కామెంట్ చెయ్యొచ్చా?'

'సారీ తాత సారీ' అనేసింది సుమ.

'పిల్లలకు అల్లరే అందం తల్లి. అసలు నువ్వెంత అల్లరి చేసేదానివో మర్చిపోయావా? '

'సీమచింత చెట్టెక్కి దిగడం రాక దింపమని తెగ అల్లరి చేసేదానివి. అమ్మమ్మ నిచ్చెనేసి దించేస్తే వెక్కిరించి పారిపోయేదానివి.'

'ఔనా! తమరికంత్ టాలెంటుందా?' అక్కను ముద్దుపెట్టుకుంటూ నవ్వేసింది సుమ.

ఇన్నోవా వచ్చి బోస్ ఆఫీసు ముందు ఆగింది. స్వామి తాత దిగిపోయాడు.

బోస్ కోసం హిమకు తెలియకుండానే కళ్ళు వెతికేసాయి. 'ఇంకా రాలేదు' అనుకుంది.

'అమ్మా హిమా ఏదో షాపింగ్ అన్నావు ఎక్కడ దిగాలో చెబితే మిమ్మల్ని దించేసి నేనో గంటలో వచ్చేస్తాను.'

తండ్రి మాటలకు బదులు చెప్పకుండా ఆలోచనల్లో పడిపోయింది. బోస్‌తో మాట్లాడాలని వున్నా ఇది కరెక్ట్ టైం కాదనుకుంది.

'అయితే నాన్నా - నన్నూ, చెల్లిని గోపాలకృష్ణగారింటిలో డ్రాప్ చేయండి.'

హిమ నిర్ణయానికి ఆశ్చర్యపోయాడు వెంకటరత్నం.

'ఔను నాన్నా. గోపాలకృష్ణ అంకుల్‌తో నాకు చాలా చనువుండేది కదా! బహుశా మర్చిపోయుండరు. పలకరించినట్లుంటుంది. పైగా వాళ్ళమ్మాయి రజని అప్పుడప్పుడు ఫ్యాక్టరీకొచ్చేది. ఇద్దరం ఆటలాడుకునేవాళ్ళం కూడా.'

'చాలా కాలం అయిపోయింది రజని నిన్ను గుర్తుపడుతుందంటావా?' అడిగారు వెంకటరత్నంగారు.

'చూద్దాం నాన్నా.'

'నీ యిష్టం' అంటూనే 'బాలయ్యా! నన్ను బీసెంట్ రోడ్డులో దించేసి అమ్మాయిల్ని ఆకాశవాణి దగ్గర గోపాలకృష్ణగారిల్లు తెలుసుగా..? '

'తెలుసు సార్. పోయిన నెల వెళ్ళాం ఆ యిల్లే కదా?'

'అవును ఇంటి నెంబరు నూట నలభైనాలుగు.'

గోపాలకృష్ణగారిల్లు మూడంతస్థుల బంగ్లా - ఎక్స్టీరియర్ చాలా రిచ్‌గా వుంది. 'బివేర్ ఆఫ్ డాగ్స్' బోర్డుతో రిచ్ పీపుల్ రెసిడెన్సీగా చెప్పకనే చెబుతోంది. డ్రైవర్ బాలయ్య దిగి బెల్ కొట్టాడు.

'ఎవరూ?' అంటూ వచ్చింది. పని పిల్లలా ఉంది. కార్ డోర్ విండోలోంచి తల బయటికి పెట్టి 'మా అక్క హిమబిందు. రజనిగారిని కలవాలని వచ్చారు వున్నారా?' అడిగింది సుమ.

'ఆ.. ఉన్నారండి రండి' అంటూ కుక్కను కట్టేసి - గేట్ ఓపెన్ చేసింది ఆ అమ్మాయి.

అంతలో 'ఎవరమ్మా?' అంటూ వచ్చిన గోపాలకృష్ణ కార్‌ని, కార్ డ్రైవర్‌ని గుర్తుపట్టి - 'తల్లీ నువ్వా? హిమబిందువు కదూ? ' అంటుంటే చిరునవ్వుతో వచ్చి ఆయన పాదాలకు నమస్కరించింది హిమ.

'ఎప్పుడొచ్చావమ్మా - నాన్నేరీ?'

'ఈ అమ్మాయి..? రా తల్లీరా' అంటూ లోపలికి నడిచారు

'ఏయ్ రజనీ ఎవరొచ్చారో చూడు. అమ్మని రమ్మని చెప్పు.' కేక పెట్టారు.

అందరూ సోఫాల్లో సెటిలైపోయారు. రజని వచ్చి హిమను ఆనుకుని కూర్చుంది. గోపాలకృష్ణ భార్య విజయలక్ష్మి సుమను తన దగ్గర కూర్చోబెట్టుకుంది.

'చెప్పమ్మా - అమెరికా విశేషాలు?' గోపాలకృష్ణ అడిగారు.

'ప్రత్యేకం అంటూ ఏమీ లేదంకుల్! అంతా ఓకె. వెళ్ళి రెండేళ్ళు అయిపోయింది. ఇంటిమీద బెంగ. ఇద్దరం వద్దామంటే మీకు తెలుసుగా ఐటి పరిస్థితి? లీవ్ పెడితే అదే ఆఖరిరోజు.'

'ఔను మా అబ్బాయి కూడా ఫోన్ చేశాడు. వాడి కంపెనీ మూసేస్తున్నారట ఇండియా వచ్చేస్తానంటున్నాడు. '

'రమ్మనండి అంకుల్ మా ఊరొచ్చి మిల్లు ఓపెన్ చేసి పల్లెటూరి జీవితాన్ని, ఆ కాలవని, పడవల్ని చూసి థ్రిల్లై పోకపోతే నాదీ గ్యారంటీ' సుమ కామెంట్‌తో ఏదో ఫ్లాషైపోయినట్లు, 'అవునంకుల్ మీకు గుర్తుందా! నా స్కూల్ ఏజ్‌లో మిల్లంతా తిప్పి చూపిస్తూ ఎప్పటికైనా ఈ చెరువు గట్టుమీద ఓ ఒంటి స్థంభం మేడ కట్టించి.. అందులో తిరుగుతూ చుట్టూ పరుచుకున్న పొలాల్ని ప్రక్కగా పారుతున్న బందరు కాలువ అందాల్ని తనివితీరా చూడాలనేది నా కోరికరా' అనేవారు.

'ఔనమ్మా ఈ బిజీ లైఫ్ నుంచి దూరంగా ప్రశాంతంగా గడపాలనుందిరా' ఏదో ఊహల్లోకి వెళ్ళిపోతూ అన్నారు గోపాలకృష్ణ.

'రండంకుల్. మా ఊళ్ళో చాలామంది ఇళ్ళల్లో మీ ఫోటోనే వుంది. మీరు మళ్ళీ వచ్చి మిల్లు ఓపెన్ చేయాలని కోరుకుంటున్నారు. స్వామి తాతకైతే మీరే దేవుడు. నాదీ గ్యారంటీ. ' సుమ మాటలతో మూడీ అయిపోయారాయన.

'కానీ హిమా! ఆ ఫ్యాక్టరీ గొడవలతో ఆ ఊరిమీద మమకారం చచ్చిపోయింది' జీరగా పలికింది గోపాలకృష్ణగారి గొంతు.

'మళ్ళీ ఓపెన్ చేయండంకుల్. మనూరికి మంచి సిమెంట్ రోడ్ కూడా పడింది. లాభాలు నాదీ గ్యారంటీ. '

విజయలక్ష్మి సుమను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది.

'నీ నోటి చలవతో నువ్వన్నట్లే జరిగితేనా? రాత్రి మా అబ్బాయి కూడా ఏదైనా పల్లెటూరికి పోదాం ప్లాన్ చేయండి అన్నాడు.'

'అంకుల్ మీతో చనువుంది కాబట్టి నాదో విన్నపం. తప్పయితే క్షమించండి' అని ఆగిపోయింది హిమ. 'ప్రొసీడ్' అన్నట్లు తలూపారాయన.

'దాదాపు వంద కుటుంబాలకు మీరు ఆరాధ్య దైవం. మీరు ఫ్యాక్టరీ మీద చాలా నష్టపోయారని డాడీ చెప్పారు. కానీ మిమ్మల్నే నమ్ముకున్న కార్మికుల జీవితాలే నాశనమైపోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మీరు తీసుకున్న కఠిన నిర్ణయంతో స్వామితాత కోర్టుకెళ్ళారు. ఆయన కూడా కార్మికుల కోసం ఉన్న ఆస్థినంతా అమ్మేశారు. నాన్నగారితోపాటు రైతులంతా సాయం చేస్తున్నారు కానీ అన్ని కుటుంబాలకు ఎన్నిరోజులు చేయగలరు? మీరే చెప్పండి అంకుల్.'

'ఐ ఎగ్రీ.. బట్ ఓసారి నా సైడ్ నుంచి కూడా.'

'డెఫినెట్‌గా ఆలోచిద్దాం అంకుల్. నాకు మా అమ్మా నాన్న ఇచ్చిన కట్నం డబ్బులు, పొలం కూడా మా ఊరి కోసమే ఇచ్చేద్దామని అనుకుంటున్నాను. నాతోబాటు స్వామితాత కూడా వచ్చారు. మీరు సరే అంటే పిలుస్తాను. వాళ్ళంతా కోరుకునేది వాళ్ళ జీవితాలతో బాటు మీ మేలుకూడా. మళ్ళీ ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభిస్తానంటే వాళ్ళకి చెందవలసిన ఎరియర్స్, గ్రాట్యుటీలాంటివన్నీ వదిలేస్తామంటున్నారు. '

హిమబిందు మాటలు తన మనస్సును తాకినట్లు మౌనంగా ఉండిపోయారు గోపాలకృష్ణ.

'కానీ కోర్టులో కేసు వేరే విధంగా వుంది కదమ్మా?' నెమ్మదిగా చెప్పారు గోపాలకృష్ణ.

'కోర్టు విషయం నేను చూసుకుంటాను. బోసుబాబుతో నేను మాట్లాడతాను అంకుల్.'

'అయితే నాకు పదిరోజులు టైమిస్తే స్టేట్స్ నుంచి మా అబ్బాయి వరుణ్ వచ్చేస్తాడు వాడితో కూడా మాట్లాడి..'

ఆ మాటలతో ఒక్కసారిగా హిమ లేచి పాదాలకు నమస్కరిస్తుంటే ఆగని ఆమె ఆనంద భాష్పాలు గోపాలకృష్ణగారి కాళ్ళమీద రాలాయి.

హిమను లేవనెత్తి 'ఏంటిరా ఇది నేనూ మనిషినేరే' అంటూ 'ఏయ్ లక్ష్మి' అంటూ పిలుస్తూంటే

'అంతా రెడీయమ్మా' బదులిచ్చింది లక్ష్మి

అందరికీ వీడ్కోలు చెప్పి బయలుదేరుతుంటే రజనీ వచ్చి 'నేను వస్తానక్కా' అంది హిమతో.

'ఇప్పుడు వద్దక్కా రెండురోజుల తర్వాత మళ్ళీ వస్తాం. రెండు పిక్చర్స్ లాగించేసి, షాపింగ్ చేసేసి మనూరెళ్ళిపోదాం.'

'చూసారా ఈ కాలం పిల్లల ప్లాన్స్' అంటూ గోపాలకృష్ణగారిని చూస్తూ ఏదో ఆలోచనలో మునిగిపోయిన భర్తను డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక హిమను, సుమను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది విజయలక్ష్మిగారు.

'అయితే అప్పుడే రండమ్మాయిగారు - నాకూ మీ ఊరు చూడాలనుంది' అంటూ గారాలు పోయింది లక్ష్మి.

గోపాలకృష్ణగారొచ్చి అందరికీ వీడ్కోలు చెప్పారు. మరోసారి ఫ్యాక్టరీ గురించి భరోసా యిచ్చారు హిమకు.

సుమ హిమలు అందరికీ వీడ్కోలు చెప్పి ఆనందంగా బయలుదేరారు.

**హిమ చెప్పిన విషయాలు** విని ఏనుగెక్కినంత సంతోషపడిపోయారు హిమ తండ్రి.

'మనిషి మంచోడే అయితే ఓగిరాల బాపిరెడ్డి ఉచ్చులో పడిపోయి స్వామితాత మీద ద్వేషం పెంచుకున్నాడు. మంచిపని చేశావమ్మా!' పొగిడేశారు హిమను.

ఇన్నోవా బోసుబాబు ఆఫీసు ముందు ఆగిందో లేదో బోస్ వచ్చి ఫ్రంట్ డోర్ ఓపెన్ చేశాడు. డ్రైవర్ బాలయ్య పరిగెత్తుకొచ్చి లెఫ్ట్‌డోర్ ఓపెన్ చేస్తుంటే -

'ఏరా బాలయ్యా! అమెరికా అక్క అనా! ఇంత బిల్డప్ యిస్తున్నావ్. భూమిక హైటూ ఇలియానా వెయిటున్న ఈ ఐశ్వర్యారాయ్ కనిపించలేదా! నీ ఉద్యోగం పోవడానికి నాదీ గ్యారంటీ' అంటుంటే -

'ఐశ్వర్యారాయ్ మిడిలేజికొచ్చేసింది - ఏ దీపిక పడుకునేతోనో, కలర్స్ స్వాతితోనో పోల్చుకుంటే బాగుంటుంది' తనొచ్చి డోర్ తీస్తూ అన్నాడు బోస్‌బాబు.

'నువ్వు నాకు నచ్చావురా భడవా - కీపిటప్ పైకొస్తావ్!' అంటూ చెయ్యెత్తి ఆశీర్వదిస్తుంటే - 'ధన్యోస్మి' అన్నాడు బోసుబాబు.

ఆ సీను చూస్తుంటే -

తనెంత మిస్సయిందో గుండెల్ని కలిచివేస్తుంటే, హిమ కారు దిగింది. హిమతోబాటు అందరినీ తన ఛాంబర్‌లోకి ఆహ్వానించాడు బోసుబాబు.

స్వామితాతను చూస్తూ 'తాతా! మీ అందరికీ మంచి వార్త తెచ్చింది హిమ.'

అంతలో సుమ 'గోపాలకృష్ణ అంకుల్' అంటుంటే 'నువ్వు ఆగవే తల్లీ ముందు పుట్టింది అది' అన్నారు వెంకటరత్నంగారు.

తండ్రిని అదోలా చూస్తూ 'ఎంత ముందొచ్చినా చెవులు చెవులే - కొమ్ములు కొమ్ములే!'

బోసుబాబు, అసిస్టెంట్ సర్వ్ చేసిన, ఐస్క్రీం దాడి చేస్తూ 'చెవులతల్లి మొదలు పెట్టు. ఏం చేస్తాం!? అమెరికా అమ్మాయా మజాకా?' అంటుంటే కళ్ళెత్తి చూస్తూ తననే గమనిస్తున్న బోసుబాబు చూపులతో తత్తరపడి పోయి సర్దుకుని అంతా వివరించింది హిమ.

అంతా విని స్వామితాత చేతులు పైకెత్తి 'ఎంతయినా ఆయన దేవుడమ్మా' ఆరాధనా పూర్వకంగా అన్నాడు.

'కంగ్రాచ్యులేషన్స్ హిమా! అమెరికాలో అడుగుపెట్టినా ఆంధ్రదేశాన్ని మర్చిపోలేదు. మా అదృష్టం' షేక్ హ్యాండ్ యిస్తూ అన్నాడు బోసు. అతని చేతి స్పర్శతో ఒక్కసారిగా షేక్ అయిపోయింది హిమ. బుగ్గలు సిగ్గుతో ఎర్రబడిపోయాయి. కర్చీఫ్ అడ్డం పెట్టుకుంటూ ఐస్క్రీం బౌల్ అందుకుంది తన అవస్థకు తనే ఆశ్చర్యపడిపోతూ.

'అందుకేనేమో వాళ్ళ లాయర్ వాయిదా అడిగాడు. ' బోసు వెంకటరత్నంగారితో అన్నాడు.

'అయ్యుండొచ్చు - నువ్వేంట్రా నీ సీట్‌లో కూర్చోకుండా?'

'అది క్లైంట్స్‌తో మాట్లాడే టైంలో కూర్చునే సీటు - ఆత్మీయులతో మాట్లాడేటప్పుడు కూర్చునేది కాదు' బిడియంగా అన్నాడు.

'మీ మదర్ మీకిలా బోస్ అని ఎందుకు పేరు పెట్టారో పాపం. ఎంచక్కా ఏ బుచ్చిబాబనో పిచ్చిబాబనో పెట్టుంటే ఆప్ట్‌గా వుండేది. నాదీ గ్యారంటీ,' బోస్‌ను ఆటపట్టించింది సుమ. బోసు నవ్వేసాడు.

'ఎలావుంది బాబు ప్రాక్టీస్?' ఏదైనా మాట్లాడాలనీ, లేకపోతే తనబలహీనత బయటపడిపోతుందని అడిగింది.

'నో ప్రోబ్లం. నౌ ఐయాం వెరీ హ్యాపీ' హిమ వంక అదోలా చూస్తూ అన్నాడు.

'ఆయనకేంటక్కా రెండు మూడు కోట్లు సంపాదించారు' కోట్లు అన్న పదాన్ని వత్తి పలుకుతూ సర్కాస్టిక్‌గా అంది సుమ.

'తమరికొక కోటు కావాలంటే దానం చేస్తాను. కాకపోతే ఓ మూల ఎలుకలు కొట్టేసాయి' రిటార్టిచ్చాడు బోసు.

'అయ్యా! మనం బయలుదేరదామా! ' వర్షం వచ్చేలా వుంది స్వామితాత ప్రపోజల్ పెట్టాడు.

'అప్పుడేనా' అనిపించింది హిమకు.

'అమ్మెలా వున్నారు?'

'షి ఈజ్ ఫైన్.'

'అమ్మను చూడాలి యింటికొస్తాను.'

'ఎందుకు నీకు శ్రమ? రేపు అమ్మనే పంపిస్తాను.'

'నేనెళ్ళి తీసుకొస్తాన్లే అక్కా' బోస్ తల్లి తనెప్పుడెళ్ళినా కొసరి కొసరి పెట్టే కజ్జికాయల్ని తల్చుకుంటూ అంది సుమ.

'కాదు నేనే వస్తాను' కన్ఫంగా చెప్పింది హిమ.

బోసు గుండె లయ తప్పింది.

ఏదో జ్ఞాపకం గుండె తలుపు తట్టినట్టైంది. తనకు భార్య కావలసిన హిమతో ఈ చెత్త సంభాషణ ఎబ్బెట్టుగా అనిపించింది.

'ఇక బయలుదేరుదాం నాన్నా.' మాటలు పొడిగించడం ఇక సాధ్యం కాదని అర్థం చేసుకున్న హిమ బయలుదేరిపోతుంటే బేలగా చూశాడు బోసు.

'లాయర్ సార్ మీరూ రావచ్చు మాతో. ఫీజేం ఇవ్వక్కర్లేదు' సుమ ఆఫర్ ఇచ్చింది.

'థాంక్యూ వెరీమచ్ - ఫర్ యువర్ కైండ్ ఆఫర్. ఆఫీస్‌లో పనుంది. రేపు ఫైల్ చేయాల్సిన కేసొకటుంది. రేపు కలుద్దాం' హిమ సాన్నిధ్యంలో అనీజీ ఫీలింగ్.

'అయితే రేపు వస్తావు కదా? కలుద్దాం' అంటూనే ఇన్నోవా ఎక్కేశారు వెంకటరత్నంగారు.

గుండెల్లోని తడి కళ్ళల్లో కనిపించకూడదని చూపులు తిప్పుకుంది హిమ.

ఇన్నోవా కదిలిపోయింది.

తడబడే కాళ్ళు గుండె బరువును మోయలేవేమో అన్నట్లు వీక్‌గా అనిపిస్తే అన్యమనస్కంగా అతి నీరసంగా వచ్చి ఆఫీస్ సోఫాలో కూలబడిపోయాడు బోసుబాబు.

జ్ఞాపకాల ఝురులు ఒక్కసారిగా ముంచెత్తాయి.

హైస్కూలు జీవితం హాయిగా ఆహ్లాదకరంగా గడిచిపోయిందంటే హిమబిందే కారణమన్న విషయం తను ఇంటర్ చేయడానికి ఇందుపల్లి వెళ్ళిపోయాకే అర్థమైయింది. ఆ సమ్మర్‌లో లంగా జాకెట్టుతో అదృశ్యమైపోయిన హిమ లంగా వోణీలతో ప్రత్యక్షమైపోయిన క్షణాలు ఇప్పటికి మస్తిష్కపొరల్లో ఉండిపోయాయి.

'హాయ్ బాబూ! ' అంటూ అరవిరిసిన గులాబీలా దర్శనమిచ్చిన హిమను చూస్తుంటే మతేపోయింది. 'విచ్చుకుంటున్న యవ్వన చిహ్నాలు గుచ్చుకుంటున్న అపురూప అందాలు' కళ్ళు తిప్పుకోలేకపోయాడు.

'బాబూ' అంటూ కుదిపితేగానీ ఈ లోకంలోకి రాలేకపోయాడు తను.

'చాలా రోజుల తరువాత చూశాను కదా గుర్తుపట్టలేకపోయా' తడుముకోకుండా అబద్ధమాడేశాడు.

'ఔను మరి దూరంగా ఉంటేనే నునుపుగా ఉంటాయి కొండలు. దగ్గరున్న కొండలు ఎంత నునుపుగా ఉన్నా కనిపించవులే' కొట్టేసింది దెబ్బ నిర్మల.

'తల్లీ రెండేళ్ళకే మనుషుల్ని మర్చిపోతున్నాడు బోసు. డిగ్రీ అయినా కలిసి చేయవే' చిన్నగా నొక్కింది టాన్యా.

'మా అమ్మ ఒప్పుకోదు. అందులోనూ రోజూ వుయ్యూరు వెళ్ళి రావాలంటే? ' అమాయకంగా చెప్పింది హిమ.

'అదేంటే మీకు కారుందిగా ఎంచక్కా?'

'కారెందుకే బాబూ - బాబు బైకుందిగా' ఇద్దరూ కోరస్‌గా బనాయిస్తుంటే చిన్నగా అర్థమై తను జంప్పై పోవాలనుకుంటుంటే.

'ఊళ్ళో అడుగుపెట్టిన ఊర్వశికి తామర పువ్వులు, తాటి ముంజెలేనా, యింకేమైనా?' నవ్వుతూ వచ్చేసింది అన్నపూర్ణ, హేమలతతో.

'వుడ్ బి గ్రాడ్యుయేట్ - ప్రెజంట్ గ్రాడ్యుయేట్ మధ్యలో మనమెందుకే పల్లెటూరి గబ్బిలాల్లా' టాన్యా టీజ్ చేసింది.

'గబ్బిలాలు కాదే వుడ్‌బి పెళ్ళి కూతుర్స్' హిమ కరెక్ట్ చేసింది.

'మరీ అంత లేదులే ఇరవై ఐదు దాటిన చక్కనమ్మలే చుక్కల్లో వెదికేస్తున్నారు. గ్రూముల కోసం. వాళ్ళను దాటి మనదగ్గరకొచ్చే మొనగాళ్ళెవరే బాబూ? '

రెండు సంబంధాలు తప్పిపోయిన అక్కను చూపించింది నిర్మల.

ఈ అమ్మాయిల మధ్య ఏం చేయాలో అర్థంకాక తను జంప్పైపోవాలని నిర్ణయానికొచ్చేశాడు. కానీ కళ్ళముందు హిమ.

'హిమగిరి సొగసులూ' పాట గుర్తుకొచ్చేసింది.

హిమ పరిస్థితి అందుకు భిన్నంగా లేదనిపించింది, అంత నిస్సహాయ పరిస్థితిలోనూ హిమ నయనాలు అందిస్తున్న సందేశాలు విరితూపుల్ని సంధిస్తున్నాయ్!

అదో అలౌకిక స్థితి. 'నిర్వచనాలకందని - అనిర్వచనీయానుభూతి' కళ్ళముందు హిమ తప్ప మరేమీ కనిపించని స్థితి, తొలిసారిగా అయోమయ పరిస్థితి.

'అయితే ఓ పని చేయచ్చు - మా అందరినీ కంకిపాడు తీసుకెళ్ళి మూవీ చూపించి మంచి హోటల్లో ట్రీటివ్వచ్చు.' టాన్యా మాటలతో గతుక్కుమంది గుండె

అందరూ టీనేజ్ అమ్మాయిలు. ఉన్నది పల్లెటూరు. పైగా హిమ వాళ్ళ అమ్మ? ఆమె తలుపుతోనే చెమటలు పట్టేశాయి.

'అక్కా! అమ్మ రమ్మంది.'

హిమ చెల్లెలు సుమ రాకతో మనసు తేలికైపోయింది.

'వెళ్ళు తల్లీ వెళ్ళు' అంటూ తన కోపాన్ని ప్రదర్శించింది నిర్మల.

'మళ్ళీ సాయంత్రం కలుద్దాం. సీయూ బాబూ' అంటూ చెల్లితో వెళ్తూ ఒక్కసారి వెనుతిరిగి చూసిన చూపు తన గుండెల్లో సూటిగా దిగిపోయింది.

'సరే బోసూ! అదెళ్ళిపోయింది మేమున్నాంగా!' టాన్యా దీర్ఘం తీస్తుంటే

'మన గ్రాడ్యుయేట్ వీరుడి సంగతి తెలిసి కూడా' చురక అంటించింది హేమలత, చచ్చానా బాబూ అనుకుంటుంటే.

'మనూరి అబ్బాయే కదే మనమే బనాయిస్తే బాలుడు బలైపోడూ!? వదిలేయండి. మనందరికీ రేపు ఉయ్యూరు నుంచి పిజ్జాలు, ఐస్‌క్రీంలు తెస్తాడు. కదా బోసుబాబూ? ' అన్నపూర్ణ అమాయకంగా అడిగింది.

తనకు ఓకే అనక తప్పలేదు.

'హిమని, సుమని మర్చిపోకు' హెచ్చరించింది టాన్యా. బ్రతుకు జీవుడా అంటూ బయటపడ్డాడు తను.

'సార్' అంటూ అసిస్టెంట్ పిలవడంతో ఊహల్నించి బయటపడ్డాడు బోసుబాబు.

పాలెం ప్రజలకు ఆ రైస్ మిల్లే ఊరిమధ్య వెలిసిన దేవాలయం. ఆ మిల్లు ముందున్న తురాయి చెట్టే ప్రకృతి ప్రసాదించిన అపురూప కట్టడం. వానకు, ఎండకూ రక్షణ కవచంలా మాత్రమేగాక - ప్రతి పండగకూ పబ్బానికీ ఆ ఊరిలో జరిగే ప్రతి వేడుకకూ మూలం, ఆధారం ఆ తురాయి చెట్టే.

ఎవరు ఎలాంటి వేడుక చేయాలన్నా ఆ తురాయి చెట్టుక్రింద చేయడం ఆనందదాయకమైన ఆనవాయితీ.

ఫంక్షన్ ఎవరిదైనా ఆ ఊరి ప్రజలంతా కార్యకర్తలే.

ఫ్యాక్టరీ ముందు వంద గజాల దూరంలో బందరు కాలువ ఒడ్డున విశాలంగా వ్యాపించిపోయిన ఆ చెట్టే ఆ ఊరి ప్రజల ఉమ్మడి ఆస్తి.

బందరు కాలువలో ఏ పడవ ప్రయాణం చేస్తున్నా ఆ చెట్టు నీడే విశ్రాంతి మందిరం, ఆ ఊరికి గుర్తింపు. అందమైన గులాబి రంగుతో అలరించే పూలతో ఆమడ దూరం నుంచి కనువిందు చేసేది ఆ తురాయి చెట్టే.

వంద గడపల ఆ ఊరి ముత్తైదువుల గుడి రైస్ మిల్లయితే, గోపురం ఆ వృక్షమే. ఆ ఊరి సగం జనాభా రైతులైతే మిగిలిన వారంతా మిల్లు కార్మికులే.

ఎడ తెగని లారీల మోత, పడవ సరంగుల పాటల ఘోష, నిర్విరామ ఫ్యాక్టరీ రొదలతో, నిత్యకళ్యాణం పచ్చతోరణంలా వుండేది ఒకప్పుడు.

అది ఐదు సంవత్సరాల క్రిందటి మాట.

కానీ యిప్పుడు?

శబ్ధం చేయని ఫ్యాక్టరీ నిద్రలో వుంది. లారీలు తిరగవలసిన దారి బోసిపోయింది. పడవలు తిరుగుతున్నా అక్కడ ఆగే సరంగే లేడు.

రైతులు వ్యవసాయం చేస్తున్నా మిల్లు మూతబడటంతో ధాన్యం ఖరీదు చేసే స్థానిక వ్యాపారి లేడు.

ప్రక్కనున్న ఓగిరాలే ఆధారం. ఆ ఊరి మోతుబరి. ఆ ఊరి రైస్‌మిల్లు యజమాని బాపిరెడ్డే అతని దయాదాక్షిణ్యాల మీదే రైతుల జీవితాలు ఆధారపడిపోయాయి. ఆయన చెప్పిందే ధర, ఇచ్చిందే రొక్కం. దాదాపు మిల్లు కార్మికులందరూ రైతు కూలీలుగా మారిపోయారు. అప్పటివరకు మోతుబరులనిపించుకున్న రైతులు, తమ పొలాలు కౌలుకిచ్చి ఓగిరాలకు వలసపోయారు.

ఇన్ని రోజుల తర్వాత మళ్ళీ యిప్పుడు 'తురాయి చెట్టు' హుషారుగా వూగిపోతోంది.

స్వామితాత ఫ్యాక్టరీ అరుగు మీద కూర్చుని ఆనందాన్ని అందరికీ పంచిపెట్టే ప్రతినిధిగా భాసిస్తున్నాడు. దాదాపు వందమంది పిల్లా పెద్దా ఆయన ముందు గుమికూడిపోయారు. ఆయన ప్రక్కనే లాయర్ బోసుబాబు కొంతమంది ఊరి ప్రముఖులు కూర్చున్నారు.

ఆనందంతో చెమరుస్తున్న తడి బాష్పాలుగా రూపాంతరం చెంది కళ్ళను కాసారంలా మార్చి చెక్కిళ్ళ మీదుగా ప్రవహిస్తుంటే తన భుజం మీదున్న కాషాయ కండువాతో కళ్ళొత్తుకుంటూ అందరినీ తేరిపారా చూశాడు.

అందరి ముఖాల్లోనూ ఆత్రుత ఆనందం మిళితమైపోయిన భావన.

'కార్మిక సోదరులారా! ప్రస్తుతం రైతు కూలీలుగా బ్రతుకు బండిని ఈడుస్తున్న మనం పునర్జన్మ పొందబోతున్నాం. మూతపడిన మన మిల్లు మళ్ళీ మునుపటిలా మార్పుచెందబోతోంది.'

అందరూ సంతోషంతో చప్పట్లు కొడుతుంటే ఆగండి అన్నట్లు సైగ చేసి, 'మన కోసం మన బోసుబాబు కోర్టులో పోరాటం చేస్తూనే వున్నాడన్న విషయం మీ అందరికీ తెలిసిందే తన కృషి పట్టుదలకు తోడుగా మనూరి ముద్దుబిడ్డ వెంకటరత్నంగారి అమ్మాయి

హిమబిందు కూడా నిలిచింది. ఆ అమ్మాయి మనందరి కోసం గోపాలకృష్ణగారితో మాట్లాడింది. మనందరి అదృష్టం ఆ మహానుభావుడు అనుకూలంగా స్పందించారు. అమెరికా నుండి వస్తున్న వరుణ్‌బాబు ఈ ఫ్యాక్టరీ బాధ్యతలు స్వీకరిస్తారని కూడా తెలిసింది.'

ఎప్పుడు విజయవాడనుంచొచ్చినా తమ పిల్లలతో ఆడుకున్న వరుణ్ బాబు, రజనీలు కార్మికుల మనసుల్లో మెదిలారు. మరోమారు హర్షధ్వానాలు చేశారు.

అంతలో వెంకటరత్నంగారి ఇన్నోవా వచ్చి ఆగింది.

బాలయ్య డోర్‌లన్నీ ఓపెన్ చేశాడు. ముందు సీట్లోంచి వెంకటరత్నంగారు, వెనుక సీట్లోంచి హిమ, సుమలు దిగారు.

సుమ పరిగెత్తుకొచ్చి స్వామితాతకు ముద్దుపెట్టి అందరికీ చెయ్యూపి నేను అమ్మమ్మ దగ్గరకు వెళ్తున్నాను మళ్ళీ వస్తానంటూ తుర్రుమంది.

వెంకటరత్నంగారిని చూస్తూనే బోసు నిలబడిపోయాడు.

మరోమారు అందరూ చప్పట్లు కొట్టేశారు.

హిమ తండ్రి ప్రక్కనే నిలబడి అందరికీ నమస్కరించింది.

ఒక్కసారిగా ఆనందం అర్ణవమైపోయింది.

బోసుబాబు గుండె లయ తప్పింది.

సింపుల్ డిజైన్ చీరలో పుత్తడి బొమ్మలా మెరిసిపోతున్న హిమను కన్నార్పకుండా చూశారందరూ.

'ఈ అమెరికా అమ్మాయి మా అమ్మాయే' అందరూ గర్వంగా అనుకున్నారు.

'అమ్మా హిమా. నీ ముద్దుమాటలు విని చానాళ్ళైపోయిందిరా! మాట్లాడు తల్లీ.' స్వామితాత ఆప్యాయంగా అడిగాడు.

'తాతయ్యా నేనేం మాట్లాడను?'

'అదే తల్లీ గోపాలకృష్ణగారేమన్నారు? ఫ్యాక్టరీ గురిచిన విషయాలే.'

హిమ తలూపి కార్మికులవైపు చూసింది. అందరూ మౌనముద్ర పెట్టేశారు. అందరి ముఖాల్లోనూ ఉత్కంఠ.

'నేనేం కొత్తమ్మాయినికాదు. ఇక్కడే పుట్టి పెరిగి పెళ్ళిచేసుకుని అమెరికా వెళ్ళాను. నాన్నగారు ఫోన్‌లో చెప్పిన విషయాలే నాకు తెలుసు. ఇప్పుడు చూస్తుంటే ఎంత నష్టం జరిగిపోయిందో అర్థమైంది, స్వామి తాతను చూస్తుంటే స్వామి తాతేంటి మీలో ఎవ్వరిని చూసినా చాలా బాధ కలుగుతోంది.

పెద్దలకు పనిలేదు - పిల్లలకు చదువులేదు, అంతెందుకు ఎవ్వరికీ సరైన బట్టలు కూడా లేవు. చాలా హర్ట్ అయ్యాను. మన మిల్లుకేసు కోర్టులో ఉందని నాన్నగారు చెప్పారు. గోపాలకృష్ణ అంకుల్ చాలా మంచివారు. కానీ యింత కఠినమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థంకాలేదు.

'అంతా బాపిరెడ్డిగాడి కుట్రే' అందరూ కోపంగా అరిచారు.

'నేను గోపాలకృష్ణ అంకుల్‌తో మాట్లాడాను. ఫ్యాక్టరీ మూసేసినందుకు ఆయనకూడా బాధపడుతున్నారు. ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించమని అడిగాను. అందుకాయన 'తప్పక ఆలోచిస్తాను. ఓ పదిరోజుల్లో మా అబ్బాయి వరుణ్ వస్తున్నాడు. వాడితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాన'న్నారు. స్వామితాత గురించి రైతులు చేస్తున్న సాయం గురించి చెప్పాను. ఆయన నాకు దాదాపు మాటిచ్చారు' హిమ ఆగింది.

'మిల్లు ఓపెన్ చేస్తే లాభాలు నాదీ గ్యారంటీ అని నేను కూడా మాటిచ్చాను' ఎప్పుడొచ్చిందో స్వామితాత ప్రక్కన చేరిపోయింది సుమ.

అందరూ హాయిగా నవ్వేసారు.

అంతలో బోసుబాబు వచ్చేసాడు. అందరూ అతని చుట్టూ మూగిపోయారు.

✻✻✻

**'అక్కాజీ! అమ్మమ్మగారు ఈ అమెరికా అమ్మాయిని** చూడాలని తెగ బెంగపెట్టేసుకుని కలవరించేస్తున్నారంటే - పచ్చి నిజం. నాదీ గ్యారంటీ' అన్న సుమ మాటలు వింటూ స్వామితాత నవ్వేస్తూ

'నిన్న నువ్వొచ్చిన టైంలో స్నానం గదిలో వుందని మనం వెళ్ళిపోయాం కదా! నన్నెందుకు పిలవలేదని రాత్రంతా ఒకటే సతాయింపు - చెప్తే వినదే'.

'తాతాజీ.. బిందు తల్లి మాటలు అమ్మమ్మను హిమంలా కరిగించేయపోతే నాదీ గ్యారంటీ.'

'కబుర్లపోగు' - వెంకటరత్నంగారిని చూస్తూ స్వామితాత ఆనందంగా అన్నాడు.

హిమ, సుమలు అలా కలిసి వెళ్ళిపోతుంటే 'బంగారు తల్లులు' స్వామితాత తనలో తనే అనుకుంటూ ఉద్వేగానికి లోనయ్యాడు.

✻✻✻

స్వామితాత యిల్లు - పొందికగా వున్న చిన్న పెంకుటిల్లు.

గుమ్మం ముందు రెండు ఎత్తైన అరుగులు. అందంగా వున్న ముగ్గులతో అలరారే వాకిలినానుకునే గుబురు గెలలతో ఏపుగా పెరిగిన రెండు కొబ్బరిచెట్లు - వెనుక పెరట్లో ఉసిరిచెట్టు, దానిమ్మలతోబాటు కొమ్మలతో వ్యాపించిపోయిన సీమచింత చెట్టు. ప్రక్కనే గొడ్లచావిడి. ఇన్ని హంగులున్నా పేదరికం పెచ్చులూడిపోయిన గొడల్లో దర్శనమిస్తోంది.

'అమ్మమ్మా! ఎవరొచ్చారో చూడు' సుమ అరిచిన అరుపుకు ఒక్కసారిగా తలుపు తెరుచుకుని స్వామితాత భార్య లక్ష్మీదేవమ్మ వస్తూనే - హిమ బిందును దగ్గరగా తీసుకుని ఆప్యాయంగా తలమీద ముద్దు పెట్టింది. నుదుట రూపాయికాసంత బొట్టుతో చిరిగిపోయిన చీరా జాకెట్టుతో దరిద్రదేవతకు సోదరిలా దర్శనమిచ్చిన అమ్మమ్మను చూస్తూనే అదోలా అయిపోయింది హిమ.

తనెళ్ళిననాడు అపరలక్ష్మీ దేవిలా ఆశీర్వదించిన అమ్మమ్మేనా ఈమె అనిపించింది.

ఒంటినిండా నగలుతో మడతలు నలగని పట్టుచీరతో తనను కారెక్కించిన అమ్మమ్మ వైభోగం కాలగర్భంలో కలిసిపోవడానికి మూలం - ఫ్యాక్టరీ లాకౌట్ అని అనిపించి - గుండెలు పిండేసినట్లు బాధపడిపోయింది. కళ్ళలో భాష్పాలు కదలాడాయి.

'అమ్మా హిమా! మనవడితో వస్తే మహానందంగా వుండేదిరా' లోపల కుర్చీలో కూర్చోపెడుతూ ఆర్తిగా అంది అమ్మమ్మ.

'వస్తార్లే అమ్మమ్మా! అమెరికా అంతా ఐటి దెబ్బకు అల్లకల్లోలంగా వుందట. కొంచెం సర్దుకున్నాక ఈసారి యిద్దరూ వస్తార్లే. లేదంటే మనమే వెళ్దాం. నాదీ గ్యారంటీ' అంటున్న సుమను ఆనందంగా చూస్తూ - 'సుమ వుంటే ఎవరికీ కష్టాలూ కడగండ్లూ గుర్తుకు కూడారావు.' చక్కగా వలిచిపెట్టున్న దానిమ్మగింజల ప్లేటు హిమకు అందిస్తూ అంది అమ్మమ్మ.

'నీ కిష్టమని జున్ను చేసాను. క్యారియర్‌లో పెట్టిస్తాను' అంటూ వీర హడావుడి పడిపోతుంటే ఒక్కసారిగా లేచి అమ్మమ్మను కౌగిలించుకుని కన్నీరు పెట్టుకుంది హిమ.

'ఏం్రా హిమ.. కష్టాలొచ్చినప్పుడూ కన్నీరు. సుఖాలొచ్చినప్పుడు పన్నీరు ఇదే జీవితం. యిప్పుడు నువ్వొచ్చావు, అందరికి ఆనందాన్ని పంచావు. నీనోటివాక్కు నిజమైతే అందరి బ్రతుకుల్లో ఆనందమే' - హిమ కన్నీరు తన చీరచెంగుతో తుడుస్తూ అంది.

'అమ్మమ్మా! నా శాయిశక్తులా కృషి చేస్తాను' - ఫ్యాక్టరీ తెరిపిస్తాను చాలా పట్టుదలగా చెప్పింది.

'నీ నోటిమాట చల్లగా - అదే జరిగితే మనపాలెం మునుపటిలా పల్లెటూర్లకు తలమానికం అయిపోతుంది. సరేగానీ అబ్బాయిరాలేదమ్మా? ' అడిగింది.

గతుక్కుమని వెంటనే తేరుకుని, చిన్నగా నవ్వేసి - 'ఈసారి యిద్దరం వస్తాం అమ్మమ్మా' - హిమ నమ్మకంగా పలికింది.

'అదేం్రా ఈసారి యిద్దరేంటి - ముగ్గురూ రావాలి' అంటూ నవ్వేసింది అమ్మమ్మ.

'అమ్మమ్మా ఆకలి. అక్కరాందే నాకు పాయసం పెట్టనన్నావుగా? ఈసారి బావతోనే వస్తుంది - నాది గ్యారంటీ' అంటూ సుమ గారాలుపోయింది.

'ఆనందంలో అన్నీ మర్చిపోయ్యానా - రండి అలా పెరట్లో కుర్చీలు వేయించాను హిమతల్లికి యిష్టమైన ఉసిరి చెట్టునీడలో తినిపించాలని నా కోరిక. ' చిన్ననాటి చిలిపి సరదాలను గుర్తుచేస్తుంటే - హిమ కళ్ళముందు మెరిసిన జ్ఞాపకాలు పెదాలమీద చిరునవ్వు రూపంలో చిందులు వేసాయి.

'అక్కా! అప్పుడు నువ్వెక్కిన ఉసిరిచెట్టు, సీమచింత చెట్టు యిప్పుడు నీ ప్రియమైన చెల్లెలు - కబ్జా చేసేసింది తెలుసా?' అంటుంటే

'అమ్మో! సుమ చెల్లికాదురా బల్లి. వాళ్ళ తాతగారుంటే చాలు అతుక్కుపోతుంది' అమ్మమ్మ పాయసం గిన్నెలు అందిస్తూ చెప్పింది.

'కరక్టే. హిమ నీ మనమరాలు. మరి నేను? తాతయ్య పార్టీ - ఎందుకో తెలుసా? టెన్త్‌లో కూడా భుజాలమీదెక్కించుకుని కాలవదాటించే వారు, ఐ లవ్ తాతాజీ! నాదీ గ్యారంటీ. ' అమ్మమ్మను టీజ్ చేస్తూ అంది.

'మరీ యిదైపోకు తల్లీ. హిమకూడా తాతయ్య భుజాలమీదే వుండేది' ఏడిపించాలని అంది అమ్మమ్మ. ముగ్గురూ వచ్చి పెరట్లో కూర్చుంటుంటే చుట్టుపక్కల అమ్మలక్కలు కమ్మేశారు 'అమ్మా బిందమ్మ' అంటూ.

'అక్కా! యింత ఎంగ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీని వదిలి పెళ్ళైయిపోయి ఫేడౌట్ అయిపోయిన నిన్ను వీళ్ళంతా యింత ఎడ్మైరింగ్‌గా చూస్తున్నారంటే కారణం నువ్వా? అమెరికానా?' అదేదో ఛానల్‌లో యంగ్ యాంకర్ అడిగినట్లు పాయసం గిన్నె మైకులా పెట్టి అడిగింది.

'ఆ సేతు హిమాచల సస్యశ్యామల జీవధాత్రి మా పెద్దక్క- బిందక్క ఫేడౌటా? సుమక్కా యు ఆర్ వెరీ రాంగ్ నాదీ గ్యారంటీ'. అప్పుడే స్కూలు నుంచి వచ్చిన 'రమ్య' సుమను యిమిటేట్ చేసింది.

స్వామితాత కొడుకు సూర్యం ఒకప్పుడు మిల్లుకు చీఫ్ మెకానిక్‌గా పని చేసేవాడు. మిల్లు మూసేసాక బాపిరెడ్డి నాటకమాడి తన మిల్లులోకి తీసుకున్నాడు. బాపిరెడ్డితో వున్న కొడుకును అసహ్యించుకుని అంటీ ముట్టనట్టు వుండిపోయాడు స్వామితాత. ఆ కొడుకు కూతురే ఈ రమ్య. తల్లిదండ్రులతో వుండడానికి యిష్టపడక పోవడంతో యిక్కడే వదిలేసారు.

'అంటే హిమ అన్న పేరున్నంత మాత్రాన ఆ సేతు హిమాచల అంటూ పాడేస్తావా? తన పేరు హిమైతే మైనేమీజ్ సుమ' రమ్యతో వాదనకు దిగింది.

'ఒక్కసారి తురాయి చెట్టుదగ్గరకెళ్ళిరా! హిమక్క గోపాలకృష్ణగారి కబుర్లే తప్ప మరోమాటలేదు. అక్కన్నట్లు మిల్లేగనక మళ్ళీ ఓపెన్ అయిపోతే అక్కనే భరతమాత లెవల్లో కొలిచేస్తారు తెలుసా? '

'ఆ కొలిచార్లే స్కేలుతోనా? టేపుతోనా?' ఉక్రోషంగా అంది సుమ.

'రమ్యా! హిమక్క నీకు గిఫ్టులు తెచ్చింది. నీ స్టడీ టేబుల్ మీద పెట్టాను. నువ్వు మధ్యాహ్నం స్కూలుకు సెలవు పెట్టేసేయ్ - అక్కలతోనే వుండు.' వాక్య పూర్తికాకుండానే - 'మా నాన్నమ్మే నాన్నమ్మ' అంటూ తుర్రుమంది రమ్య.

సాయంత్రం నాలుగ్గంటలకే ఇంటికి వచ్చేసాడు లాయర్ బోసుబాబు.

ఇవ్వాళ తప్పకుండా హిమబిందు వస్తుందన్న ఫీలింగ్ అతన్ని భూమి మీద నిలవనివ్వడం లేదు.

'ఏరా బోసూ..' సాయంత్రం కోర్టులేదా? సుభద్రమ్మ కాఫీ యిస్తూ అడిగింది.

'మార్నింగ్ సెషన్‌లోనే నా పని అయిపోయింది. అక్కడ ఏమీతోచక వచ్చేసానమ్మా' బోసు సమాధానం యిచ్చాడు.

'పోన్లే - వెంకటరత్నంగారి కూతురు హిమ వచ్చిందంటగా? అలావెళ్ళి పలకరించి రారాదూ?' సలహా యిచ్చింది సుభద్రమ్మ.

'తర్వాత వెళ్తాగానీ అక్క ఫోన్ చేసిందా?' - మాటమారుస్తూ అడిగాడు.

'ఆ చేసింది - హిమ వచ్చిందని చెప్పాను వస్తానంది. అయినా వాళ్ళాయనకు సెలవు దొరకాలిగా? '

'బావకు సెలవేంటమ్మా? కాలేజీనే ఆయనది కదా!'

'అయితే మాత్రం?'

'సరే సరే.. నేను ఫోన్ చేస్తాలే'

'అక్క వచ్చిందనుకో నీకే ప్రమాదం పెళ్ళంటూ బుర్ర తినేస్తుంది - తెలుసా!?'

'సరే రానియ్యమ్మా.. అదీ చూద్దాం.'

సుభద్రమ్మకు కొడుకు మనసు అర్ధమైపోయింది ఎప్పుడూ రాత్రి ఎనిమిది దాటనిదే రానివాడు, నాలుగుగంటలకే రావటం హిమ పేరెత్తగానే మాట మార్చేయడంతో తన పరిస్థితిని అర్ధం చేసుకుంది. పెళ్ళైపోయి అమెరికాలో సెటిలైపోయిన అమ్మాయిని మరువలేక పోవడం. అంతా వాడి దురదృష్టం అనుకుంటుంటే సీత వచ్చేసింది చాలా స్పీడుగా.

'ఏంటే సీతా! భీముడేమైనా గొడవ చేస్తున్నాడా?' ఆత్రుతగా అడిగింది.

'దీంతో గొడవా? అయితే వాడయిపోయాడే' చమత్కరించాడు బోసు.

'అదికాదండీ అమ్మగారూ.. మా బిందమ్మగారు - సుమమ్మగారు' వస్తున్నామని కబురు చేసారు. తనొచ్చిన పని చెప్పింది.

ఒక్కసారిగా బోసు ముఖం వివర్ణమైపోయింది.

'అమ్మా! నేనలా విష్ణువర్దన్ గాడి దగ్గరకెళ్ళి వస్తా' హడావిడి పడిపోతుంటే -

'అదేంట్రా? పాపం అమ్మాయిలు చూడ్డానికొస్తుంటే? వూళ్ళో వుండి యింట్లో లేకపోవడం మర్యాదా? విష్ణు ఎక్కడికి పోతాడు? నువ్వెక్కడికి పోతావ్? మాట్లాడి వెళ్ళు -'

'ఏ సీతా! సుబ్బారావు షాపుకెళ్ళి పెప్సీ పట్టుకురావే. '

'అమ్మగారూ! అట్టాంటియ్యేమీవద్దని చెప్పమని మా హిమమ్మ చెప్పింది. తెస్తే నా పని చాకిరేవే' సీత భయంగా చెప్పింది.

'చెప్పింది హిమబిందు కదా! సుమవుందిగా దానికి పెప్సీ అంటే చాలా యిష్టం - ముందు నేను చెప్పింది చెయ్ ఆజ్ఞాపించింది' బోసు తల్లి.

'సరైతే.. నేనూ ఒకటి లాగించేస్తా' అంటూ వెళ్ళిపోయింది సీత.

'బాబూ! గతాన్ని మళ్ళీ తీసుకురాలేం కదా? అదంతా మర్చిపో. దానికి పెళ్ళైపోయింది అమెరికా వెళ్ళిపోయింది. అలా రాసిపెట్టి వుంది' అంటుంటే

'అమ్మా నేనంతా అదెప్పుడో మర్చిపోయాను వదిలెయ్' అంటూ తన రైటింగ్ టేబుల్ ముందు కూర్చుండిపోయాడు మూడీగా.

'నల్లకోటు లాయరూ - చెట్టుకింద ప్లీడరూ' పాటపాడుతున్న సుమను చిన్నగా మందలిస్తున్న హిమను చూస్తూనే హిమతో 'రామ్మారా! చాన్నాళ్ళకొచ్చావు? అయినా యింకా ఆ పాటేనా పిల్లా?' సుమతో అంది సుభద్రమ్మ.

'నేను పాడింది మన లాయర్‌గారి మీద కాదు. ఆయనకేంటి అత్తమ్మా! మూడుకోట్లు సంపాదించారు నాదీ గ్యారంటీ' అంటూ చేతిలో వున్న బేగ్ బోసుబాబు టేబుల్ మీద పెట్టి, మీ 'తపోకో' తెచ్చిన కానుకలు అంటే.

'ఇదేం భాషే పిల్లా! తపోకో అంటే?'

'అది సస్పెన్స్ మేం వెళ్ళేలోపు ఆ మూడక్షరాల్ని విడమర్చి చెబితే రింగ్ యిచ్చేస్తా! నాదీ గ్యారంటీ' పకలిచ్చింది సుమ.

హిమను చూస్తూనే లేచి నిలబడ్డాడు బోసు. ఎలా పలకరించాలా అని ఆలోచనలో పడిపోయాడు.

'అయ్యా లాయరుగారూ.. అక్కను జడ్జి అనుకున్నారా! ఒక్కసారిగా నిలబడిపోయారు?' ఆటపట్టిస్తుంటే చిన్నగా మొట్టింది హిమ.

'నాకేం తలపైన పేలులేవు - తమరు మొట్టికాయలు యివ్వక్కర్లేదు' అంటుండగానే చేతిలో చిప్స్ పేకెట్లు, పెప్సీ బాటిల్స్‌తో వచ్చిన సీతను చూస్తూనే 'భీముడికి ఫియాన్సీవైనా నువ్వేనే సీతవంటే' చిప్స్ పేకెట్ చింపేస్తూ అంది.

'రా! కూర్చో హిమా' సోఫా చూపించాడు బోసు.

'బాబూ.. ప్రాక్టీసు ఎలావుంది?' ఏదైనా మాట్లాడకపోతే బాగుండదని అడిగింది హిమ.

'క్వైట్ ఓకె' - నేల చూపులు చూస్తూ సమాధానం యిచ్చాడు బోసు.

'ఇందిర ఎలా వుంది? పిల్లలా?' అడిగింది హిమ.

'ఇంకా అంతదాకా రాలేదమ్మా. ఇందాకే ఫోన్ చేసింది నువ్వొచ్చావని చెప్పాను. రేపో మాపో దిగిపోవాలి' సుభద్రమ్మ అంది.

'హిమా! గోపి ఎలా ఉన్నాడు? కంపెనీ మారాడా - యింకా ఆ కంపెనీలోనే ఉన్నాడా?' మాటలు కూడబలుక్కుంటూ అడిగాడు బోసు.

'సేమ్ కంపెనీ బాబూ.. హీ ఈజ్ ఓకె' సమాధానం యిచ్చింది హిమ.

'మాట్లాడాలని చాలాసార్లు తన సెల్‌కి ట్రై చేశాను. ఎప్పుడూ బిజీనే'

'ఔను బాబూ! అది కంపెనీ ఫోన్ - కంపెనీ కాల్స్‌తోనే ఆల్వేజ్ బిజీ' చిన్నగా నవ్వేసింది.

'లయ్యర్‌జీ మీకు సమాధానం యివ్వలేదంటే నో ప్రాబ్లం. నేను సుమని. అందమైన మరదల్ని. నాక్కూడా నో రిప్లై అంటే డేమేజీ సెక్షన్ క్రింద తప్పకుండా కేసు ఫైలు చేయాలి. నాదీ గ్యారంటీ' అనేసింది సుమ.

'లయ్యరన్నావ్! మళ్ళీ నేనే కేస్ వెయ్యాలా?'

'సారీ లాయర్ జీ సారీ 'తపోబాజీ' మీకలా వినిపించిందా? అక్కా లాయర్ గారికి అమెరికా నుంచి మాంచి హియరింగ్ ఎయిడ్ తెస్తే బాగుండేదేమో?' అమాయకంగా బనాయిస్తున్న సుమ అల్లరికి హిమ నవ్వేస్తే -

'ఓ ఐదు సంవత్సరాలు ఆలస్యంగా పుట్టకుండా ఉండుంటే నిన్నే కోడలిగా చేసుకునేదాన్ని నాకు అంత అదృష్టమా?' నిట్టూర్చింది సుభద్రమ్మ.

'లాయర్నా? నేనా? పెళ్ళిచేసుకోవడమా? నో...వే'

'మా బోస్‌కేం తక్కువే పిల్లా!'

'నేను చెప్పింది లాయర్ల గురించి'

'వాళ్ళు మనుషులు కాదా?'

'మనుషులే కాదని ఎవరన్నారు?'

'మరి లాయర్లంటే ఎందుకే నీకు అయిష్టం?'

'చెప్పాలా అత్తమ్మా! 'తపోబా' వుడుక్కుంటాడేమో?'

'అదేం లేదు చెప్పు సుమా చెప్పు' బోస్ కొంచెం మూడ్‌లోకి వచ్చి అడిగాడు.

'కోర్టులోనే కాదు.. యింట్లో కూడా సరదాల్ని సరసాల్ని వాయిదా వేసే ఘనులు లాయర్లేనంట. మొన్నో మేగ్‌జైన్‌లో చదివాను' సుమ చిలిపిగా సమాధానమిచ్చింది.

'ఇది మాత్రం పచ్చి నిజమే సుమా! పెళ్ళికి వీడెన్ని వాయిదాలేస్తాడో నాకు తెలుసు' సుభద్రమ్మ సుమను మెచ్చుకుంది.

'ఇంతేకాదు అత్తమ్మా! లాయర్ల మీద యింకా చాలా చాలా జోకులున్నాయి - నా ఫ్రెండ్ వాళ్ళ డాడీ కూడా లాయరే.. అని చెప్తుంటుంది' మూడో పెప్సీ ఖాళీ చేస్తూ గారాలు పోయింది సుమ.

'ఏంటోనమ్మా! వాళ్ళ నాన్న వీడిని ఇంజినీరో, డాక్టరో చేయాలనుకుంటే వీడిలా లాయరయ్యాడు. ఏం చేస్తాం అంతా వాడి ప్రారబ్ధం' వేదాంత ధోరణితో చెప్పింది బోసు మాత.

'తపోబాగారు లాయరయ్యారు కాబట్టే మిల్లు కేసు చూస్తున్నారు. మిల్లు ఓపెన్ అయితే నాసామిరంగా మీకు లాయర్ మాతగా బ్రహ్మరథమే... నాదీ గ్యారంటీ'

'నీ నోటి చలవ వలన అది జరిగిపోతే ఈ వూరికేం కావాలి?' ఉద్విగ్నంగా అందామె.

'అక్కాజీ కూడా శ్రమపడిపోతోంది. గోపాలకృష్ణ అంకుల్‌తో మాట్లాడింది కూడా. ఆయన కూడా హోప్‌ఫుల్‌గానే మాట్లాడారు.' సుమ టేబుల్ మీదున్న గిఫ్ట్ బేగ్ ఓపెన్ చేస్తూ - 'ఔను మామయ్యెక్కడ? కేరాఫ్ పొలమేనా? ఇదిగో ఈ వాచ్ మామయ్యకు. మీకు ఇందిరక్కకు ఈ చీరలు. పోతే తపోబాగారికి ఐఫోన్ - వావ్ లేటెస్ట్ మోడల్'

'ఏంట్రా మేమేమైనా చిన్నపిల్లలమా? మాకు గిఫ్టులేంటమ్మా?' చీరను ఆప్యాయంగా చూస్తూ అంది.

'ఎంతైనా తపోకో కద అత్తయ్యా'

'మళ్ళీ ఆ కోడి భాషేంటే? అయినా బిందెప్పటికీ నా కోడలే.. తప్పిపోయినా'

'అదుర్స్ అత్తమ్మా! యిదిగో చూసుకో రింగ్ యిస్తానన్నాగా నే సెల్‌ఫోన్ నుంచి మీ సెల్‌కు రింగ్ యిస్తున్నా' చిలిపిగా అంది.

'నువ్వేంటే తల్లీ! ఈ మధ్య అందరూ రింగులిచ్చేవాళ్ళే - మరి సెల్ ఎందుకు కొంటారో అర్థం కాదు.'

'అందరికీ బోసుబాబులా సంపాదించి పెట్టే కొడుకుండాలిగా.'

'ఔనౌను వాడు సంపాదించకముందు మేమెవ్వరం సెల్ ముఖం చూడలేదమ్మా.'

'అంతొద్దు అత్తమ్మా! ఏదో 'తపోబా'ను కాస్త మోసేద్దామని అన్నాను అంతే.'

'నేనుక్కడుండగానే నన్నే ఆడేసుకుంటున్నారు - సరే మీ ఆనందమే నా ఆనందం. నేనలా వెళ్ళి'

'వెళ్ళు బాబూ వెళ్ళు. అమెరికా అక్కని అందాల సుమని కాదని వెళ్ళు బాబూ వెళ్ళు. నీ బైక్ ఏ బైక్‌నో బాదెయ్యకపోతే నాదీ గ్యారంటీ.'

'ఏయ్ సుమా! తప్పు పెద్దవాళ్ళతో అలా మాట్లాడకూడదు' హిమ మందలించింది.

'తను అలా మాట్లాడితేనే బాగుంటుంది. కాబోయే మిస్సిండియాకి ఆ మాత్రం వుండాలి' బోసుబాబు నోరిప్పాడు.

'మిస్సిండియానా? ఎవరు బాబు నేనా? నోవే. ఎదురుగా ఉందిగా అక్కగారె మిస్సిండియా. ఇండియాను మిస్సయింది తనే.'

'కరెక్ట్‌గా చెప్పావురా. ఇంతింత ఆస్తులు పెట్టుకుని అనుబంధాల్ని తెంపుకుని అంతంత దూరం వీళ్ళంతా ఎందుకు వెళుతున్నారో నాకైతే అర్థమైచావదు' సుభద్రమ్మ సుమను మెచ్చుకుంది.

'అంత మాట్లాడుతున్నా మనసు మాత్రం ఎక్కడో వుంది హిమకు మనసంతా వికలమైపోయింది' ఏదో అపరాధ భావం గుండెల్ని తొలిచేస్తుంటే బోసుబాబును చూసింది.

చాలా డిస్టర్బ్‌డ్‌గా వున్నాడనిపించింది.

'అమ్మాయిగారూ మన పడవొచ్చేసింది' ఇన్నోవాను పడవ అనడం సీత అలవాటు.

'అయితే చూడవే సావిత్రీ.. తెడ్డు దగ్గర అక్కినేని వుంటారు' వెక్కిరించింది సుమ.

'నాకెవరూ వద్దు - నా భీముడే నా హీరో' సిగ్గులు చిలికించేసింది సీత.

'నీ యెంకమ్మా జోకేసినా దీనికి అర్థమై చావదు' విసుక్కుంది సుమ.

పళ్ళు, పట్టుచీరా యిచ్చి మూడీగా మారిపోయింది సుభద్రమ్మ. ఏ గతస్మృతులు ఆమెను కలచివేశాయో కన్నీరు పెట్టుకుంది.

'అత్తమ్మా! నువ్వు రోజూ పెప్సీ యిస్తానంటే అక్కను తోలుకొచ్చే బాధ్యతనాదీ'

అందరూ బయలుదేరిపోయారు.

బోసుబాబు శూన్యంలో ఉన్నట్లు కళ్ళుమూసుకుని నిలబడిపోయాడు.

**ఇక మీరు లక్ష కథలు** చెప్పినా నేను వినను. ముందు అదెందుకొచ్చిందో నాకు తెలియాలి. గోపీనాథ్ నుంచి ఫోన్ లేదు. వాళ్ళింటికి ఫోన్ చేస్తే మాకేమి తెలియదంటారు - అమెరికానుంచి ఒక్కతే వచ్చింది. వస్తున్నానన్న కబురేలేదు - వచ్చాక ఎందుకొచ్చిందో చెప్పాలన్న ఇంగితం లేదు. పిల్లల్ని కనడం - పెంచడం - పెళ్ళిల్లు చేయడం యిలా బాధలు పడడం - ఛీ.. యిదేనా జీవితమంటే? మీరేం చేస్తారో నాకు తెలీదు - అదిరాగనే నోరిప్పాలి అంతే.'

వినిపించిన ఇన్నోవా శబ్దానికి లోపిచ్‌లోనికి వచ్చేసింది అనురాధాదేవి.

అప్పటికే - అయోమయంగా మారిపోయారు వెంకటరత్నంగారు. ఒక్కనాడు కూడా పిల్లల్ని మందలించడంగానీ, ప్రశ్నించడంగానీ ఆయనెరుగడు.

హిమ, సుమలు ఆయనకు రెండు కళ్ళతో సమానం. మొదటి నుంచీ ఆయనకు అమెరికా సంబంధాలంటే అసహ్యం, కోపం. అల్లారు ముద్దుగా పెంచిన పిల్లల్ని అందనంత దూరం పంపించి ఆప్యాయతలకు దూరమైపోతున్నామన్నది ఆయన ఫీలింగ్. అనురాధాదేవి మంకుపట్టు, గయ్యాళితనం అతని ఆశయాలకు అడ్డుపడిపోయాయి.

'ఈ పెళ్ళి జరగకపోతే నీకు అమ్మే వుండదు - ఆలోచించుకో' అంటూ హిమను ఆరడిపెట్టి తన పంతం నెగ్గించుకుంది అనురాధాదేవి.

హిమ వెళ్ళి రెండేళ్ళయ్యింది ఒక ఫోనుగాని, మెయిల్‌గాని లేదు. ఏమయ్యిందోనని దిగులుపడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. నరకం అంటే యిదే అనిపిస్తుంటే అందరికోసం నవ్వును నటిస్తూ - బ్రతకడంకన్నా ఘోరం మరొకటి లేదనిపిస్తుంటే, అతి భారంగా కాలాన్ని దొర్లించడం దుర్లభమైపోయింది వెంకటరత్నంగారికి. దీనికి తోడు రైస్‌మిల్లు ప్రోబ్లెం. యిప్పుడు హఠాత్తుగా హిమ రావడం, భార్య సతాయింపులతో దాదాపుగా పిచ్చివాడి స్థాయికి వచ్చేసాడాయన. 'ఎలా అడగాలి? ఏమని అడగాలి? గోపీనాథ్ తల్లిదండ్రులు కూడా తన స్టేజిలోనే వున్నారు' అనుకుంటుంటే -

'డాడీ వచ్చేసాం.' సుమ హిమలొచ్చి వెంకటరత్నాన్ని ఈ లోకంలోకి తెచ్చేశారు.

'అయ్యిందా బలాదూర్ తిరుగుడు?' అనురాధాదేవి అడిగింది.

'మమ్మీ! నీకు ఈ మధ్య మతికూడా పోతోంది. మేం సుభద్రత్తయ్య వాళ్ళింటికెళ్తే బలాదూర్ తిరుగుడంటావ్?' ఎదిరించింది సుమ.

ఏదో రాద్ధాంతానికి నాంది అని వూహించేసింది హిమ.

తనొచ్చి నాలుగురోజులు దాటిపోయాయి ఏ తల్లికైనా కూతురిరాకలో గల ఆంతర్యం తెలుసుకోవాలని వుండడం సహజం. పైగా తను ఒంటరిగా వచ్చింది. తను కార్గోలో బుక్ చేసిన సామానింకా రాకపోవడం చాలా హెల్పయింది. అయినా యింకెన్నాళ్ళు? రేపోమాపో చెప్పక తప్పదు కనీసం డాడీకైనా చెప్పేయాలి. యిప్పుడు తనేం చెప్పాలి? గోపీనాథ్ గురించి అడుగుతారు. ఏం చెప్పినా వినే సిట్యుయేషన్ చేజారిపోయినట్లే కనిపిస్తోంది. రాగానే బాబుతో చెప్పేయాలనుకుది కానీ సమయం, సందర్భం కుదరలేదు.

'అమ్మా! హిమా?' డాడీ నోరిప్పారు.

'నెక్స్ ప్రశ్న - డెఫినెట్‌గా అదే' కళ్ళెత్తి తండ్రిని చూసింది. తండ్రి ముఖంలో దైన్యం.

తల్లి వెళ్ళిపోయినా తలుపు చాటునుంచి వింటుంటుందని ఊహించింది.

'ఏమిటి నాన్నా! ఏదో అడగబోయారు?'

'అదే హిమా! ఇంత సడన్‌గా ఎందుకొచ్చావు? రెండేళ్ళబట్టి కనీసం ఫోన్లో కూడా సరిగా మాట్లాడలేదు. అమ్మ చాలా కంగారుగా వుంది. గోపీనాథ్ కూడా తన వాళ్ళతో కాంటాక్ట్‌లో లేడట'

'ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?' ఆలోచనలో పడిపోయిన హిమ 'చెపుతాను నాన్నా నాకు మరోవారం టైం కావాలి' అక్షరాల్ని కూడబలుక్కుంటూ నోరిప్పింది.

'ఏంటే యిదేమైనా భారతమా? రామాయణమా? యిప్పటికే యిరుగమ్మ పొరుగమ్మల సూటిపోటి మాటలకు తలెత్తుకోలేకపోతున్నా. అసలు యిద్దరూ వచ్చుంటే నాకీ అవస్థవచ్చుండేదా?' వస్తూనే కళ్ళొత్తుకుంది అనురాధ.

'అమ్మా! నన్ను నమ్మవా?'

'నువ్వేం చెప్పినా నమ్ముతాను. చెప్పు'

'అక్క టైం అడిగిందిగా?' సుమ.

'మధ్యలో కల్పించుకున్నావంటే చీరేస్తాను. అసలు నువ్వు బయటికిపో' కసురుకుంది అనురాధాదేవి.

'ఎందుకుపోవాలి? నేనేం చిన్నపిల్లనా?'

'అందుకే వూరుకుంటున్నా. లేకపోతే వీపు విమానం మోతయ్యేది'

'నువ్వేంటే? పిల్లలతో యిలాగేనా మాట్లాడేది?'

'నాకేమీ మీ అంత చదువులేదు - నేనిలాగే మాట్లాడతా చెప్పు టైంగీం జాన్తానై' నోరు పెద్దది చేసింది.

'దాని పెళ్ళి గొడవ చేసి చేసావు - గుర్తుందా?'

'ఔను చేశాను - తప్పా? ఆ పోరంబోకుతో అవనందుకు సంతోషించండి' గట్టిగా అరిచేసింది.

'అమ్మా! అనవసరంగా అతన్నెందుకు అంటావ్? నన్ను తిట్టు'

'అంటే ఏంటే నీ వుద్దేశం? ఎందుకు వచ్చావో చెప్పవు? అల్లుడు ఎందుకు మాట్లాడడో చెప్పవ్? మేమంతా చచ్చామనే నిర్ణయానికొచ్చేస్తే చెప్పు ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాం' ఏడ్చేసింది.

లేచి తల్లి దగ్గర కెళ్ళి భుజం మీద చెయ్యేసి 'అమ్మా - నన్ను నమ్మమ్మా? చెప్తాను అంతా చెప్తాను - కొంచెం టైం కావాలమ్మా ప్లీజ్' గద్గదస్వరంతో అడిగింది.

'అసలే అల్లకల్లోలంగా వుంది. నా బుర్ర. మరో వారం రోజులు ఎలా భరించాలి? పోనీ వారం తర్వాత అయినా గోపినాధ్ వస్తున్నాడా? వస్తున్నాడని చెప్పు - చెప్పమ్మా?'

మౌనంగా వుండిపోయింది హిమ

'బలవంతంగా పెళ్ళి చేసానని నన్ను ఏడిపిస్తున్నావా? ' దిగులుగా అడిగింది.

'అమ్మా - పెళ్ళి విషయంలో అప్పుడే సర్దుకుపోయాను. ప్రతి తల్లీ చేసే పనే నువ్వూ చేసావు.'

'అయితే యింకేమిటే? అమ్మనిలా ఎందుకు బాధపెడుతున్నావే?'

'అమ్మా క్షమించమ్మా! ఓ వారం తర్వాత అంతా చెప్తాను. అయినా అంతగా బాధపడేదేమీ లేదు'.

'అయితే సరే బాధపడేదేమీలేదన్నావు. ఆ ఒక్కమాటా చాలురా' కొంగుతో ముఖం తుడుచుకుంది అనురాధాదేవి.

'హమ్మయ్య' యిప్పటికి తుఫాను సద్దుమణిగిందనుకుంటూ కొంచెం రిలాక్స్‌డ్‌గా నిట్టూర్చింది హిమ. హిమకు బలవంతంగా పెళ్ళిచేసి పొరపాటు చేశామన్న ఫీలింగ్ మళ్ళీ వెంకటరత్నాన్ని వెంటాడడం మొదలుపెట్టింది. భారంగా నిట్టూర్చి బయటకెళ్ళిపోయాడు.

హిమ సుమను తీసుకుని అన్యమనస్కంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

నిస్సహాయంగా మిగిలిపోయింది అనురాధాదేవి ఆ ఖాళీ హాల్లో.

విజయవాడ - గోపాలకృష్ణగారి బంగ్లా చాలా హడావుడిగా వుంది. వరుణ్ అమెరికానుండి వచ్చేసాడు.

వరుణ్ తల్లి విజయలక్ష్మిగారి సంబరం వర్ణనాతీతంగా వుంది.

ఉద్యోగం పోయిందన్న బెంగ లేశ మాత్రం కూడా ఆమెలో లేదు.

రజని అయితే గాల్లో తేలిపోతుందనే చెప్పాలి. తన కాలేజీ ఫ్రెండ్స్‌తో సంతోషాన్ని షేర్ చేసుకుంటోంది.

తెల్లని తెలుపుతో అందంగా హుందాగా వున్న వరుణ్ హాల్లోకి వస్తూనే అమ్మాయిలందరిని విష్ చేసి, తండ్రి ప్రక్కనే సోఫాలో చేరిపోయాడు.

ట్రే నిండా స్వీట్లతో లక్ష్మి ప్రత్యక్షమైపోయింది.

'ఎవ్వరూ యివాళ డైటింగ్ చేయడంలేదు. పెట్టినంత తినాలి' విజయలక్ష్మి భర్త ప్రక్కనే సెటిలైపోతూ రజనీ అండ్‌కోకు వార్నింగ్ ఇచ్చింది.

'ఎవరెంత ఎక్కువ తింటే వాళ్ళకు అదే రేషియోలో అమెరికా చాక్లెట్లు' - ఎనౌన్స్ చేసేసింది.

'ఓకే ఆంటీ! యివ్వాళ నో డైటింగ్. ఓన్లీ ఫైటింగ్' అంటూనే స్వీట్స్ మీద దాడి ప్రారంభించారు అమ్మాయిలంతా.

'వరుణ్ నీకు హిమబిందు, సుమ - వెంకటరత్నం అంకుల్, స్వామితాత, ఐడియా వుందా? '

'వైనాట్ డాడీ! ఎప్పుడు ఫ్యాక్టరీ కెళ్ళినా వద్దన్నా వినకుండా ఎత్తుకు తిప్పేవారు స్వామితాత. హిమబిందు, సుమలు సిస్టర్స్ కదా? వాళ్ళ డాడీయే కదా అంకుల్!?'

గతంలోకి తొంగిచూస్తూ సమాధానమిచ్చాడు.

'నీ జ్ఞాపకశక్తి చాలా బాగుంది వరుణ్.'

తండ్రి మాటలకు స్పందిస్తూ - 'మనిషికి మధుర జ్ఞాపకాలనిధి బాల్యం అన్నారు ఓ కవి. మరి బోసుబాబు - విష్ణువర్ధన్ యింకా చాలామందికి వుండాలి. అందరూ అక్కడేవున్నారా? ఎక్కడికైనా 'మైగ్రేట్' అయిపోయారా?'

'బిందుకు పెళ్ళయింది - భర్త అమెరికాలోనే వుంటున్నాడు. గోపీనాథ్ అని తోట్లవల్లూరు నుంచి వచ్చేవాడు, నీకు ఐడియావుందా? పోతే బోసుబాబు యిప్పుడు లాయర్. ఈ వూళ్ళోనే ప్రాక్టీస్ - వాడి అక్క ఇందిర గుర్తుందా - పెళ్ళి చేసుకుంది. వాళ్ళాయన వుయ్యూర్లో కాలేజీ రన్ చేస్తున్నాడట.'

ఆగిపోయిన భర్త మాటల్ని కంటిన్యూ చేస్తున్నట్లు -

'ఓసారి వెళ్లొద్దాం రా.. వరుణ్ హిమ చెల్లెలు సుమ ఎంత ముద్దుగా వుంది! అసలు దాని మాటలూ స్టయిలూ ఒద్దిక నిజంగా'.

'అమ్మా! యిక ఆపమ్మా! యింతమంది అందమైన అమ్మాయిలిని ముందు పెట్టుకుని ఎక్కడో వున్న సుమను పొగడ్తలతో ముంచెత్తుతావా? మాకెంత ఇన్సల్టో కదరా అన్నయ్యా?' మారాం చేసింది రజని.

'అమ్మ సంగతి తెలుసుగా? అనవసరంగా ఎవరినీ ఏమీ అనదు మరిప్పుడు ఆ పిలక జడల సుమను ఆకాశానికెత్తేస్తోంది - అదేంటో మనమూ చూద్దాం ఓకేనా?' అనునయించాడు వరుణ్.

'అయితే రేపు వెళ్లొద్దామా అమ్మగారూ?' ఆత్రంగా అడిగింది లక్ష్మి.

'వోయ్! అప్పుడే పల్లెటూరికి పరుగులు తీయకు. నాకు కాలేజుంది ఆదివారం వెళ్దాంలే' రజని విసుక్కుంది.

'ప్రోగ్రాం అంతా మీరిద్దరేనా ఫిక్స్ చేసేది?'

'ముందు మీ అన్నయ్యను అడుగు' సలహా కూడా యిచ్చింది విజయలక్ష్మిగారు.

'రజనీ! మేం కూడా వస్తామే ప్లీజ్' అమ్మాయిలు గోలపెట్టేసారు.

'మనందరం వెళ్ళి రావాలంటే లారీ మాట్లాడుకోవాలి. మరి ఓకేనా!? ' అడిగింది రజని.

'పాపం రానీవే వాళ్ళు నలుగురు మనకార్లు రెండు సరిపోతాయిలే' సర్దిచెప్తుంటే

'అమ్మగారూ! మరి నేనో? అడ్డం పడిపోయింది' లక్ష్మి.

'చూద్దాంలేవే' విజయలక్ష్మి అంది.

'అమ్మగారూ! చూద్దాం అంటారేంటి? నేను కూడా పాలెం చూడాలి. రజనమ్మ వాళ్ళతో నేనూ వస్తానమ్మా అమ్మాయిగారూ మీరైనా చెప్పండి' లక్ష్మి వదల్లేదు.

'అమ్మా మీరు ప్రోగ్రాం చేయండి - నేనేలా వెళ్ళి ఫ్రెండ్స్‌ను మీటై వస్తాను. ' లేచాడు వరుణ్.

'మేమూ వెళ్లొస్తామే రజనీ' అని ఫ్రెండ్స్ అంటుంటే, 'అందరికీ లంచ్ ఏర్పాటైపోయింది. అమ్మాయిలూ తినేసి వెళ్ళండి' ఆజ్ఞాపించింది విజయలక్ష్మి.

'అయితే వెంకటరత్నంకు చెప్పనా?' భార్యను చూస్తూ అడిగారు గోపాలకృష్ణ.

'చెప్పండి' భర్త ప్రశ్నకు సమాధానం యిచ్చింది విజయలక్ష్మి.

లక్ష్మితోబాటు అమ్మాయిలందరూ ఏనుగెక్కినంత సంతోషపడిపోయారు.

'వెంకటరత్నం.. మేం ఆదివారి మీ ఊరొస్తున్నాం'. ఈ చిన్న ఫోన్ కాల్‌తో పాలెం గ్రామం పులకరించిపోయింది. 'ఫ్యాక్టరీ ప్రారంభోత్సవమే' అన్నంత హడావుడి మొదలైపోయింది.

స్వామితాత అయితే భూమ్మీద నిలబడటమే కష్టంగా వున్నట్లు మిల్లు, ఊరు కలియ తిరిగేస్తున్నాడు.

ఫ్యాక్టరీ వాచ్ మేన్ వెంకటస్వామైతే గాల్లోనే వున్నాడని చెప్పాలి.

హిమబిందు గోపాలకృష్ణగారికి ఫోన్‌చేసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

'నాకెందుకురా థాంక్స్ - అది మనూరు - అది మన ఫ్యాక్టరీ - డాడీతో చెప్పు మేం తిన్నగా ఫ్యాక్టరీకే వస్తాం - డాడీనేమీ హల్‌చల్ చెయ్యొద్దని'

'అలాగే అంకుల్... వన్‌మినిట్. సుమ మీతో..' అంటూ సుమకు సెల్ యిచ్చింది హిమ.

'హాయ్ అంకుల్ - యు ఆర్ వెరీ గ్రేట్ - మాట ప్రకారం వస్తున్నారు - మా వూరికి పండగ తెస్తున్నారు. స్వామితాతతో బాటు కార్మికులంతా కంటిమీద కునుకులేకుండా ఆదివారం కోసం ఎదురు చూస్తుంటారు. ఒన్స్ ఎగైన్ యు ఆర్ వెరీ గ్రేట్ - నాదీ గ్యారంటీ అంకుల్' చాలా ఉత్సాహంగా మాట్లాడింది.

'ఓకేరా బై..' అంటూ ముగించారు గోపాలకృష్ణ.

బోసుబాబు తన బైక్ మీద వచ్చేశాడు.

'రారా బోసూ! గోపాలకృష్ణగారు కాల్ చేశారు' సోఫా చూపిస్తూ అన్నారు.

'ఆదివారం వస్తున్నామని అంతేగా ఊరంతా యిదే న్యూస్ అంకుల్'

బోసుబాబు వాయిస్ వింటూనే విసవిసా వచ్చేసింది అనురాధ.

'నమస్తే ఆంటీ..' లేచి నిలబడి విష్ చేశాడు.

'అమ్మెలా వుంది?'

ఆమె కంఠంలో వినిపించిన సాఫ్ట్‌నెస్‌కు వెంకటరత్నంగారు పజిలైపోయారు. బోసు పేరెత్తితేనే మండిపడిపోయే భార్యమణేనా మాట్లాడేది? అని అనుకోకుండా వుండలేకపోయారు.

'బాగున్నారు ఆంటీ?' వినయంగా సమాధానం యిచ్చాడు బోసుబాబు.

'హాయ్ లాయర్‌జీ - మొన్నే చెప్పానా? గోపాలకృష్ణంకుల్ వస్తారని? దటీజ్ సుమ' వచ్చి హాల్లో సెటిలైపోతూ అంది.

'మొన్న కేస్ వాయిదా పడినప్పుడే అన్నారంతా! యిది తప్పకుండా మిస్ సుమ యిన్‌ఫ్లూయెన్సేనని. ఓసారి ఆ సుమ ఎవరో చూసి ధన్యుడిని కావాలని మా జడ్జిగారు కూడా రిక్వెస్ట్ చేశారు - ఓసారి కోర్టుకు రాకూడదూ? ప్లీజ్ సుమా?'

'అంతొద్దు లాయర్‌జీ అర్థమైపోయింది. నీదేంలేదు -క్రెడిటంతా హిమక్కదేనంటారు. యా మై కరెక్ట్? ' సూటిగా అడిగేసింది సుమ.

'ఏది ఏమైనా మన మిల్లు ఓపెన్ అవ్వాలి - మనూరు మళ్ళీ కళకళలాడాలి మనందరి కోరిక అదేకదా?' బోసుబాబు అన్నాడు.

'ఆయనొచ్చాక కదా! అసలు విషయం తెలిసేది?' అనురాధాదేవి కల్పించుకుంది.

'మన ప్రయత్నం మనం చేద్దాం, ఆ తర్వాత కోర్టుంది' వెంకటరత్నం అన్నాడు.

'ఆ - కోర్టు విషయం తెలిసిందేగా. తీర్పు వచ్చేసరికి రాజెవరో, మంత్రెవరో?' మూతి తిప్పింది అనురాధాదేవి.

'అమ్మా! కోర్టులనంత ఈజీగా తీసెయ్యకే - బంగారు కంచాల్లో తిన్న రెడ్డి దొరలు కోర్టు పుణ్యమాని చిప్పకూడు తింటున్నారు. ప్రతిదానికీ ఓ టైముంటుంది. నాదీ గ్యారంటీ' సుమ తల్లికి చెప్పింది.

అందరి సంభాషణా గదిలోంచి వింటున్న హిమ హాల్లోకి రావాలా వద్దా? అన్న మీమాంసలో పడిపోయింది.

బోసుబాబును చూడాలన్న తహ తహ, అమ్మ కనిపెట్టేస్తుందని భయం ఆమెను కలవర పెట్టేస్తున్నాయి.

అందరికీ కాఫీలు కలుపుకొచ్చింది సీత. అందరికీ యిచ్చి - 'పెద్దమ్మాయిగారు ఎక్కడున్నారు?' సుమని అడిగింది.

బోసుబాబు గుండె లయ తప్పింది. పెళ్ళైపోయిన హిమ గురించి తన మనసెందుకిలా స్పందిస్తుందో అర్థంగాని లక్షడాలర్ల ప్రశ్నలా అనుక్షణ అలజడి లేపుతూనే ఉంది.

'అక్కాజీ! సీత అమృతం తెచ్చింది తొరగారా'

సుమ మాటలు అర్థమైపోయినట్లు 'పంచదారెక్కువైపోతే పాలు పోస్తానమ్మా' అంటూ పజిలైపోతుంటే -

'దాన్ని ఆట పట్టించకే సుమా!' అడ్డుపడిపోయింది అనురాధాదేవి.

'సుమమ్మ ఏమన్నా ముద్దుగానే వుంటాదమ్మా. భీముడ్ని రాముడంటాది, నన్నేమో హిడంబి అంటాది - ఆళ్ళంతా ఎవరమ్మా? '

సీత మాటలు వింటూనే అందరూ పకపకా నవ్వేశారు.

హిమ నెమ్మదిగా వచ్చి తన కప్పు తీసుకుని తల్లి పక్కనే అనే కన్నా బోసుబాబు ఎదురుగా కూర్చుండిపోయింది. బోసుబాబు చూపులు నేలకు ఆనించేసాడు. చిన్నగా నవ్వుకుంది హిమ - బోసుబాబు అవస్థను గమనిస్తూ. తన మనసుకూడా అదే వేవ్ లెంగ్త్‌లో ట్యూనైపోయిందన్న విషయం ఆమెకే చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

'బాబూ! బోసుబాబూ! లాయర్ బాబూజీ! కొంచెం తలెత్తండి సార్. సండే ప్రోగ్రాం గురించి మీతో డిస్కస్ చేయాలని రాత్రంతా ప్లాన్ చేశాం. మీరిలా కేస్ లాసయిన లాయర్ ఫేసు పెడితే అస్సలు బాగోలా. చెప్పండి నాన్నా! మీరైనా చెప్పండి'. ఆరిందలా అందరినీ చూస్తూ అంది.

'గోపాలకృష్ణగారు ఫోన్లో అసలేమీ ఆర్భాటాలు చెయ్యొద్దని డాడీకి చెప్పమని అక్కకు చెప్పారు. ఔనా?' బోసుబాబు సుమను అడిగాడు.

అవునన్నట్లు తలూపింది హిమ.

'ఆయన చెప్పారని మనం వూరుకుంటామా ఏమిటి? మనం చేసేదేదో మనం చేయాలిగా'? తేల్చి చెప్పింది అనురాధాదేవి.

'రజనీకి పీజాలంటే యిష్టం యింకా తన ఫ్రెండ్స్ కూడా వస్తున్నారట. వాళ్ళకేం యిష్టమో? అమ్మా.. నేనూ, హిమక్కా కంకిపాడు షాపింగ్ కెళ్లొస్తామే' గారాలుపోయింది సుమ.

ఏ మూడ్‌లో వుందో సరే అనేసింది తల్లి. యాహూ అంటూ హిమకు చిన్నగా కన్నుకొట్టి తల్లిని ముద్దుపెట్టుకుంది.

'దీని మేజిక్కులకు మోసపోయి ఐదు మించకండి' కండిషన్ పెట్టింది.

'మమ్మీ యిది తల్లుల యుగం కాదు, పిల్లల యుగం. ఐదువేలకే సీలింగా? యిది అన్యాయం, అక్రమం' నాటకీయంగా తన ఆక్రోశాన్ని కక్కేసింది.

తిన్నగా వచ్చి తండ్రి ప్రక్కనే సెటిలైపోయింది.

'రిజర్వు బ్యాంకును కబ్జా చేశావురా సుమా!' నోరిప్పాడు బోసుబాబు.

వెవ్వెవ్వే అని వెక్కరిస్తూ బయటికెళ్ళిపోయింది సుమ.

'ఈసారైనా హిమతో మాట్లాడాలి అని' బోసనుకుంటే -

'ఈసారైనా బాబుతో మాట్లాడాలి' అని నిర్ణయించుకుంది హిమ.

వీళ్ళిద్దరూ కలుస్తారేమోనన్న ఆలోచన కూడా రాని అనురాధాదేవి - ఆ విషయాన్నే మర్చిపోయింది.

'అయ్యా! స్వామి తాతగారొచ్చారు'. డ్రైవర్ బాలయ్య చెప్పడంతో బయటికొచ్చేశారు - వెంకటరత్నం, బోసుబాబులు.

**ఇన్నోవా బొడ్డపాడు దాటేసింది**. ముందు సీట్లో రమ్య, వెనక సీట్లో హిమ, సుమ.

"అక్కా! ఇంకా బోసుబాబంటే అంతిష్టమా?" హఠాత్తుగా అడిగిన ఆ ప్రశ్న పిడుగుపాటులా తాకింది హిమ గుండెను.

ఏం చెప్పాలి? అసలెందుకా అభిప్రాయం సుమకొచ్చింది? తనెక్కడ పొరపాటు చేసింది? తలబద్దలు కొట్టుకుంటుంటే "సారీ అక్కా - హర్ట్ చేశానా?" చుబుకం పట్టుకుని అడిగింది.

చిన్న అలజడి - కాదన్నట్లు తలూపింది. అప్రయత్నంగా కన్నుల నిండా నీళ్ళు తిరిగాయి.

సుమ చేతిని తన బుగ్గకు ఆనించుకుని కళ్ళుమూసుకుంది.

"బావతో గొడవా?" లో గొంతుకతో అడిగింది.

"కాదన్నట్లు" తలూపింది హిమ.

"నేనెవ్వరితోనూ చెప్పనక్కా - ఇట్స్ మై ప్రామిస్" కన్విన్స్ చేయాలని ట్రై చేసింది.

"అదేంటే సుమా! డైలాగ్ మార్చావ్. ప్రామిస్ కాదు 'ఇట్స్ మై గ్యారంటీ' అనాలి కదా?"

మూడ్ మార్చాలని మాట మార్చింది హిమ.

"అక్కా అయాం నాటే కిడ్ యు నో" అంటుంటే నోరు మూస్తూ.

"ఐ విల్ షేర్ మై ఫీలింగ్స్ విత్ మై లవ్లీ సిస్టర్ ఓన్లీ, బట్ నాట్ నౌ" అంటూ కన్విన్స్ చేసింది.

"బిందమ్మా లాయరుగారు వస్తున్నారు - ఆపమంటారా?" ఇన్నోవా స్లో చేస్తూ అడిగాడు బాలయ్య."స్టాప్" సుమ అరిచినంత పనిచేసింది.

అప్పటికే ఇన్నోవాను గమనించిన బాబు తన బైక్ స్టాండ్ వేసి - వెహికల్ దగ్గరికి వచ్చేశాడు.

"హాయ్ సుమా! " విష్ చేస్తుంటే

"విష్ చేయడం కాదు - హెల్ప్ చేయాలి"

"విత్ ప్లెజర్. ఆజ్ఞాపించండి 'సు-మాజీ'" అన్నాడు.

"మాజీ అంటూ మరీ అంతొద్దుగానీ మాతో వచ్చి షాపింగ్‌లో హెల్ప్ చేయాలి. "

'జీ హుజూర్' అంటుంటే. "అక్కుందని అంత ఓవరేక్షనొద్దుగానీ బైక్ బందరు కాలువలో తోసేసి కారు ఎక్కేయండి. మనం తిరిగొచ్చేలాగా వాటర్ సర్వీసింగ్ అయిపోతుంది - నాదీ గ్యారంటీ" హిమ రమ్యలతోబాటు బాలయ్య కూడా నవ్వేశాడు.

"అక్కేమో అమెరికా బ్యాంక్ తమరేమో డాటరాఫ్ రిజర్వ్ బ్యాంక్. ఏదో ఈసారికి ఈ చెట్టు క్రింద ప్లీడర్ని క్షమించి వదులేయచ్చుగా?"

"మించితి - మించితి - మామయ్యతో చెప్పి ఓ మారుతుని ట్రైచేస్తా - నాదీ గ్యారంటీ"

"అదీ అయ్యింది తల్లీ - నువ్వే ఒక మారుతివి - మళ్ళీ నీకు యింకో మారుతా? " అన్నారు డాడీ.

"అదేంటీ మారుతంటే కారుకదా?" అమాయకంగా అడిగింది సుమ.

"అయ్యో అక్కా! మారుతంటే కోతి" రమ్య చెప్పింది.

"ఆహా అంకుల్ ఎంత కరెక్ట్‌గా చెప్పారు? హ్యాట్స్ఆఫ్" అంటూ చప్పట్లు కొట్టింది.

"ఇక చాలుగానీ ప్రోగ్రాం చెప్పు" సుమను హెచ్చరించింది హిమ.

"సుమాజీ - మీ కార్‌ను నేను ఫాలో అవుతాను. దీని పేరే పల్సర్. కాలువలోకి తోసేస్తే 'పల్స్' అందక ఫట్‌మని పేలిపోతుంది."

"ఓకె ఓకె - ప్రొసీడ్ లాయర్‌గారూ" అంటూ నర్మగర్భంగా నవ్వుతూ హిమను చూసింది.

అప్పటికే హిమ బోస్ వెనకాల భుజం మీద చెయ్యేసి హత్తుకుపోతూ ఆనంద లోకాల్లో విహరించిన ఫ్లాష్‌బ్యాక్‌ను ప్రెజంట్‌టెన్స్‌గా మార్చుకునీ వూహల్లో వూరేగిపోతుంటే.

"అమ్మో అక్కా కనిపిస్తుందే నీ బుగ్గల్లో బుక్కా" అనుకుంటూ కామైపోయింది.

ఇన్నోవా వచ్చి శ్రీలక్ష్మి షాపింగ్ మాల్ ముందు ఆగింది.

"అక్కా! డాడీ దగ్గర అనఫిషియల్‌గా టెన్ నొక్కేశా. రజనీ వాళ్ళ బ్రదర్ వరుణ్‌తోబాటు మరో నాలుగు మారుతీలు కూడా వస్తున్నాయని బి.బి.సి న్యూస్ ప్లస్ లక్ష్మికూడా వుంది. నువ్వే హెల్ప్ చేయాలి."

షాపింగ్‌మాల్‌లోకి ఎంటరౌతుంటే బోసుబాబొచ్చి కలిశాడు.

"సుమాజీ - ఈ షాపింగ్ మాల్ ఓనర్ నా క్లైంట్, ప్లస్ ఫ్రండ్ - బిల్లులు చెల్లించేటప్పుడు నన్ను మర్చిపోకు", చిన్నగా క్లూ యిచ్చాడు.

"షాపింగ్ కన్నా ముందు, ఇందులో చిన్న చైనీస్ రెస్టారెంట్ వుంది అందులో చిన్న ట్రీట్" ఆగిపోయాడు బోసుబాబు.

"అబ్బాయి చాలా ఫాస్టే" అక్క చెవిలో గొణుగుతుంటే తామెన్నిసార్లు ఆ రెస్టారెంట్ కొచ్చామో తెలిస్తే కళ్ళు తేలేస్తుందనుకుంటూ బోస్ వంక ఓరగా చూసింది.

హిమనే చూస్తున్న బోస్ చూపులు కలవగానే కలవరపడిపోయాడు. ఏదో గిల్టీ ఫీలింగ్.

బోసును చూస్తూనే కౌంటర్‌లో వున్న వ్యక్తి లేచొచ్చి బోస్‌కు షేక్‌హ్యాండిచ్చి వెల్‌కం చెప్పాడు శ్రీహర్ష.

ఒక సేల్స్ గర్ల్‌ను పిలిచి వీళ్ళకు ఎటాచ్ చేసాడు.

సుమ, హిమ, రమ్యలు కాస్త దూరంగా వెళ్ళగానే 'ఆ అమ్మాయేగా' గుంభనంగా అడిగాడు శ్రీహర్ష.

"యస్" అన్నట్లు చిన్నగా నవ్వాడు. "ఓకే క్యారీ ఆన్ - ఐవిల్ మీట్ యు లేటర్" అంటూ కౌంటర్‌కెళ్ళిపోయాడు శ్రీహర్ష.

ఫాన్సీ అయిటమ్స్ కౌంటర్ ముందున్న సుమను చూస్తూ, "ముందు మనం రెస్టారెంట్‌కి వెళ్దాం" దారితీసాడు బోసు.

ఒక్కసారిగా యిద్దరూ కనులముందు ఫ్లాష్‌బాక్ ఫ్లాషయ్యింది. ఇద్దరూ సిగ్గులమొగ్గలయ్యారు.

"మేడం!" మెనూ కార్డ్ అందిస్తూ వెయిటర్ పిలిచిన పిలుపుతో వులిక్కిపడ్డారు యిద్దరూ ఒక్కసారే.

వీళ్ళిద్దరి వాలకాలూ అర్థంకాని సుమ పజిలైపోయింది "గతం తెలుసు. ప్రెజెంటేన్సే అయోమయంగా వుంది" అనుకుంటూ - "ఓకే ఐ విల్ షే విత్ యు" అని అక్కమాటిచ్చిందిగా - "వెయిట్ అండ్ సీ" అనేసుకుని 'లైట్' తీసుకుంది.

"అక్కా బోస్‌తో మాట్లాడాలి - ప్రైవసీ కావాలంటే చెప్పు. ఐ కెన్ హెల్ప్ యూ" చెవిలో వూదింది.

తత్తరపడిన హిమ అన్‌కంఫర్టబుల్‌గా ఫీలైపోతుంటే "సంథింగ్ ఈజ్ ఫిష్షీ .ఐ హేవ్ టు హెల్ప్ హెర్" అనుకుంది.

ఆర్డరిచ్చిన ఐటమ్స్ చకాచకా లాగించేస్తూ తన సెల్ తీసుకుని మాట్లాడిన సుమ. "అక్కా! యిప్పుడే వచ్చేస్తాను నేను షాపింగ్‌కు వస్తున్నానని నా బెస్ట్ ఫ్రెండ్ సౌమ్యకు చెప్పాను. అదేమో నీ కోసం తయారై గంట నుంచి వెయిటింగ్ అంటూ ఫోన్ చేసింది జస్ట్ యిప్పుడే వచ్చేస్తా. రమ్యా నువ్వు కూడా రా" అంటూ హడావుడి చేసి వెళ్ళిపోయింది.

హిమకు చెల్లి మనసు అర్థమైంది రెస్టారెంట్‌లో జనమే లేరు. తప్పదు బోసుముందు మనసిప్పాలని నిర్ణయించుకుంది.

అప్పుడే బోసు తలెత్తాడు.

తనవంకే చూస్తున్న హిమను చూస్తూ "హిమా నీతో మాట్లాడాలి" ధైర్యం చేసి నోరిప్పాడు.

ఆశ్చర్యంగా చూసింది హిమ. "ఎందుకొచ్చావు? గోపీనాథ్ ఎప్పుడొస్తాడు - ఇంతేనా? " అడిగింది.

కాదన్నట్లు తలవూపాడు.

మరేంటి అన్నట్లు కళ్ళు రెపరెపలాడించింది.

"నువ్వు హిమబిందువేనా?"

ఆశ్చర్యపోయింది.

"యస్ నువ్వు హిమబిందువుకావు, మనం పెళ్ళి చేసుకోకపోయిన ఫ్రెండ్స్‌లా వుందామనుకున్నాం. అవునా?"

అవునన్నట్లు తలూపింది హిమ.

"మరి నన్నెందుకిలా!? నన్నేకాదు అందరినీ పజిల్ చేసేస్తున్నావ్"

"వాట్ ఈజ్ రాంగ్ విత్ యూ? ఎనీథింగ్ ఐయాం రెడీ టు షేర్. ప్లీజ్ కమౌట్ నీ స్వభావం నాకు తెలుసు ఎలాంటి సిట్యుయేషన్నైనా టేకిల్ చేయగలవు. నువ్వు కావాలనే ఏదో దాస్తున్నావ్."

హిమ కళ్ళు అతని కన్‌సర్న్‌కు కన్నీటి కాలువలయ్యాయి.

మూడీగా మారిపోయింది.

"సారీ హిమ బాధపెడితే ఐ యాం సో సారీ " గద్గద స్వరంతో అన్నాడు.

కళ్ళు తుడుచుకుని అతనివంక సూటిగా చూసింది తొలిసారిగా.

"బాబూ! నా సమస్యకు పరిష్కారంలేదు. అదేమిటో చెప్తాను. నేను నిన్నో మాట అడగనా?"

ఆ మాటలు వింటూనే ఆ ప్రశ్నేమిటో అతనికి అర్థమైపోయింది.

"హిమా శ్రీహర్ష గుర్తున్నాడా? ఎప్పుడు నన్ను ఏడ్పించేవాడు - నీ యింటరయ్యాక మన పరిచయం పెరిగాక హైస్కూల్ ఏజ్‌లో నీమీదున్న యిష్టం అను, అభిమానం అను ప్రేమగా మారకముందే మన అసెంబ్లీ ప్రేయర్‌లో భారతీయులందరూ నా సహోదరులు అంటే ఒకే ఒక్క అమ్మాయి తప్ప అనేవాడిని. ముందేదో సరదాకంటున్నాను అనుకున్నాడు. టెన్త్‌లో నా మాటలు సరదాకంటున్నవి కావని గ్రహించి అడిగాడు.

ఎవర్రా ఆ ఒకే ఒక అమ్మాయి అని జీవితంలో ఎవరికీ చెప్పనని ఒట్టు వేయించుకుని నీ పేరు చెప్పాను. "నీ యిష్టం చెప్పావు మరి హిమ మరెవరినైనా యిష్టపడితే" అడిగాడు వాడూ సీరియస్‌గా "అది తన యిష్టం నా దురదృష్టమన్నాను." యిప్పుడు చెప్పు అన్నాను. నీ స్థానంలో మరో అమ్మాయిని ఊహించుకోలేను. ఊహించుకోను కూడా" కళ్ళల్లోకి చూస్తూ కన్‌ఫర్మ్‌డ్‌గా చెప్పాడు.

హిమ గుండె లయ తప్పింది. తను తల్లిని ఎదిరించలేక ఏమి కోల్పోయిందో అదెంత అమూల్యమో మరోసారి మనస్సుని తాకింది.

"మరి అత్తయ్య మామయ్యలు?" అడిగింది.

నాన్న నా నిర్ణయాన్ని నాకే వదిలేసారు. అమ్మా, అక్కా విఫల ప్రయత్నాలింకా విరమించుకోలేదు అదేదో రొటీన్ విషయమన్నట్లు చెప్పాడు.

"నా మూలంగానే కదా - యిన్ని గొడవలు?" బాధగా అడిగింది.

"కాదు! యిది నా జీవితం. నా నిర్ణయం. నువ్వు గిల్టీగా ఫీలయితే నేను చాలా హర్టవుతాను. నేనేంటో నీకు తెలుసు. జరిగింది మరిచిపో. ఇప్పుడు నీ ప్రాబ్లం ఏమిటో చెప్పు - నేనూ శాయశక్తులా సొల్యూషన్ కోసం హెల్ప్ చేస్తా! "

"మళ్ళీ మళ్ళీ నీ జీవితంతో" ఆగిపోయింది హఠాత్తుగా. మెయిన్ గేట్‌లోంచి వస్తున్న సుమను అద్దాల్లోంచి గమనిస్తూ -

"బాబూ! నీతో జీవితాన్ని షేర్ చేసుకోకపోయినా నా ప్రాబ్లమ్‌ని షేర్ చేసుకుంటానంటున్నావ్ ఐ థిం ఐ యామ్ వెరీ లక్కీ - డెఫినెట్లీ ఐ విల్ టెల్ మై ప్రాబ్లెం."

"అక్కాజీ అయిపోయిందా? " అంటూ వచ్చేసింది సుమ. నవ్వు ముఖంతో వున్న అక్క ముఖం చూస్తూ హమ్మయ్య కొంచెం తేరుకుంది అనుకుంది.

షాపింగ్ పూర్తయ్యింది. ఇన్నోవా వెళ్ళిపోయింది.

బోసుబాబు శ్రీహర్షతో మిగిలిపోయాడు. శ్రీహర్షకు బై చెప్పి తన బైక్ స్టార్ట్ చేసాడు.

ఊరు ఊరంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్న ఆదివారం వచ్చేసింది.

ఉదయం ఆరుగంటలనుండే కోలాహలం మొదలైపోయింది.

దాదాపు పది ఎడ్లబండ్లు అతిథుల్ని ఆహ్వానించడానికి ఉదయమే బొడ్డుపాడు వెళ్ళిపోయాయి.

మిల్లంతా కడిగించి మామిడి తోరణాలు కట్టించాడు స్వామితాత.

ఖర్చులన్నీ భరిస్తూ కనుసన్నలతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు వెంకటరత్నం.

అందమైన స్టేజీ, మైక్ ఏర్పాట్లను బోసుబాబు, విష్ణువర్ధన్‌లతో బాటు చాలా మంది యువకులు భుజాలకెత్తుకున్నారు. వూళ్ళో అందరికీ ఆహ్వానాలు చెప్పారు వెంకటరత్నం.

స్వామితాత కొడుకు సూర్యంకూడా భార్యతో వచ్చేసాడు.

అమ్మా నాన్నల్ని చూసి రమ్య చాలా హేపీగా ఫీలైపోయింది.

అందమైన దుస్తుల్లో ఆనందంగా తిరిగేస్తున్న కూతుర్ని చూసి సూర్యం దంపతులు తెగముచ్చట పడిపోతుంటే, ఇదంతా హిమబిందు పుణ్యమేనని లక్షసార్లు చెప్పింది లక్ష్మీదేవమ్మ.

అనురాధాదేవి యిద్దరు కూతుళ్ళతో అట్టహాసంగా కదిలి వచ్చింది.

తురాయిచెట్టు రంగురంగుల తోరణాలతో హరివిల్లు ఆవహించిందేమోనన్న విధంగా అందాలు ఒలకబోస్తోంది. పాతకాలం నాటి సరంగులు ఆ చెట్టుకింద పడవల్ని ఆపేసి తెరచాపలు దించకుండానే లంగర్లు వేయడంతో పండగ వాతావరణం పోగుపడిపోయింది. కార్మికులు పిల్లలతో బాటు పెద్దలు కూడా గుమికూడి పోవడంతో ఓ తిరణాలలా మారిపోయిందా ప్రాంతం.

దూరంగా గేలప్‌తో వస్తున్న ఎడ్లబండ్లు వాటి వెనుక వస్తున్న రెండు పెద పెద్ద కార్లను చూస్తూనే కేరింతలు కొట్టారు అందరూ.

ముందు బండిలో హుందాగా వున్న యువకుడిని వరుణ్‌గా పోల్చేసుకుంది సుమ. "అంకుల్ పర్సనాలిటీ ఆంటీ కలర్ వావ్ హీరోలా" వున్నాడక్కా. ఆనందాన్ని అక్కతో షేర్ చేసుకోవాలని గట్టిగా అనేసింది సుమ.

రెండో బండిలో వున్న అమ్మాయిల్ని రజని, రజని ఫ్రెండ్స్‌గా గుర్తించేసింది. "అక్కా! వీళ్ళంతా బండి సవారీ ఎంజాయ్ చేయడానికి బొడ్డుపాడులో బళ్ళు మారుంటారు నాదీ గ్యారంటీ" అంటుండగానే బళ్ళన్నీ వచ్చి మిల్లుగేటు ముందు ఆగాయి.

బాలయ్య స్టూల్ పట్టుకుని పరుగెడుతుండగానే అందరూ చక్ చక్ మంటూ బల్లమీద నుంచి దూకేసారు ఆపుకోలేని ఆతృతతో సుమ పరుగెత్తి రజనీని కౌగలించేసుకుంది.

రజని తన ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తూ - "యూనో హి ఈజ్ మై బ్రదర్ వరుణ్" అంటుండగానే "బావా!ప్ అంటూ షేక్ హేండిచ్చేస్తుంటే ఆ అమ్మాయి స్పీడుకి బావా! అన్న పిలుపుకు కంగుతినేసాడు వరుణ్.

అంతలో రెండు కార్లూ ఆగడం బాలయ్య డోర్స్ ఓపెన్ చేయడం, కార్ దిగ్గానే గోపాలకృష్ణను ఎంప్లాయీస్ ఎత్తుకెళ్ళి స్వామితాత ముందు నిలబెట్టం జరిగిపోయాయి.

కాళ్ళకు దండం పెట్టబోతున్న స్వామి తాతను ఒక్కసారిగా కౌగిలిలోకి తీసుకుంటుంటే - చప్పట్లు హర్షధ్వానాలు ప్రతిధ్వనించిపోయాయి.

వెంకటరత్నంతో బాటు పరిచయం వున్న అందరినీ పలకరిస్తుంటే, వూరికి పెద్ద బ్రహ్మం తాత వచ్చి పూలమాల వేసాడు.

అదృశ్యం చూస్తూనే ఎన్ని లక్షలు వెచ్చించినా రానిది ఈ ఆనందం అని వరుణ్ తల్లి అనుకుంటుంటే అనురాధ వచ్చి ఆప్యాయంగా పూలగుత్తిని అందించింది.

హిమ, సుమలు వంగి నమస్కరించబోతుంటే యిద్దరినీ కౌగిలిలోకి తీసుకుంటూ ప్రభుత్వం వారు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నాకు పిల్లలు యిద్దరు కాదు నలుగురు అంటుంటే -- తల్లికళ్ళు చెమ్మగిల్లడం చూసి సుమను చిన్నగా గిచ్చింది రజని.

"మదర్ సెంటిమెంట్ ఇంతకు బావెక్కడ?" అడిగిన సుమను అయోమయంగా చూస్తూ "బావ బావంటే?" అడిగింది రజని.

"మీ బ్రదరే తల్లీ! అమెరికా రిటన్డ్" కళ్ళు చిట్లిస్తూ సమాధానం యిచ్చింది.

"రజనీ! సుమ సంగతి తెలుసుగా సీరియస్‌గా తీసుకోకు" హిమ అంది.

"ఉన్నమాటంటే వులుకెందుకు తల్లీ? - వరుణ్ ఖచ్చితంగా బావే" కన్‌ఫర్మ్‌డ్‌గా చెప్పింది.

"ఇదీ మధ్య ప్రహేళికలా మాట్లాడుతోంది. నన్నేమో 'తపోకో' అంటుంటే తమాషాకనుకున్నాను యిప్పుడు వరుణ్‌ని - దీనికి నిజంగా లూజే" హిమ టీజ్ చేసింది.

అందరూ మిల్లులోపలికెళ్ళారు.

అందమైన డయాస్ అలంకరణ చూస్తూనే "మళ్ళీ ఫ్యాక్టరీ ఓపెన్ అయినట్లుంది" ఆనందంగా కామెంట్ చేసింది విజయలక్ష్మిగారు.

"మా అందరి కలా అదే" అనురాధ బదులిచ్చింది.

లోపల డయాస్ ముందు షామియానా వేసారు. దాదాపు రెండు వందల ప్లాస్టిక్ కుర్చీలు నీట్‌గా వేసారు.

స్వామితాత - వెంకటరత్నం తదితరులు వేదిక మీదున్న ఒకే ఒక సింహాసనం వంటి కుర్చీలో గోపాలకృష్ణగారిని కూర్చోబెట్టి అందరూ క్రిందకు దిగి కుర్చీల్లో కూర్చుండిపోయారు.

ఆ ఏర్పాట్లకు, వారి ఆప్యాయతకు చలించిపోయిన గోపాలకృష్ణగారు మాటలేరానట్లు మౌనంగా వుండిపోయారు.

అందరిలోనూ ఉత్కంఠ. పిన్‌డ్రాప్ సైలెన్స్. వరుణ్, రజని, విజయలక్ష్మి ఆయన్నే చూస్తూ ఆశ్చర్యపోతుంటే, నెమ్మదిగా లేచి టేబుల్ మీదున్న ఎఫ్.యం మైకందుకున్నారు.

"మీ అందరి అభిమానానికి నా కృతజ్ఞతలు. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత మిమ్మల్ని చూస్తున్నాను. ఎలా వున్నారని అడగడం భావ్యం కాదు. నేను ఫ్యాక్టరీ మూసేసి తప్పుచేశానో, ఒప్పుచేసానో యిప్పుడు మాట్లాడుకోవడం సబబుకాదు. నాకెంతో నమ్మకస్తుడు స్వామితాత కోర్టుకెళ్ళాడని తెలిసి చాలా బాధపడ్డానే కానీ అది మీ అందరికోసమని ఆలస్యంగా తెలుసుకున్నాను.

లాయర్ బోసుబాబు మీ అందరికోసం ఫీజు తీసుకోకుండా వాదిస్తున్నాడని కూడా తెలుసుకున్నాను. సంతోషించాను.

ఈ మధ్యలో స్వామితాత కలిసి మీరంతా మీకు రావలసిన గ్రాట్యుటీ, ఎరియర్స్ వదిలేస్తామన్నారని దయచేసి ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించమని ప్రాధేయపడ్డాడు.

ఇదే సమయంలో అమెరికా వెళ్ళిన వరుణ్ ఇండియాకు వచ్చేస్తున్నానని చెప్పాడు.

ఏం చేయాలా అని మీమాంసలో పడ్డాను. పదిరోజుల క్రితం హిమ మా యింటికొచ్చింది.

'అంకుల్ మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలు నాశనమైపోతున్నాయి. పనిలేదు. తిండిలేదు. పిల్లలకు చదువులేదు. స్వామితాత కార్మికుల కోసం త్యాగం చేసాడు. ఊళ్ళో రైతులు తమవంతు సాయం అందిస్తున్నార'ని చెప్పింది. అంతేకాకుండా తన్న పేరనున్న కట్నం తాలూకు డబ్బు, పొలాలను వూరి క్షేమం కోసం ఇచ్చేస్తానని చెప్పింది. కదిలిపోయాను అనడం కంటే హిమే నన్ను కదిలించింది."

అందరూ హిమ వంక చూస్తూ కరతాళ ధ్వనులు చేసారు.

"నా ఒక్కగానొక్క కొడుకు వరుణ్ తో మాట్లాడాను. వాడికి పల్లెటూరి జీవితమంటే యిష్టం అన్నాడు. మరో వూరెందుకు మన వూరే వుందని ఆలోచించాను. వరుణ్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ప్రారంభిస్తాను."

ఆయన మాటలు పూర్తిచేయకుండానే "గోపాలకృష్ణగారికి జై! వరుణ్‌బాబు జిందాబాద్" అనే నినాదాలు మిన్నుముట్టాయి.

అందరినీ శాంతించమని మళ్ళీ మాట్లాడడం మొదలు పెట్టారు గోపాలకృష్ణ.

"నెక్స్ వీక్ నుండీ వరుణ్ యిక్కడే వుంటాడు. తనకి మీరంతా సాయం చేయండి. స్వామితాత ఆధ్వర్యంలో పనులు సాగించండి. నా మిత్రుడు వెంకటరత్నంతోబాటు లాయర్ బోసుబాబు కూడా సాయం చేస్తారు. " తన మాటలు ముగించి కూర్చుండిపోయారు.

స్వామితాత నెమ్మదిగా డయాసెక్కి అందరికీ నమస్కరించి ఈరోజే పండగ. మనందరి నాలుగు సంవత్సరాల కల యిపుడే నెరవేరిది. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం మళ్ళీ మనూరికి పాతరోజులు తిరిగితెద్దాం. ఎమోషనల్ అయిపోయాడు.

కళ్ళు వత్తుకుంటూ మరోసారి గోపాలకృష్ణకు నమస్కరించబోతుంటే ఆయనలేచి కౌగిలించుకుని, "తాతా! నువ్వు పెద్దవాడివి చిన్నవాళ్ళకు నమస్కరించకూడదు. వరుణ్‌ని నీ చేతుల్లో పెడుతున్నా బాధ్యత, భారం అంతా నీదే "

సెలవు తీసుకుంటుంటే మరోసారి మారుమోగాయి కరతాళధ్వనులు.

ఉదయం సభకు వచ్చిన అందరికీ భోజనాలు ఏర్పాటు చేశాడు వెంకటరత్నం. ఓ ప్రక్క బంతి భోజనాలు జరుగుతుంటే ఫ్యాక్టరీ ఆఫీస్‌లో వెంకటరత్నంగారు గోపాలకృష్ణ ఫామిలీతో బాటు వూరి పెద్దలకు కూడా భోజనాలు ఏర్పాటు చేశారు. అనురాధాదేవితో బాటు హిమ, సుమలు వడ్డన చేస్తున్నారు.

బండి దిగిన మరుక్షణమే వినిపించిన "బావా" అన్నమాటే యింకా చెవుల్లో గింగురుమంటుంటే వడ్డిస్తున్న సుమను తేరిపార చూడకుండా వుండలేకపోయాడు.

'లంగావోణీలలో బాపూ బొమ్మలా అనిపించింది. అయిదున్నర అడుగుల ఎత్తుతో అపురూపశిల్పంలా భాసించింది. హిమను మించిన్ అసుమ, సుమను మించిన హిమ అనుకుంటూ అందాన్ని ఆస్వాదిస్తుంటే

"అదేంట్రా అన్నయ్యా అన్నంలో అ,ఆలు రాసేస్తున్నావ్?" అన్న రజనీ ప్రశ్నతో వులిక్కిపడి "ఎన్ని దేశాలు తిరిగి ఎంత సంపాదించినా ఆంధ్రా వంటకాలు, ఆంధ్రా వంటకాలే - అమెరికా వెళ్ళి ఏం పోగొట్టుకున్నానో తలుచుకుంటూ బాధపడుతున్నాను" అని సమర్ధించుకున్నాడు.

"సుమ సింధూ! రాగనే బావన్నావ్. బావకేం కావాలో చూడవా? " జోవియల్‌గా అంది విజయలక్ష్మి.

"వరుణ్‌జీ నాకే కాదు అందరికీ బావే - నాదీ గ్యారంటీ" పజిల్ యిచ్చింది సుమ.

**ఇక మీరు లక్ష కథలు** చెప్పినా నేను వినను. ముందు అదెందుకొచ్చిందో నాకు తెలియాలి. గోపీనాథ్ నుంచి ఫోన్ లేదు. వాళ్ళింటికి ఫోన్ చేస్తే మాకేమి తెలియదంటారు - అమెరికానుంచి ఒక్కతే వచ్చింది. వస్తున్నానన్న కబురేలేదు - వచ్చాక ఎందుకొచ్చిందో చెప్పాలన్న ఇంగితం లేదు. పిల్లల్ని కనడం - పెంచడం - పెళ్ళిల్లు చేయడం యిలా బాధలు పడడం - ఛీ. యిదేనా జీవితమంటే? మీరేం చేస్తారో నాకు తెలీదు - అదిరాగనే నోరిప్పాలి అంతే.'

వినిపించిన ఇన్నోవా శబ్దానికి లోపిచ్‌లోనికి వచ్చేసింది అనురాధాదేవి.

అప్పటికే - అయోమయంగా మారిపోయారు వెంకటరత్నంగారు. ఒక్కనాడు కూడా పిల్లల్ని మందలించడంగానీ, ప్రశ్నించడంగానీ ఆయనెరుగడు.

హిమ, సుమలు ఆయనకు రెండు కళ్ళతో సమానం. మొదటి నుంచీ ఆయనకు అమెరికా సంబంధాలంటే అసహ్యం, కోపం. అల్లారు ముద్దుగా పెంచిన పిల్లల్ని అందనంత దూరం పంపించి ఆప్యాయతలకు దూరమైపోతున్నామన్నది ఆయన ఫీలింగ్. అనురాధాదేవి మంకుపట్టు, గయ్యాళితనం అతని ఆశయాలకు అడ్డుపడిపోయాయి.

'ఈ పెళ్ళి జరగకపోతే నీకు అమ్మే వుండదు - ఆలోచించుకో' అంటూ హిమను ఆరడిపెట్టి తన పంతం నెగ్గించుకుంది అనురాధాదేవి.

హిమ వెళ్ళి రెండేళ్ళయ్యింది ఒక ఫోనుగాని, మెయిల్‌గాని లేదు. ఏమయ్యిందోనని దిగులుపడడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి. నరకం అంటే యిదే అనిపిస్తుంటే అందరికోసం నవ్వును నటిస్తూ - బ్రతకడంకన్నా ఘోరం మరొకటి లేదనిపిస్తుంటే, అతి భారంగా కాలాన్ని దొర్లించడం దుర్లభమైపోయింది వెంకటరత్నంగారికి. దీనికి తోడు రైస్‌మిల్లు ప్రోబ్లెం. యిప్పుడు హఠాత్తుగా హిమ రావడం, భార్య సతాయింపులతో దాదాపుగా పిచ్చివాడి స్థాయికి వచ్చేసాడాయన. 'ఎలా అడగాలి? ఏమని అడగాలి? గోపీనాథ్ తల్లిదండ్రులు కూడా తన స్టేజిలోనే వున్నారు' అనుకుంటుంటే -

'డాడీ వచ్చేసాం.' సుమ హిమలొచ్చి వెంకటరత్నాన్ని ఈ లోకంలోకి తెచ్చేశారు.

'అయ్యిందా బలాదూర్ తిరుగుడు?' అనురాధాదేవి అడిగింది.

'మమ్మీ! నీకు ఈ మధ్య మతికూడా పోతోంది. మేం సుభద్రత్తయ్య వాళ్ళింటికెళ్తే బలాదూర్ తిరుగుడంటావ్?' ఎదిరించింది సుమ.

ఏదో రాద్ధాంతానికి నాంది అని వూహించేసింది హిమ.

తనొచ్చి నాలుగురోజులు దాటిపోయాయి ఏ తల్లికైనా కూతురిరాకలో గల ఆంతర్యం తెలుసుకోవాలని వుండడం సహజం. పైగా తను ఒంటరిగా వచ్చింది. తను కార్గోలో బుక్ చేసిన సామానింకా రాకపోవడం చాలా హెల్పయింది. అయినా యింకెన్నాళ్ళు? రేపోమాపో చెప్పక తప్పదు కనీసం డాడీకైనా చెప్పేయాలి. యిప్పుడు తనేం చెప్పాలి? గోపీనాథ్ గురించి అడుగుతారు. ఏం చెప్పినా వినే సిట్యుయేషన్ చేజారిపోయినట్లే కనిపిస్తోంది. రాగానే బాబుతో చెప్పేయాలనుకుది కానీ సమయం, సందర్భం కుదరలేదు.

'అమ్మా! హిమా?' డాడీ నోరిప్పారు.

'నెక్స్ ప్రశ్న - డెఫినెట్‌గా అదే' కళ్ళెత్తి తండ్రిని చూసింది. తండ్రి ముఖంలో దైన్యం.

తల్లి వెళ్ళిపోయినా తలుపు చాటునుంచి వింటుంటుందని ఊహించింది.

'ఏమిటి నాన్నా! ఏదో అడగబోయారు?'

'అదే హిమా! ఇంత సడన్‌గా ఎందుకొచ్చావు? రెండేళ్ళబట్టి కనీసం ఫోన్లో కూడా సరిగా మాట్లాడలేదు. అమ్మ చాలా కంగారుగా వుంది. గోపీనాథ్ కూడా తన వాళ్ళతో కాంటాక్ట్‌లో లేడట'

'ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?' ఆలోచనలో పడిపోయిన హిమ 'చెపుతాను నాన్నా నాకు మరోవారం టైం కావాలి' అక్షరాల్ని కూడబలుక్కుంటూ నోరిప్పింది.

'ఏంటే యిదేమైనా భారతమా? రామాయణమా? యిప్పటికే యిరుగమ్మ పొరుగమ్మల సూటిపోటి మాటలకు తలెత్తుకోలేకపోతున్నా. అసలు యిద్దరూ వచ్చుంటే నాకీ అవస్థవచ్చుండేదా?' వస్తూనే కళ్ళువత్తుకుంది అనురాధ.

'అమ్మా! నన్ను నమ్మవా?'

'నువ్వేం చెప్పినా నమ్ముతాను. చెప్పు'

'అక్క టైం అడిగిందిగా?' సుమ.

'మధ్యలో కల్పించుకున్నావంటే చీరేస్తాను. అసలు నువ్వు బయటికిపో' కసురుకుంది అనురాధాదేవి.

'ఎందుకుపోవాలి? నేనేం చిన్నపిల్లనా?'

'అందుకే వూరుకుంటున్నా. లేకపోతే వీపు విమానం మోతయ్యేది'

'నువ్వేంటే? పిల్లలతో యిలాగేనా మాట్లాడేది?'

'నాకేమీ మీ అంత చదువులేదు - నేనిలాగే మాట్లాడతా చెప్పు టైంగీం జాన్తానై' నోరు పెద్దది చేసింది.

'దాని పెళ్ళి గొడవ చేసి చేసావు - గుర్తుందా?'

'ఔను చేశాను - తప్పా? ఆ పోరంబోకుతో అవనందుకు సంతోషించండి' గట్టిగా అరిచేసింది.

'అమ్మా! అనవసరంగా అతన్నెందుకు అంటావ్? నన్ను తిట్టు'

'అంటే ఏంటే నీ వుద్దేశం? ఎందుకు వచ్చావో చెప్పవు? అల్లుడు ఎందుకు మాట్లాడడో చెప్పవ్? మేమంతా చచ్చామనే నిర్ణయానికొచ్చేస్తే చెప్పు ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాం' ఏడ్చేసింది.

లేచి తల్లి దగ్గర కెళ్ళి భుజం మీద చెయ్యేసి 'అమ్మా - నన్ను నమ్మమ్మా? చెప్తాను అంతా చెప్తాను - కొంచెం టైం కావాలమ్మా ప్లీజ్' గద్గగదస్వరంతో అడిగింది.

'అసలే అల్లకల్లోలంగా వుంది. నా బుర్ర. మరో వారం రోజులు ఎలా భరించాలి? పోనీ వారం తర్వాత అయినా గోపీనాథ్ వస్తున్నాడా? వస్తున్నాడని చెప్పు - చెప్పమ్మా?'

మౌనంగా వుండిపోయింది హిమ

'బలవంతంగా పెళ్ళి చేసానని నన్ను ఏడిపిస్తున్నావా? ' దిగులుగా అడిగింది.

'అమ్మా - పెళ్ళి విషయంలో అప్పుడే సర్దుకుపోయాను. ప్రతి తల్లీ చేసే పనే నువ్వూ చేసావు.'

'అయితే యింకేమిటే? అమ్మనిలా ఎందుకు బాధపెడుతున్నావే?'

'అమ్మా క్షమించమ్మా! ఓ వారం తర్వాత అంతా చెప్తాను. అయినా అంతగా బాధపడేదేమీ లేదు'.

'అయితే సరే బాధపడేదేమీలేదన్నావు. ఆ ఒక్కమాటా చాలురా' కొంగుతో ముఖం తుడుచుకుంది అనురాధాదేవి.

'హమ్మయ్య' యిప్పటికి తుఫాను సద్దుమణిగిందనుకుంటూ కొంచెం రిలాక్స్‌డ్‌గా నిట్టూర్చింది హిమ. హిమకు బలవంతంగా పెళ్ళిచేసి పొరపాటు చేశామన్న ఫీలింగ్ మళ్ళీ వెంకటరత్నాన్ని వెంటాడడం మొదలుపెట్టింది. భారంగా నిట్టూర్చి బయటకెళ్ళిపోయాడు.

హిమ సుమను తీసుకుని అన్యమనస్కంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

నిస్సహాయంగా మిగిలిపోయింది అనురాధాదేవి ఆ ఖాళీ హాల్లో.

విజయవాడ - గోపాలకృష్ణగారి బంగ్లా చాలా హడావుడిగా వుంది. వరుణ్ అమెరికానుండి వచ్చేసాడు.

వరుణ్ తల్లి విజయలక్ష్మిగారి సంబరం వర్ణనాతీతంగా వుంది.

ఉద్యోగం పోయిందన్న బెంగ లేశ మాత్రం కూడా ఆమెలో లేదు.

రజని అయితే గాల్లో తేలిపోతుందనే చెప్పాలి. తన కాలేజీ ఫ్రెండ్స్‌తో సంతోషాన్ని షేర్ చేసుకుంటోంది.

తెల్లని తెలుపుతో అందంగా హుందాగా వున్న వరుణ్ హాల్లోకి వస్తూనే అమ్మాయిలందరిని విష్ చేసి, తండ్రి ప్రక్కనే సోఫాలో చేరిపోయాడు.

ట్రే నిండా స్వీట్లతో లక్ష్మి ప్రత్యక్షమైపోయింది.

'ఎవ్వరూ యివాళ డైటింగ్ చేయడంలేదు. పెట్టినంత తినాలి' విజయలక్ష్మి భర్త ప్రక్కనే సెటిలైపోతూ రజనీ అండ్‌కోకు వార్నింగ్ ఇచ్చింది.

'ఎవరెంత ఎక్కువ తింటే వాళ్ళకు అదే రేషియోలో అమెరికా చాక్లెట్లు' - ఎనౌన్స్ చేసేసింది.

'ఓకే ఆంటీ! యివ్వాళ నో డైటింగ్. ఓన్లీ ఫైటింగ్' అంటూనే స్వీట్స్ మీద దాడి ప్రారంభించారు అమ్మాయిలంతా.

'వరుణ్ నీకు హిమబిందు, సుమ - వెంకటరత్నం అంకుల్, స్వామితాత, ఐడియా వుందా? '

'వైనాట్ డాడీ! ఎప్పుడు ఫ్యాక్టరీ కెళ్ళినా వద్దన్నా వినకుండా ఎత్తుకు తిప్పేవారు స్వామితాత. హిమబిందు, సుమలు సిస్టర్స్ కదా? వాళ్ళ డాడీయే కదా అంకుల్!?'

గతంలోకి తొంగిచూస్తూ సమాధానమిచ్చాడు.

'నీ జ్ఞాపకశక్తి చాలా బాగుంది వరుణ్.'

తండ్రి మాటలకు స్పందిస్తూ - 'మనిషికి మధుర జ్ఞాపకాలనిధి బాల్యం అన్నారు ఓ కవి. మరి బోసుబాబు - విష్ణువర్ధన్ యింకా చాలామందికి వుండాలి. అందరూ అక్కడేవున్నారా? ఎక్కడికైనా 'మైగ్రేట్' అయిపోయారా?'

'బిందుకు పెళ్ళయింది - భర్త అమెరికాలోనే వుంటున్నాడు. గోపీనాథ్ అని తోట్లవల్లూరు నుంచి వచ్చేవాడు, నీకు ఐడియావుందా? పోతే బోసుబాబు యిప్పుడు లాయర్. ఈ వూళ్ళోనే ప్రాక్టీస్ - వాడి అక్క ఇందిర గుర్తుందా - పెళ్ళి చేసుకుంది. వాళ్ళాయన వుయ్యూర్లో కాలేజీ రన్ చేస్తున్నాడట.'

ఆగిపోయిన భర్త మాటల్ని కంటిన్యూ చేస్తున్నట్లు -

'ఓసారి వెళ్ళొద్దాం రా.. వరుణ్ హిమ చెల్లెలు సుమ ఎంత ముద్దుగా వుంది! అసలు దాని మాటలూ స్టయిలూ ఒద్దిక నిజంగా'.

'అమ్మా! యిక ఆపమ్మా! యింతమంది అందమైన అమ్మాయిలిని ముందు పెట్టుకుని ఎక్కడో వున్న సుమను పొగడ్తలతో ముంచెత్తుతావా? మాకెంత ఇన్సల్టో కదరా అన్నయ్యా?' మారాం చేసింది రజని.

'అమ్మ సంగతి తెలుసుగా? అనవసరంగా ఎవరినీ ఏమీ అనదు మరిప్పుడు ఆ పిలక జడల సుమను ఆకాశానికెత్తేస్తోంది - అదేంటో మనమూ చూద్దాం ఓకేనా?' అనునయించాడు వరుణ్.

'అయితే రేపు వెళ్ళొద్దామా అమ్మగారూ?' ఆత్రంగా అడిగింది లక్ష్మి.

'హోయ్! అప్పుడే పల్లెటూరికి పరుగులు తీయకు. నాకు కాలేజుంది ఆదివారం వెళ్దాంలే' రజని విసుక్కుంది.

'ప్రోగ్రాం అంతా మీరిద్దరేనా ఫిక్స్ చేసేది?'

'ముందు మీ అన్నయ్యను అడుగు' సలహా కూడా యిచ్చింది విజయలక్ష్మిగారు.

'రజనీ! మేం కూడా వస్తామే ప్లీజ్' అమ్మాయిలు గోలపెట్టేసారు.

'మనందరం వెళ్ళి రావాలంటే లారీ మాట్లాడుకోవాలి. మరి ఓకేనా!? ' అడిగింది రజని.

'పాపం రానీవే వాళ్ళు నలుగురు మనకార్లు రెండు సరిపోతాయిలే' సర్దిచెప్తుంటే

'అమ్మగారూ! మరి నేనో? అడ్డం పడిపోయింది' లక్ష్మి.

'చూద్దాంలేవే' విజయలక్ష్మి అంది.

'అమ్మగారూ! చూద్దాం అంటారేంటి? నేను కూడా పాలెం చూడాలి. రజనమ్మ వాళ్ళతో నేనూ వస్తానమ్మా అమ్మాయిగారూ మీరైనా చెప్పండి' లక్ష్మి వదల్లేదు.

'అమ్మా మీరు ప్రోగ్రాం చేయండి - నేనెలా వెళ్ళి ఫ్రెండ్స్‌ను మీటై వస్తాను. ' లేచాడు వరుణ్.

'మేమూ వెళ్ళొస్తామే రజనీ' అని ఫ్రెండ్స్ అంటుంటే, 'అందరికీ లంచ్ ఏర్పాటైపోయింది. అమ్మాయిలూ తినేసి వెళ్ళండి' ఆజ్ఞాపించింది విజయలక్ష్మి.

'అయితే వెంకటరత్నంకు చెప్పనా?' భార్యను చూస్తూ అడిగారు గోపాలకృష్ణ.

'చెప్పండి' భర్త ప్రశ్నకు సమాధానం యిచ్చింది విజయలక్ష్మి.

లక్ష్మితోబాటు అమ్మాయిలందరూ ఏనుగెక్కినంత సంతోషపడిపోయారు.

'వెంకటరత్నం.. మేం ఆదివారం మీ ఊరొస్తున్నాం'. ఈ చిన్న ఫోన్ కాల్‌తో పాలెం గ్రామం పులకరించిపోయింది. 'ఫ్యాక్టరీ ప్రారంభోత్సవమే' అన్నంత హడావుడి మొదలైపోయింది.

స్వామితాత అయితే భూమ్మీద నిలబడటమే కష్టంగా వున్నట్లు మిల్లు, ఊరు కలియ తిరిగేస్తున్నాడు.

ఫ్యాక్టరీ వాచ్ మేన్ వెంకటస్వామైతే గాల్లోనే వున్నాడని చెప్పాలి.

హిమబిందు గోపాలకృష్ణగారికి ఫోన్‌చేసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

'నాకెందుకురా థాంక్స్ - అది మనూరు - అది మన ఫ్యాక్టరీ - డాడీతో చెప్పు మేం తిన్నగా ఫ్యాక్టరీకే వస్తాం - డాడీనేమీ హల్‌చల్ చెయ్యొద్దని'

'అలాగే అంకుల్... వన్‌మినిట్. సుమ మీతో..' అంటూ సుమకు సెల్ యిచ్చింది హిమ.

'హాయ్ అంకుల్ - యు ఆర్ వెరీ గ్రేట్ - మాట ప్రకారం వస్తున్నారు - మా వూరికి పండగ తెస్తున్నారు. స్వామితాతతో బాటు కార్మికులంతా కంటిమీద కునుకులేకుండా ఆదివారం కోసం ఎదురు చూస్తుంటారు. ఒన్స్ ఎగైన్ యు ఆర్ వెరీ గ్రేట్ - నాదీ గ్యారంటీ అంకుల్' చాలా ఉత్సాహంగా మాట్లాడింది.

'ఓకేరా బై..' అంటూ ముగించారు గోపాలకృష్ణ.

బోసుబాబు తన బైక్ మీద వచ్చేశాడు.

'రారా బోసూ! గోపాలకృష్ణగారు కాల్ చేశారు' సోఫా చూపిస్తూ అన్నారు.

'ఆదివారం వస్తున్నామని అంతేగా ఊరంతా యిదే న్యూస్ అంకుల్'

బోసుబాబు వాయిస్ వింటూనే విసవిసా వచ్చేసింది అనురాధ.

'నమస్తే ఆంటీ..' లేచి నిలబడి విష్ చేశాడు.

'అమ్మెలా వుంది?'

ఆమె కంఠంలో వినిపించిన సాఫ్ట్‌నెస్‌కు వెంకటరత్నంగారు పజిలైపోయారు. బోసు పేరెత్తితేనే మండిపడిపోయే భార్యమణేనా మాట్లాడేది? అని అనుకోకుండా వుండలేకపోయారు.

'బాగున్నారు ఆంటీ?' వినయంగా సమాధానం యిచ్చాడు బోసుబాబు.

'హాయ్ లాయర్‌జీ - మొన్నే చెప్పానా? గోపాలకృష్ణంకుల్ వస్తారని? దటీజ్ సుమ' వచ్చి హాల్లో సెటిలైపోతూ అంది.

'మొన్న కేస్ వాయిదా పడినప్పుడే అన్నారంతా! యిది తప్పకుండా మిస్ సుమ యిన్‌ఫ్లూయెన్సేనని. ఓసారి ఆ సుమ ఎవరో చూసి ధన్యుడిని కావాలని మా జడ్జిగారు కూడా రిక్వెస్ట్ చేశారు - ఓసారి కోర్టుకు రాకూడదూ? ప్లీజ్ సుమా?'

'అంతొద్దు లాయర్‌జీ అర్థమైపోయింది. నీదేంలేదు -క్రెడిటంతా హిమక్కదేనంటారు. యా మై కరెక్ట్? ' సూటిగా అడిగేసింది సుమ.

'ఏది ఏమైనా మన మిల్లు ఓపెన్ అవ్వాలి - మనూరు మళ్ళీ కళకళలాడాలి మనందరి కోరిక అదేకదా?' బోసుబాబు అన్నాడు.

'ఆయనొచ్చాక కదా! అసలు విషయం తెలిసేది?' అనురాధాదేవి కల్పించుకుంది.

'మన ప్రయత్నం మనం చేద్దాం, ఆ తర్వాత కోర్టుంది' వెంకటరత్నం అన్నాడు.

'ఆ - కోర్టు విషయం తెలిసిందేగా. తీర్పు వచ్చేసరికి రాజెవరో, మంత్రెవరో?' మూతి తిప్పింది అనురాధాదేవి.

'అమ్మా! కోర్టులనంత ఈజీగా తీసెయ్యకే - బంగారు కంచాల్లో తిన్న రెడ్డి దొరలు కోర్టు పుణ్యమాని చిప్పకూడు తింటున్నారు. ప్రతిదానికీ ఓ టైముంటుంది. నాదీ గ్యారంటీ' సుమ తల్లికి చెప్పింది.

అందరి సంభాషణా గదిలోంచి వింటున్న హిమ హాల్లోకి రావాలా వద్దా? అన్న మీమాంసలో పడిపోయింది.

బోసుబాబును చూడాలన్న తహ తహ, అమ్మ కనిపెట్టేస్తుందని భయం ఆమెను కలవర పెట్టేస్తున్నాయి.

అందరికీ కాఫీలు కలుపుకొచ్చింది సీత. అందరికీ యిచ్చి - 'పెద్దమ్మాయిగారు ఎక్కడున్నారు?' సుమని అడిగింది.

బోసుబాబు గుండె లయ తప్పింది. పెళ్ళైపోయిన హిమ గురించి తన మనసెందుకిలా స్పందిస్తుందో అర్థంగాని లక్షడాలర్ల ప్రశ్నలా అనుక్షణ అలజడి లేపుతూనే ఉంది.

'అక్కాజీ! సీత అమృతం తెచ్చింది తొరగారా'

సుమ మాటలు అర్థమైపోయినట్లు 'పంచదారెక్కువైపోతే పాలు పోస్తానమ్మా' అంటూ పజిలైపోతుంటే -

'దాన్ని ఆట పట్టించకే సుమా!' అడ్డుపడిపోయింది అనురాధాదేవి.

'సుమమ్మ ఏమన్నా ముద్దుగానే వుంటాదమ్మా. భీముడ్ని రాముడంటాది, నన్నేమో హిడంబి అంటాది - ఆళ్ళంతా ఎవరమ్మా? '

సీత మాటలు వింటూనే అందరూ పకపకా నవ్వేశారు.

హిమ నెమ్మదిగా వచ్చి తన కప్పు తీసుకుని తల్లి పక్కనే అనే కన్నా బోసుబాబు ఎదురుగా కూర్చుండిపోయింది. బోసుబాబు చూపులు నేలకు ఆనించేసాడు. చిన్నగా నవ్వుకుంది హిమ - బోసుబాబు అవస్థను గమనిస్తూ. తన మనసుకూడా అదే వేవ్ లెంగ్త్‌లో ట్యూనైపోయిందన్న విషయం ఆమెకే చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

'బాబూ! బోసుబాబూ! లాయర్ బాబూజీ! కొంచెం తలెత్తండి సార్. సండే ప్రోగ్రాం గురించి మీతో డిస్కస్ చేయాలని రాత్రంతా ప్లాన్ చేశాం. మీరిలా కేస్ లాసయిన లాయర్ ఫేసు పెడితే అస్సలు బాగోలా. చెప్పండి నాన్నా! మీరైనా చెప్పండి'. ఆరిందలా అందరినీ చూస్తూ అంది.

'గోపాలకృష్ణగారు ఫోన్లో అసలేమీ ఆర్భాటాలు చెయ్యొద్దని డాడీకి చెప్పమని అక్కకు చెప్పారు. ఔనా?' బోసుబాబు సుమను అడిగాడు.

అవునన్నట్లు తలూపింది హిమ.

'ఆయన చెప్పారని మనం వూరుకుంటామా ఏమిటి? మనం చేసేదేదో మనం చేయాలిగా'? తేల్చి చెప్పింది అనురాధాదేవి.

'రజనీకి పిజాలంటే యిష్టం యింకా తన ఫ్రెండ్స్ కూడా వస్తున్నారట. వాళ్ళకేం యిష్టమో? అమ్మా.. నేనూ, హిమక్కా కంకిపాడు షాపింగ్ కెళ్లొస్తామే' గారాలుపోయింది సుమ.

ఏ మూడ్‌లో వుందో సరే అనేసింది తల్లి. యాహూ అంటూ హిమకు చిన్నగా కన్నుకొట్టి తల్లిని ముద్దుపెట్టుకుంది.

'దీని మేజిక్కులకు మోసపోయి ఐదు మించకండి' కండిషన్ పెట్టింది.

'మమ్మీ యిది తల్లుల యుగం కాదు, పిల్లల యుగం. ఐదువేలకే సీలింగా? యిది అన్యాయం, అక్రమం' నాటకీయంగా తన ఆక్రోశాన్ని కక్కేసింది.

తిన్నగా వచ్చి తండ్రి ప్రక్కనే సెటిలైపోయింది.

'రిజర్వు బ్యాంకును కబ్జా చేశావురా సుమా!' నోరిప్పాడు బోసుబాబు.

వెవ్వెవ్వే అని వెక్కరిస్తూ బయటికెళ్ళిపోయింది సుమ.

'ఈసారైనా హిమతో మాట్లాడాలి అని' బోసనుకుంటే -

'ఈసారైనా బాబుతో మాట్లాడాలి' అని నిర్ణయించుకుంది హిమ.

వీళ్ళిద్దరూ కలుస్తారేమోనన్న ఆలోచన కూడా రాని అనురాధాదేవి - ఆ విషయాన్నే మర్చిపోయింది.

'అయ్యా! స్వామి తాతగారొచ్చారు'. డ్రైవర్ బాలయ్య చెప్పడంతో బయటికొచ్చేశారు - వెంకటరత్నం, బోసుబాబులు.

**సుమనే పరిశీలనగా చూస్తున్న** విజయలక్ష్మిగారు "ఈ బంగారుబొమ్మ - నా కోడలైతేనా?" వూహల్లోకి వెళ్ళిపోయింది.

పజిలైపోయిన వరుణ్ పొలమారిపోతే గ్లాసుతో నీళ్ళు అందిస్తూ హిమ, "మిష్టర్ వరుణ్! సుమ మాటలు అస్సలు కేర్ చేయకండి. వసపిట్టలా వాగుతూ వుంటుంది ఎప్పుడూ" సర్దిచెప్పింది.

"కాదు హిమక్కా! మా అన్నయ్య అందరికీ ఎలా బావో తెలియకపోతే మాకెవ్వరికీ ఆకలుండదు. ఆత్మశాంతి అస్సలుండదు. ప్లీజ్ ప్లీజ్.. సుమసింధూ ప్లీజ్" అంటున్న రజనీని చూస్తూ.

"సారీ రజనీ! యిది కె.బి.సి ఫైనల్ క్వశ్చన్ అంటే ఐదుకోట్ల మహామనీ అన్నమాట చెపితే నాకేమిస్తావ్?" సీరియస్‌గా అడిగింది.

"ఏం కావాలో నువ్వే అడుగమ్మా" సపోర్ట్ చేసిది వరుణ్ తల్లి విజయలక్ష్మి.

"అన్నయ్యది 160 జి.బి 40,000 సాంగ్స్ ఆపిల్ ఐపోడ్ అది ఓకేనా?" రజని అడిగింది.

"ఐదు కోట్లకి - ఆపిల్ ఐపోడా?"

ఆలోచిస్తున్నట్లున్న సుమ పోజు సూటిగా గుచ్చుకుంది వరుణ్ గుండెల్లో. చుట్టూ చూశాడు. హమ్మయ్య ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు. రిలాక్స్ అయ్యాడు వరుణ్.

"దాని మేజిక్‌లో అందరూ పడిపోయారు. ఐ పిటీయూ ఆల్" అంటున్న హిమను చూస్తూ బోసుబాబు వరుణ్‌లాగే ఫీలయిపోయాడు.

"అక్కా! అడ్డం పడకే ప్లీజ్" అంటున్న సుమను చూస్తూ

"ఓకే రజనీ - ఐ కన్‌ఫర్మ్ యువర్ ప్రామిస్" నోరిప్పాడు వరుణ్.

"అయితే సరే లాయర్‌జీ తమరే సాక్ష్యం" బోసుబాబుతో చెప్పింది.

"లాయర్ సాక్ష్యం కోర్టులో చెల్లదనుకుంటా!" అనురాధాదేవి అడ్డం పడిపోయింది.

"మా అన్నయ్య మాటంటే మాటే" రజని సపోర్ట్ చేసింది.

"సరే వరుణ్‌జీ మీ ఇంటిపేరులో మొదటి అక్షరం చెప్పండి."

"బా" - బదులిచ్చాడు వరుణ్.

"మీ పేరులోని మొదటి అక్షరం చెప్పండి."

"వ" చెప్పాడు.

"రెండూ కలపండి."

"బావ"

"సో యువర్ షార్ట్‌కట్ నేమ్ ఈజ్ 'బావ' వుత్సాహంగా చెప్పింది" సుమ.

"వండర్‌ఫుల్ థాట్. కంగ్రాచ్యులేషన్స్ యు వన్ ద ఐపోడ్" సుమకన్నా వుత్సాహంగా అన్నాడు వరుణ్. అందరూ నవ్వేశారు ఆనందంగా.

"జస్ట్ ఫైవ్ మినిట్స్. లంచ్ అవగానే యిస్తాను. కారులో వుంది" సిన్సియర్‌గా చెప్పాడు వరుణ్.

"థాంక్యూ బావగారూ! బట్ హిమక్క ఆల్రెడీ యిచ్చింది" జవాబిచ్చింది సుమ.

"దటీజ్ నన్ ఆఫ్ మై బిజినెస్. బెట్ ఈజె బెట్ ప్రామిస్ ఈజె ప్రామిస్" ఎమోషనల్ అయిపోయాడు.

"అయితే ఆన్ వన్ కండిషన్"

"ఓకె ఐ ఎగ్రీ"

"నా ఐపోడ్ రజనీ తీసుకోవాలి" రజనీని చూస్తూ అంది సుమ.

రజనీ వరుణ్‌ని చూసింది. వరుణ్ "ఓకె" అన్నట్లు తలూపాడు.

"కబుర్లాపి కాస్త తినండి" కొసరి కొసరి వడ్డిస్తూ హెచ్చరించింది అనురాధ. అందరి భోజనాలూ అయిపోయాయి.

ఎంప్లాయిస్‌తో బాటు గోపాలకృష్ణగారు ఫ్యాక్టరీ చూడడానికి వెళ్ళిపోయారు.

విజయలక్ష్మి, అనురాధలు ఓ గ్రూపైపోయారు.

అమ్మాయిలతో బాటు వరుణ్, బోస్‌లే మిగిలారు.

అందరినీ ఫ్యాక్టరీని ఆనుకున్న చెరువు దగ్గరకు తీసుకొచ్చింది సుమ.

చెరువంతా కలువ పూలతో, పెద్ద పెద్ద ఆకులతో చెప్పలేనంత అందంగా వుంది. ఎన్నిసార్లు తను ఈతకొట్టుకుంటూ కలువపూలు తెచ్చి హిమకిచ్చాడో బోసు గుర్తుచేసుకుంటుంటే -

ఎన్నిసార్లు అది చూసి నిర్మలవాళ్ళు వుడుక్కున్నారో జ్ఞప్తికి తెచ్చుకుంటూ చిన్నగా నవ్వుకుంటూ బోస్‌ను ఓరగా చూసింది.

బోస్ వరుణ్‌తో మాట్లాడుతున్నా చూపులు మాత్రం తననుంచి మరలించలేకపోవడం హిమకు వింతగానూ, విచిత్రంగానూ అనిపించింది.

రెస్టారెంట్‌లో బోసు చెప్పిన మాటలు గుర్తొచ్చి గుండెల్లో ఏదో గుచ్చుకుంటున్న భావం బలంగా తాకింది.

రజనీ ఫ్రెండ్స్‌తోబాటు లక్ష్మి కూడా థ్రిల్లైపోయింది.

"నేను కూడా వరుణ్ బాబుతో వచ్చేస్తా" అనేసింది.

"అయితే విష్ణుబాబును వదిలేస్తావా?" అని సుమంటే

"ఆయనెవరమ్మా?" అమాయకంగా అడిగింది.

"ఏయ్ పిచ్చీ మీ ఆయన్నే మర్చిపోయావా?" అంది సుమ.

"ఆయనపేరు అప్పారావు కదమ్మా?" అమాయకంగా అడిగితే

"అదేంటే మొన్న విజయవాడలో విష్ణు అని చెప్పావుగా. వాడినొదిలేశావా?" మళ్ళీ అడిగింది సుమ.

"పాపం యింకొద్దక్కా అసలే పిచ్చిది" రజని అడ్డం పడిపోయింది.

అందరూ వచ్చి ఓగిరాల వెళ్ళే రోడ్డుమీద వున్న వంతెన మీద కూర్చుండిపోయారు.

అప్పుడే పొలం నుంచి వస్తున్న భీముడు తాటాకులో కట్టుకొచ్చిన తంపటేసిన వేరుశెనగకాయలు, పెసరకాయలు తూమ్మీద పెట్టాడు. అందరూ ఒక్కసారిగా దాడి చేశారు.

బోసుబాబు కోర్టులో వున్న కేసుగురించి వివరిస్తుంటే వింటూనే సుమసింధు అందాలను ఆస్వాదించేస్తూ దొరక్కుండా దొంగ చూపులు చూస్తున్నాడు వరుణ్.

"ఏయ్ రజనీ! మనమంతా కాలవలో ఈతలు కొడితే?" సజెస్ట్ చేసింది సుమ.

"నో" అనేశారంతా ఒక్కసారే. వచ్చేముందు గంటలకొద్దీ చేసుకున్న అలంకరణ గుర్తొచ్చి.

అర్థం చేసుకుంది సుమ. "అయితే బెటర్ లక్ నెక్ట్స్ టైం" కాంప్రమైజ్ అయిపోయింది.

సాయంత్రం నాలుగు గంటలకు గోపాలకృష్ణ బయలుదేరిపోయారు.

ఊరి ప్రజలందరూ ఆనందంగా వీడ్కోలు చెప్తుంటే మరో వారం రోజుల్లో మళ్ళీ వస్తానని చెప్పారు.

"సీ యూ బావా" అన్న సుమ మాటలే పదే పదే గుర్తుచేసుకుంటూ అన్యమనస్కంగానే అందరికీ వీడ్కోలు చెబుతూ "ఐ విల్ బి బ్యాక్ విత్ యిన్ ఎ వీక్" అంటూ బోసుబాబుతో చాలా గట్టిగా చెప్పాడు.

హిమకు అర్థమైపోయింది. అతని మనసేమిటో. అదే గనక జరిగితే సుమతోబాటు వూరి ప్రజలు కూడా అదృష్టవంతులే మనసులో అనుకుంటూ స్వామితాత దగ్గరకు వచ్చి "తాతయ్యా యిదంతా మీ కృషే" అభినందిస్తుంటే "నాదేముంది తల్లీ వూరు చేసుకున్న పుణ్యం లాయర్ బాబు సాయం" అంటుంటే

"అయితే మీక్కూడా అభినందనలు" చిరునవ్వుతో సత్కరించింది బోసుబాబును.

"తల్లీ యిప్పుడిక్కడ నీతోబాటు గోపీనాథ్ బాబు వుండి వుంటే ఎంతో బాగుండేది."

స్వామి తాత మాటలకు గుండె లయ తప్పింది.

అప్పటిదాకా అనుభవించిన సంతోషమంతా ఆవిరైపోయినట్లు స్థాణువైపోయింది.

ఇంటికి ఆనుకుని వున్న పొలాల్లో హిమ తాతయ్య సమాధి. అందమైన గ్రానైటు చప్టా. ఎండ పడకుండా అందంగా నిర్మించిన మండపం ఆర్చీలు దిద్దిన కట్టడంలా వుంది ఆ సమాధి.

ఆ సమాధిని ఆనుకునే నిండుగా ప్రవహించే పంట కాలువ.

ఆ సమాధి ఆవరణలోనే కూర్చుని వున్నారు హిమ, సుమలు.

హిమ పూలమాల అల్లుతుంటే సుమ ఐపోడ్‌లో పాటలు వింటూ చాలా ఆనందంగా వుంది.

ఒక్కసారిగా చుట్టూ చూసింది హిమ. అందమైన ప్రకృతి, ఆహ్లాదాన్ని పంచే వాతావరణం దూరంగా. తలలూపుకుంటూ గట్టుమీద పచ్చగడ్డి మేస్తున్న పశువులు. ఆడుకుంటూ, పాడుకుంటూ అల్లరి చేస్తున్న బుడ్డోళ్ళు.

"నా జన్మభూమి ఎంత అందమైన దేశమూ" అప్రయత్నంగా ఆ పాట గుర్తొచ్చింది హిమకు.

హఠాత్తుగా ఇయర్ ఫోన్స్ తీసేసి "అక్కా! నాతో షేర్ చేసుకుంటానని మాటిచ్చావు ఇంకెంత కాలం ఈ సస్పెన్స్? అమ్మయితే నువ్వు నోరెప్పే వారంలోపే హార్ట్ ఎటాక్ తెచ్చుకునేలా వుంది. డాడీ ఏదో మేనేజ్ చేస్తున్నారు" అడిగింది సుమ.

హిమ బరువుగా నిట్టూర్చి "యస్ యు ఆర్ కరెక్ట్ ఇవ్వాళ కాకపోతే రేపయినా తప్పదు నా బెంగంతా అమ్మ గురించీ, గోపీ అమ్మా నాన్నల గురించే"

కళ్ళు విప్పార్చుకుని అక్కని చూసింది సుమ.

హిమ కళ్ళల్లో దైన్యం. ముఖంలో విషాదం. ఒక్కసారిగా స్తబ్దయిపోయింది.

బోసుతో పెళ్ళి తప్పిపోయిననాడు కూడా యింత బేలగా లేదు తన అక్క. మరి యిదేంటి? మతి పోగొట్టుకుంది సుమ.

అంతలోనే ఏదో గుర్తొచ్చినట్లు "అక్కా! యివాళ బావ పేరెంట్స్ అదే అత్తయ్యా మామయ్యలు వస్తున్నారట కోడల్ని వీక్షించాలని" విషయం చెప్పింది సుమ.

"వస్తే రానీయ్" చూస్తారు, వెళతారు.

"అంత ఈజీగా తీసెయ్యకు మీ అత్తగారు నెక్స్ సూర్యకాంతం. ఎంత చంపుకు తింటుందో ఏమో?"

"అమ్మ అడిగితేనే అంజాన్ కొట్టా అత్తగారొక లెక్కా?" చెప్పింది హిమ.

"అదంతా నాకెందుకు గానీ ఈ సస్పెన్స్‌ని తట్టుకోలేకపోతున్నా. హార్ట్ ఎటాక్ తెప్పించకు ప్లీజక్కా!"

చుబుకం పట్టుకుని బ్రతిమిలాడుతున్న చెల్లిని దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకుంది.

"రహస్యాలంటూ నాకేమీలేవు. మీ అందరి ప్రశ్న అమెరికా వెళ్ళిన అమ్మాయి రెండేళ్ళ తర్వాత ఒంటరిగా ఎందుకొచ్చింది? ఇదేగా! "

"ఔననుకో మరి బావ ఏమయ్యారు? ఇది కూడా ప్రశ్నేకదక్కా?"

"చెప్తాను. అంతా అందరికీ చెప్తాను. దానికంటే ముందు ఫ్యాక్టరీ విషయం ముఖ్యం. దీని మీద ఎందరి జీవితాలో ఆధారపడున్నాయి. స్వామి తాతను, అమ్మమ్మను, మనూరి వాళ్ళందరినీ చూడగానే నా గుండె ద్రవించుకుపోయింది. పోల్చుకుని చూసుకుంటే నా సమస్య మనూరి సమస్య ముందు చాలా చిన్నదనిపించింది. అందుకే రాగానే గోపాలకృష్ణ అంకుల్‌ని కలిశాను. ఊరి అదృష్టం ఆయన కూడా పాజిటివ్‌గా స్పందించారు. బోసుబాబు కూడా చాలా కృషి చేస్తున్నాడు. కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే కార్మికుల ఎరియర్స్, గ్రాట్యుటీ యిస్తారు. కానీ ఫ్యాక్టరీ యిలాగే వుండిపోతుంది. ఇప్పుడు నా సమస్య బయటపడితే అందరూ షాక్ అయిపోతారు. సానుభూతి చూపిస్తారు. నాకు అది యిష్టంలేదు. తోటివారికోసం తాతయ్యలాంటి సామాన్య వ్యక్తి తన ఆస్థి మొత్తం ధారపోశాడు. నేను పుట్టిన గడ్డ. నన్ను పెంచిన వూరు దీనికోసం నేనేం చేయలేనా? చెయ్యాలి చేస్తాను. చేసి చూపిస్తాను. ఎంతో కోల్పోయానన్న బాధతో, వ్యధతో మనూళ్ళో అడుగుపెట్టాను కానీ యిప్పుడా ఫీలింగ్ లేదు. ఏదైనా చేసి చూపించాలన్న పట్టుదల అదే నా గోల్. రేపో మాపో వరుణ్ వచ్చేస్తాడు. రాగానే తనతో నా ప్లాన్ చెప్తాను. మనూరికి మంచి రోజులు వస్తే మనూరి ప్రజల ముఖాల్లో ఆనంద ఛాయలు తొంగిచూస్తే నా జీవితం ధన్యమైనట్లే"

ఆవేశంలో ఆగకుండా చెప్పుకుపోతున్న అక్కను చూస్తుంటే ఏదో తెలియని ఆనందం అనుభూతి సుమను ఆవరించేసింది.

"అక్కా! యు ఆర్ గ్రేటక్కా" అంటూనే ముద్దుల వర్షం కురిపించేసింది.

పొలం గట్టుమీద నుండి పరిగెత్తుకొస్తున్న సీతను చూస్తూనే సర్దుకున్నారిద్దరూ.

"అమ్మాయిగారండీ.. అమ్మగారు రమ్మంటున్నారు"

ఆ మాటలతోనే అర్థమైపోయింది ఇద్దరికీ అతిథులొచ్చారని.

హిమ, సుమలు ఇంట్లోకి అడుగుపెట్టే సమయానికి వియ్యంకులు వియ్యపురాళ్ళు రిలాక్స్‌డ్‌గా కూర్చుని వున్నారు.

హిమ ఇద్దరికీ నమస్కారం పెట్టి ఎదురు సోఫాలో కూర్చుండిపోయింది.

సుమ అమ్మా, నాన్నల ప్రక్కన సెటిలైపోయింది.

"ఏమ్మా నువ్వొస్తావని ఎదురు చూశాం రాలేదేం?" అడిగింది హిమ అత్తగారు.

మాటల్లో తప్ప చేతుల్లో కనిపించని సౌమ్యత ఆమెది. అందుకే అనురాధకు అంత దగ్గరైపోయింది. అట్టహాసాలు ఆడంబరాలు ఇద్దరినీ విడదీయరానంత దగ్గర చేశాయి.

అసలు వీళ్ళిద్దరి పథకం స్వార్ధాలే గోపీ - హిమల పెళ్ళికి మూలాలయ్యాయి.

బోసుబాబు హిమల ప్రేమ బయటపడినప్పుడు బందరు కాలువలో దూకేసి భర్తనే బ్లాక్ మెయిల్ చేసిన ఘనాపాటి అనూరాధైతే, ఈ వివాహం చేసుకోకపోతే విషం తాగి చస్తానని కొడుకునే కట్టిపారేసిన కరోడా హిమ అత్తగారు కమలమ్మ.

కట్నం వద్దన్న కొడుకుని కాల్చి వాతలు పెడతా ఖబడ్దార్ అంటూ గుప్పెట్లో పెట్టుకున్న కడుపు తీపున్న కన్నతల్లి కమలమ్మైతే, కులంగాని కుంకతో ప్రేమ పెళ్ళంటే నీ చెల్లిని చంపి మేమిద్దరం ఆత్మహత్య చేసుకుంటామని చెలరేగిపోయి బోసుబాబు తల్లిదండ్రుల్ని భయభ్రాంతులకు గురిచేసిన 'గుండా టైపు' హిమ తల్లి అనురాధ.

"డాడీ ఫ్రెండ్ గోపాలకృష్ణగారొస్తే" హిమ మాటలను కట్ చేస్తూ "ఆ.. ఆడో వెధవ రెడ్లకు భయపడి ఎడ్డోడ్లా పారిపోయాడు. ఆడినెందుకు రానిచ్చారు మళ్ళీ?" ఆపుకోలేని అహంకారం ధ్వనించింది కమలమ్మ మాటల్లో.

"ఆ మళ్ళీ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తానని కూతలు కూశాడు అదీ చూద్దాం" హేళనగా అంది అనురాధ.

"అది సరే నువ్వొచ్చావ్ మరి మా గాడిద ఎక్కడ? ఫోన్ చెయ్యడు, ఫోన్ తియ్యడు అంత బిజీగా చచ్చాడా?"

ఒక్కసారిగా తుళ్ళిపడింది హిమ. అత్తగారి మాటల వేడికి వాడికి అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళు సుడులు తిరిగాయి. మూడీగా మారిపోయింది.

"ఏంటి హిమబిందూ.. ఎవరో చచ్చిపోయినట్లు ఆ కన్నీళ్ళేంటి? నిన్ను కాదు ఆ వెధవను అనాలి."

"ప్లీజ్ ఆంటీ అలా తిట్టకండి. బావనంటే అక్క బాధపడదా?" సుమ అడిగింది.

"ఆ వీళ్ళ బాధే చూశావ్. మేమెంత బాధపడి చస్తున్నామో ఎవడికి అర్ధమౌతుంది? పెళ్ళి చేసుకునెళ్ళి రెండేళ్ళయింది. ఆర్నెల్లకోసారి ఫోన్ తప్ప - అది కూడా మొక్కుబడిగా ఈ మధ్య అదికూడా లేదు. మా బాధలు మేమెవరితో చెప్పుకోవాలి?" ఈసడింపుగా అంది కమలమ్మ.

"సరే అమ్మాయి వచ్చిందిగా తనే చెప్తుంది" సర్దబోయారు కమలమ్మ భర్త రంగయ్యగారు.

"కొడుకు గురించి కోడల్ని అడిగి తెలుసుకోవాల్సిన ఖర్మ పట్టింది. ఇదంతా నా ప్రారబ్ధం" నుదురు కొట్టుకుంది. కూతురు యిప్పుడైనా నోరిప్పితే అసలు విషయం తెలుస్తుందనుకుంటూ ఆత్రంగా వుంది అనురాధ.

"తను ఫోన్ చేస్తానన్నారు.. చాలా బిజీగా.."

హిమ మాటలు పూర్తవ్వకుండానే "ఏంటమ్మా బిజీ? ప్రతిరోజు మేమిక్కడ చచ్చిపోతున్నాం. ఇంకా చంపాలనా?"

"అత్తయ్యా తను ఫోన్ చేస్తారని చెప్పాగా? నాకూ యింతవరకు ఫోన్ చేయలేదు."

"నువ్వెట్టా చస్తే నాకేంటి? వాడ్ని రానీయ్ చెప్తాను. అమెరికా అని ఎగిరిపోతున్నాడు"

సీత అందరికీ కూల్ డ్రింక్స్ తేవడంతో ఆగిపోయింది కమలమ్మ.

అనురాధ కూతురి సమాధానానికి హతాసురాలైపోయింది.

హిమ మౌనంగా లేచెళ్ళి చేతిలో గిఫ్ట్ బేగ్‌లతో వచ్చి "అత్తయ్యా తను పంపించారు" అంటూ అందించబోతుంటే "ఈ బోడి గిఫ్టులు ఎవడికి కావాలి? వాడికే తీసుకెళ్ళి యిచ్చేసెయ్" తిరస్కారంగా తోసేసింది.

"అదేంటి అబ్బాయిమీద కోపం అమ్మాయి మీద చూపిస్తున్నావ్ ఇటివ్వు తల్లీ" రంగయ్యగారు అందుకున్నారు.

మూతి తిప్పుకుంది కమలమ్మ.

"గోపీ ఎప్పుడొస్తానన్నాడమ్మా? నువ్వెన్నిరోజులుంటావ్?" మామగారు అడిగిన ప్రశ్నకు

"సెలవు దొరకడం కష్టంగా వుంది మామయ్యా! ఇప్పుడు ఐటీ వుద్యోగాలు ఎలా వున్నాయో మీరూ చూస్తున్నారుగా!? సెలవు దొరకగానే వస్తానన్నారు. నేనూ తనతోబాటే వెళ్ళిపోతాను" చాలా లో వాయిస్‌తో సమాధానం చెప్పింది.

"సరే వెంకటరత్నంగారూ.. మళ్ళీ కలుస్తాం" లేచి నిలబడ్డాడు రంగయ్యగారు.

ఎంతో అయిష్టంగా లేచి నిల్చుంది కమలమ్మ.

హిమ మౌనంగా వచ్చి ఇద్దరి పాదాలకూ నమస్కరించింది.

రాత్రి పన్నెండు గంటలు దాటిపోయింది. ఆలోచనల మధ్య అశాంతిగా ఫీలవుతూ నిద్రకోసం ప్రయత్నిస్తున్న బోసుబాబు రింగ్ అవుతున్న సెల్‌ను చూస్తూనే షాకైపోయాడు. కారణం ఆ సెల్‌ఫోన్ హిమ ఇచ్చిన ఫోన్ కావడం.

గుండె లయ తప్పుతుంటే తీసుకుని చూశాడు. హిమ ఫీడ్ చేసినట్లుంది. హిమ ఇమేజ్ ప్రత్యక్షమవుతుంటే పన్నీటితో స్నానం చేసినంతగా పులకరించిపోయాడు.

హిమా ఒక్కసారిగా గుండె గొంతులోకి వచ్చేసిన అనుభూతి. కాళ్ళు భూమ్మీద నిలబడని ఫీలింగ్.

"బాబూ నేను హిమని"

ఒక్కసారిగా వేయి కోయిలల గొంతు వసంతగానంలా వినిపించినట్లు పులకరించిపోయాడు. మైండ్ బ్లాంక్ అయిపోయింది. అరచేతిలోని చెమట స్పష్టంగా తెలుస్తోంది. ఊపిరి ఆగిపోతుందేమోనన్న స్థితి. "ఎలా వున్నావు హిమా?"

"బాగున్నాను బాబూ!"

పూర్వాశ్రమంలో గంటలతరబడి స్వీట్ నథింగ్స్ మాట్లాడుకున్న యిద్దరూ మౌనానికి అప్పుడే మాటలొచ్చినట్లు ఇద్దరిలోనూ వింత అనుభూతి.

"రేపు మనం కలవాలి. చాలా విషయాలు మాట్లాడాలి."

"ఎనీ టైం అయాం ఫ్రీ"

"ఫ్యాక్టరీ మేడగది వరుణ్ కోసం రెనొవేట్ చేయిస్తున్నారు డాడీ. ఇంటీరియర్స్ నన్ను చూడమన్నారు. ఉదయం పదిగంటలకు నేనూ సుమా అక్కడ వుంటాం."

"నేనూ అక్కడ వుంటా"

"గుడ్‌నైట్" హిమ వాయిస్.

హతాసుడై గుడ్‌నైట్ చెప్పేశాడు బోసుబాబు.

"రేపు పదిగంటలకు హిమతో డిష్కషన్స్"

పదేపదే ఆ ఆలోచనే ఆవిష్కారమవుతుంటే కదులుతున్న కనురెప్పల్ని కలపాలని విశ్వప్రయత్నం చేసినా ఆ రాత్రి అతనివల్ల కాలేదు.

ఫ్యాక్టరీలో కోలాహలం మొదలైంది. స్వామితాత కొడుకు 'సూర్యం' పాలెం వచ్చేశాడు. మెకానికల్ పనులన్నీ అతనే చూసుకుంటున్నాడు.

పాత వర్కర్లంతా దాదాపు జాయినైపోయారు.

స్వామితాత కుడి భుజంలాంటి వెంకన్న. వర్కర్ల రిక్రూట్‌మెంట్‌లో తలమునకలౌతున్నాడు.

బందరు కాలువలో తిరుగుతున్న రహదారి పడవల మూలంగా ఫ్యాక్టరీ ఓపెనింగ్ వార్త విజయవాడ నుండి బందరు వరకు 'టాంటాం' అయిపోయింది.

అప్పుడే తోట్లవల్లూరు మండపంలోని అన్ని గ్రామాల రైతులు రాకపోకలు సాగించేశారు.

ఇక ముందు తమ పొలాల్లో పనిచేసే రైతు కూలీలు లభ్యంకారని చాలామంది రైతులు బెంగపెట్టేసుకున్నారు.

ఉదయం పదిగంటలకు హిమ సుమలు వచ్చేసారు.

అప్పటికే వుయ్యూరు నుండి ఇంటీరియర్ కాంట్రాక్టర్ వచ్చేశాడు.

పెయింటింగ్ వర్క్సతోబాటు ఫాల్స్ సీలింగ్ వర్క్స కూడా స్పీడప్ చేయించేశాడు.

హిమ, సుమలు ఇద్దరూ పాలమీగడలాంటి చుడిదారుల్లో రాజహంసల్లా దర్శనమిచ్చారు.

పదినిమిషాల తర్వాత లాయర్ బోసుబాబు కూడా వచ్చేశాడు.

"ప్రజలకోసం పాటుపడిన బోసుబాబుకు స్వాగతం" రాగయుక్తంగా పాట స్టార్ట్ చేసింది సుమ.

చిన్నగా నవ్వేసి హిమ ముందున్న ఖాళీ చెయిర్‌లో సెటిలైపోయాడు బాబు.

"కష్టపడి పాట పాడితే కనీసం థాంక్స్ కూడా చెప్పరా లాయర్‌గారు?" నిలదీసింది సుమ.

"నోటితో కాదు డైరీ మిల్క్ చాక్లెట్లతో చెబుదామని" అంటూనే చాక్లెట్ ప్యాక్ తీసిచ్చాడు.

"భడవకు భయం భక్తులు పెరిగిపోయాయ్" అమ్మమ్మను ఇమిటేట్ చేస్తూ ప్యాకెట్ ఓపెన్ చేసి హిమకొకటి, బోసుబాబుకొకటి యిచ్చింది.

"బాబూ! కోర్టు కేసుగురించీ, మీరు పెట్టిన క్లైమ్స్ గురించి నాకు ఇన్‌ఫర్మేషన్ కావాలి. ఇఫ్ యు డోంట్ మైండ్"

"ఏం కావాలో అడుగు ఇందులో సీక్రెట్ ఏముంది? ముందే చెబితే ఫైల్స్ కూడా తెచ్చేవాడిని" చాలా హ్యాపీగా, సిన్సియర్‌గా చెప్పాడు.

"మరైతే మనమెందుకిక్కడ? అమ్మమ్మ దగ్గరకే నిష్క్రమింతును" అంటూనే సుమ వెళ్ళిపోయింది.

"అసలు అంకుల్ బాపిరెడ్డిల మధ్య డిస్ప్యూట్ ఏమిటి? అంకుల్ అసలు కోర్టుకు ఎందుకు వెళ్ళారు? స్వామితాతకు కోర్టుకు సంబంధం ఏమిటి? చాక్లెట్ రేపర్ ఓపెన్ చేస్తూ " అడిగింది హిమ.

"ఐదేళ్ళ క్రితం వరకు గోపాలక్రిష్ణ అంకుల్ ఫ్యాక్టరీయే ఈ ఏరియాలో నెంబర్ వన్. బాయిల్డ్‌రైస్ ఫ్యాక్టరీ కాబట్టి కేరళతో వ్యాపారం ముమ్మరంగా చేసేవారు. ఇక్కడ రోడ్ ట్రాన్స్‌పోర్టుతోబాటు కెనాల్ ట్రాన్స్‌పోర్టు వుండడం అంకుల్‌కి ప్లెస్ అయింది. రైతులకు గిట్టుబాటు ధరను యిస్తూనే బోనస్‌గా ఎక్స్‌ట్రా పే చేయడంతో రైతులంతా ఈ ఫ్యాక్టరీకే ధాన్యాలను తోలేవారు. ఓగిరాల బాపిరెడ్డి

మిల్లుకూడా పెద్దదే. అయితే ధాన్యం సప్లైలేక మూతబడిపోయే స్థితికొచ్చింది. అప్పుడు చీప్‌ట్రిక్స్ ప్రయోగించి మెయిన్ వర్కర్లందరినీ ప్రలోభపెట్టి తనవైపు తిప్పుకున్నాడు. చివరకు స్వామితాత కొడుకు సూర్యాన్నికూడా.

ఆ సంవత్సరం విపరీతమైన ఆర్డర్లు వచ్చినా రైస్ సప్లై చేయలేకపోయారు అంకుల్. ఒక్కసారిగా ఆర్డర్లన్నీ కాన్సిల్ అయిపోయాయి. అదే సిట్యువేషన్‌ని తనకు లాభసాటిగా మార్చుకున్నాడు బాపిరెడ్డి.

నెక్స్ట్ యియర్ రైతులకు అడ్వాన్సులిచ్చి ధాన్యం సేకరించినా మార్కెట్ ఒడిదుడుకుల మూలంగా విపరీతంగా నష్టపోయారు. మిల్లు మూసేసి విజయవాడ వెళ్ళిపోయారు. వర్కర్లంతా వీధిన పడ్డారు. అలాగే రెండేళ్ళు గడిచాయి.

స్వామితాత విజయవాడ వెళ్ళి గోపాలకృష్ణగారిని కన్విన్స్ చేయాలని చూసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

కనీసం వర్కర్ల గ్రాట్యుటీ ఎరియర్స్ అడిగినా ఆయన మాట్లాడలేదు. ఆఖరి ప్రయత్నంగా కోర్టుతలుపులు తట్టాడు స్వామితాత" బోసుబాబు ఆగాడు.

"అయితే చాలా పెద్దకథే! స్వామితాత ఎంతకు క్లైమ్ పెట్టారు?" అడిగింది హిమ.

"ఎప్రాక్స్‌మేట్లీ రెండు కోట్లుంటుంది" ఆలోచిస్తూ చెప్పాడు బోసుబాబు.

"అమ్మా" తమరొకసారి వచ్చి చూస్తే ఫైనల్ ఫినిషింగ్ పూర్తిచేయించేస్తా రేపు కర్టెన్లుతోబాటు ఫర్నీచర్ కూడా వచ్చేస్తుంది. ఏ.సిలన్నీ ఫిట్ చేశారు.

కాంట్రాక్టర్ మాటలకు కళ్ళెత్తి చూసి నెమ్మదిగా కదిలింది హిమ.

ఆమె మనసులో అప్పటికే ఓ ప్లాను రూపు దిద్దుకుంటోంది.

బోసుబాబుతో కలిసి ఆ యింట్లో అడుగుపెడుతుంటే ఓ విచిత్రమైన ఫీలింగ్. అప్రయత్నంగా పెదాలమీద అలవోకగా తొంగిచూసింది చిరునవ్వు.

వరుణ్ రాగానే తన ప్లాను వివరించాలనే నిర్ణయానికొచ్చేసింది.

అన్ని రూములూ కలియతిరిగింది అందంగా తీర్చిదిద్దారు.

ఆ వూళ్ళో అంతటి స్థాయి మోడ్రన్ ఫెసిలిటీస్? 'వావ్' అనుకుంది.

అంతలోనే రమ్యను వెంటబెట్టుకుని సుమ వచ్చేసింది.

లోపలి యింటీరియర్ చూసి "బావకు తగ్గట్టే వుంది సినిమా సెట్టింగ్‌లా" కామెంట్ చేసింది.

"అమెరికా అబ్బాయికదా! ఈ మాత్రం వుండాలి మరి" హిమ సమర్థించింది.

"మనిషికి డబ్బుకాదక్కా దిల్లుండాలి మనూర్లోంచి అమెరికా వెళ్ళిన అబ్బాయిలు ఎందరు లేరు? ఎవర్ని చూసినా మని మనీ మోర్ మనీ అన్న యావే తప్ప మరో ధ్యాసేలేదు. అందరూ వేస్ట్ ఫెలోసే నాదీ గ్యారంటీ" స్టేట్‌మెంట్ యిచ్చేసింది సుమ.

"అమ్మా! వొణ్ణాలకొస్తారా? ఇక్కడికే తేవాలా?" అని అమ్మగారు అడిగిరమ్మన్నారు సీత చలాకీగా వచ్చేసింది.

అయితే అమ్మకు యిక్కడ బోసున్నాడన్న విషయం తెలీదనుకుంటాను అని మనసులో అనుకుంటూ "నువ్వెళ్ళి తీసుకురా అని చెప్పి" సుమను దగ్గరగా పిల్చి, "నువ్వుకూడా వెళ్ళిరా ఇది అక్కడ బోసుబాబు గురించి వాగకుండా చూసుకో" గుసగుసలాడింది హిమ.

"అక్కా" నాకు తెలుసు. మరింత గుసగుసగా చెప్పి రమ్యను వెంటబెట్టుకుని సీతతో వెళ్ళిపోయింది సుమ.

**వర్కర్లంతా లంచ్‌కి** దిగుతుంటే కాంట్రాక్టర్ ఫోటో ఆల్బం తెచ్చి హిమకిచ్చి "రేపు వచ్చే కర్టెన్లు, ఫర్నీచర్ ఫోటోలు. మీరు చూసి ఓకే చేస్తే?" అన్నాడు.

"అవసరం లేదు. ఆల్రెడి డాడీ, లాయరుగారు చూసి సెలెక్ట్ చేసినవేగా! రేపు మొత్తం ఫినిషైపోతే వరుణ్‌తో చెప్పెయ్యొచ్చు" బోసుబాబును చూస్తూ అంది.

"ప్రతి రోజూ డెవలప్‌మెంట్లన్నీ ఫోటోలు తీసి నెట్‌లో పంపిస్తూనే వున్నాను. చూస్తూ చాలా హ్యాపీగా వున్నారంతా" బోసుబాబు తన సెల్‌లోని ఫోటోలు చూపిస్తూ అన్నాడు.

"అయితే ప్రాబ్లమే లేదు అంకుల్నికూడా రమ్మనొచ్చు."

"అంకుల్ వస్తారో రారో నాకు డౌటే. ఎందుకంటే మార్కెటింగ్‌తో బాటు యిన్విటేషన్ వర్క్ మొత్తానికీ ఆయనొక్కరే."

"ఎందుకూ నీ ఫ్రెండ్స్ చాలామంది వున్నారుగా?"

"వాళ్ళు కూడా హెల్ప్ చేస్తున్నారు. అయినా యిది షార్ట్ టైం నోటీస్ కదా?"

"యస్. ఇంత తక్కువటైంలో ఐ కాంట్ బిలీవిట్" డ్రీమీగా జవాబిచ్చింది హిమ.

అంతలోనే డ్రైవర్ బాలయ్య, సీతలు క్యారియర్స్‌తో వచ్చేసారు.

"కాబోయే 'మిస్ యూనివర్స్' అన్న కనికరం కూడా లేకుండా యిలా నాతో పనులు చేయిస్తారా? మీ అందరికీ నరకమే. నాదీ గ్యారంటీ" అంది సుమ ఐస్‌క్రీం బాక్స్ కిందపెడుతూ.

"చాలా పెద్ద ప్లానే. తమరుకూడా ఇండియాను మిస్సయ్యే దిశగా పావులు కదుపుతున్నావన్నమాట?" బోసుబాబు టీజ్ చేసాడు.

"అయ్యో లాయర్‌జీ తమరా పాయింట్‌కు రాకండి. నా దేశాన్ని మిస్సవ్వడమా? నోవే ఏదో సరదాకన్నాను" కన్‌ఫమ్‌డ్‌గా చెప్పింది సుమ.

సీత, బాలయ్యలు వడ్డించేసారు. అందరూ భోజనాలకు లేస్తుండగా బోసుబాబు సెల్ మోగింది. తీసి చూస్తునే "వరుణ్" అన్నాడు. అయిదు నిమిషాలు మాట్లాడి తను సండే వస్తున్నాడు. అందరినీ చూస్తూ చెప్పాడు. అందరి ముఖాల్లోనూ ఆనందం తొంగిచూసింది.

ఆ రాత్రి హిమ తన ల్యాప్‌టాప్‌తో కుస్తీ పట్టేసింది.

తన బ్యాంక్ ఎకౌంట్లలో బ్యాలెన్స్‌లు టేలీ చేసుకుని బరువుగా నిట్టూర్చింది. మరో యాభైలక్షలు స్వగతంగా అనుకుంది.

బోసుబాబుతో మాట్లాడాలనే కోరికను బలవంతంగా నిగ్రహించుకుంది.

అమ్మ వింటుందేమో? సుమ లేస్తుందేమో? అన్న భయంతో అర్ధరాత్రివరకు గుసగుసలాడుకున్న గతం తాలూకు జ్ఞాపకాలు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో వుక్కిరిబిక్కిరైంది.

"ఏ జీవితానికీ ఎవరు నిర్వచనం చెప్పలేరు" అని ఓ కవి కోట్ చేసిన కోటేషన్ను మననం చేస్తుకుంటూ మౌనంగా వుండిపోయింది.

అర్ధాంతరంగా ముగిసిపోయిన ప్రేమ పర్వం.

బలవంతంగా బలిపీఠం ఎక్కించిన పెళ్ళి తంతు.

ఎయిర్ క్రాష్‌లా ఎండైపోయిన అమెరికా హర్మ్యాలు.

కనులముందు కరాళనృత్యం చేస్తుంటే నిస్సహాయురాలిగా మౌనంగా రోదించింది.

తేరుకుని కన్నీరు తుడుచుకుంటూ అమాయకంగా ప్రశాంతంగా నిద్రపోతున్న అనురాగవల్లి చెల్లిని అపురూపంగా చూసుకుంటూ, ఏ ఆడపిల్లకూ జీవితం పీడకల కాకూడదని కోరుకుంది.

తన సెల్‌లో టైం చూసింది. అర్ధరాత్రి దాటిపోయింది.

తట్టుకోలేని తన బాధను బోసుబాబుతో పంచుకోవాలన్న గాఢమైన కోరికను అతి ప్రయత్నం మీద ఆపుకోగలిగింది.

కనీసం అతని జీవితమైనా ఆనందంగా సాగిపోవాలి.

తన వ్యక్తిగత సమస్యల మూలంగా తను సమస్యల సుడిగుండంలో చిక్కుకోకూడదు.

ఓసారి ప్రేమ విఫలమై యిద్దరం విషాదాన్ని విషంలా చవిచూశాం. తను తనువు చాలించి వుంటే కనీసం అతనికైనా ఓ పరిష్కారం దొరికివుండేది. "పిరికితనం - అమ్మ దౌర్జన్యం" అధిగమించలేని అవరోధాలయ్యాయి. తన జీవితం తనకు ఎందుకూ పనికిరానిదయ్యింది. కనీసం తన వూరికైనా ఉపయోగపడితే?

ఆలోచనల మధ్య కోడికూత వేళకు కళ్ళుమూతపడ్డాయి హిమబిందుకు.

ప్రయాణ హడావిడిలో వున్నాడు వరుణ్.

అప్పటికే అనేకసార్లు అన్ని విషయాలూ డిస్కస్ చేశారు గోపాలకృష్ణ.

"వరుణ్ నేను ఫ్యాక్టరీ ఓపెనింగ్ ముందే వచ్చేస్తాను కేరళ ఏజెంట్లు వస్తున్నారు. అగ్రిమెంట్ విషయం తేలిపోగానే ట్రాన్స్‌పోర్టు అగ్రిమెంట్స్ కూడా అయిపోతే సగం వర్క్ అయిపోయినట్లే. కోర్టు విషయాలు లాయర్‌తోబాటు బోసుబాబు కూడా చూసుకుంటున్నాడు ముందు మెకానికల్ ట్రయిల్స్ చూసుకో. మిగతా పనులన్నీ స్వామితాత వెంకటరత్నంలు చూసుకుంటారు."

"ఓకె డాడీ ఫోన్‌లో టచ్‌లో వుంటాను. నాతోబాటు లక్ష్మి, అప్పారావులు కూడా వస్తున్నారు. మమ్మీ తర్వాత వస్తానంది."

"ఓకె వరుణ్ అన్నట్లు నిన్ను బావను చేసిన సుమ 'మహా చిలిపి' బి కేర్ ఫుల్."

నవ్వుతూ అంటించిన డాడీ అబ్జర్వేషన్‌కి ఆశ్చర్యపోయాడు.

"వాడేమీ చిన్నపిల్లాడు కాదులెండి. మెకానికల్ ఇంజినీర్ పైగా అమెరికా రిటర్న్" అప్పుడే వచ్చిన విజయలక్ష్మి సపోర్టిచ్చింది.

అరగంటలో అందరికీ సెండాఫ్ ఇచ్చి బయలుదేరిపోయాడు వరుణ్.

ఆ గంట జర్నీ అంతా అతని ఆలోచన్లను సుమ ఆక్రమించేసింది.

అందంతోపాటు చలాకీతనం ఆ అమ్మాయికున్న ప్రత్యేకతనుకున్నాడు.

హిమ అందం ప్రశాంతంగా ప్రవహించే నదీ ప్రవాహమైతే, సుమ మాత్రం గలగల పారే సెలయేరును తలపించే ఝరీ ప్రవాహం అనుకున్నాడు. ఆ ఝరి తన జీవన సహచరి అయితే?

తన ఆలోచనలు అబ్బురపడిపోతూ చిన్నగా నవ్వుకున్నాడు.

"వరుణ్ బాబూ బొడ్డపాడు దాటేశాం. మరో అరగంటలో చేరిపోతాం"

డ్రైవర్ రాంబాబు మాటలు వింటూ ఒక్కసారి వులిక్కిపడి పరిసరాల మీద చూపు మరలించాడు.

దారికి కుడిప్రక్క నిండుగా బందరు కాలువ ఎడమ ప్రక్క పంట కాలువ దానికి ఆనుకుని పచ్చని పొలాలు ఎంత అందంగా వుందో ముచ్చట పడిపోతుంటే.

రోడ్డు ప్రక్కనే ఆనందంతో చేతులూపుతున్న గొడ్లుకాసే బుడ్డోళ్ళను చూసి గ్లాస్ డోర్స్ దించేసి తను కూడా వాళ్ళలాగే చేతులూపుతూ తన ఆనందాన్ని ప్రకటించాడు.

చెరువు దాటగానే, ఫ్యాక్టరీ చిమ్నీ హుందాగా దర్శనమిచ్చింది.

"వరుణ్ బాబూ వచ్చేశాం" ఆనందం వ్యక్తం చేశాడు రాంబాబు.

తురాయి చెట్టుక్రింద కోలాహలం.

అందరూ తనను చూస్తూనే తబ్బిబ్బవుతుంటే తట్టుకోలేని ఆనందంతో తలమునకలైపోయాడు.

స్వామితాత, వెంకటరత్నం, బోసుబాబులతోపాటు యింకా పరిచయం కాని ఎంప్లాయిస్‌ని చూస్తూ కాలు క్రిందపెట్టబోతుంటే

"ఆగండాగండి" అంటూ హారతి పళ్ళెంతో సీత వచ్చేసింది.

రమ్య ఓ ఫ్లవర్ బొకే అందించి "వెల్‌కం టు పాలెం" అంది.

"ఓ - థాంక్యూ" అంటూ రమ్యను దగ్గరకు తీసుకున్నాడు.

మేడమీదనుండి చూస్తున్న "హిమ, సుమలు" చేతులూపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వరుణ్ ఫ్యాక్టరీలోకి అడుగుపెడుతుంటే అందరూ చప్పట్లు కొట్టారు. అవధులు లేని ఆనందం వరుణ్‌ని వుక్కిరిబిక్కిరి చేస్తుంటే మిల్లంతా కలియతిరిగాడు.

మెకానికల్ ఇన్‌ఛార్జి స్వామితాత కొడుకు సూర్యం జరిగిన డెవలప్ మెంట్స్‌ను వివరించాడు.

బాయిలర్ ఇన్‌ఛార్జి లక్ష్మణరావు వచ్చి "సార్ బాయిలర్ లైసెన్స్ కూడా వచ్చేసింది మేమంతా రెడీ. ఆల్‌రెడీ స్టీమ్ టెస్టింగ్ కూడా అయిపోయింది. అంతా పర్‌ఫెక్ట్‌గా వుంది" ఆనందంగా వివరించాడు.

కొంతమంది గన్నీబ్యాగ్స్ మీద ఫ్యాక్టరీ నేమ్ ప్రింట్ చేస్తున్నారు. మరికొంతమంది ప్రొక్యూర్ చేసిన ధాన్యాన్ని గోడౌన్లలోకి తరలిస్తున్నారు.

చుట్టూ చూసిన వరుణ్ అందంగా ముస్తాబు చేసిన అపురూప కట్టడంలా కొత్తకొత్త రంగులతో కళకళలాడిపోతున్న ఫ్యాక్టరీ కన్నుల పండుగలా దర్శనం యివ్వడంతో అందరినీ అభినందనలతో ముంచెత్తాడు.

రిబ్బన్ కట్ చేసి ఆఫీస్ రూం ఇనాగరేట్ చేశాడు.

వెంకటరత్నంగారు వరుణ్‌ని ఆప్యాయంగా తీసుకెళ్ళి పెద్ద టేబులు ముందున్న ఎగ్జిక్యూటివ్ చైర్లో కూర్చోబెట్టారు.

బోసుబాబు బెస్టాఫ్ లక్ చెప్పి అందమైన పెన్‌సెట్‌ను గిఫ్ట్‌గా అందించాడు.

స్వామితాత వచ్చి ఆనందంగా ఆలింగనం చేసుకున్నాడు. ఆశీస్సులు చెప్పాడు.

వర్కర్లొచ్చి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

"వరుణ్ ఒక్కసారి మేడమీదకెళ్ళివద్దాం. కాంట్రాక్టర్ మీ కామెంట్స్ కోసం ఎదురుచూస్తున్నాడు" బోస్ చెప్పాడు.

ఇద్దరూ మేడమీదకే బయలుదేరారు.

మేడపైనున్న సుమను చూస్తునే వూహల్లోకి వెళ్ళిపోబోతూ 'దిసీజ్ నాట్ ద ప్రోపర్ టైం' అని మనసుకు సర్దిచెప్పాడు.

మేడమెట్లు ఎక్కగానే సుమ స్పీడుగా వచ్చేసి నాటకఫక్కీలో నమస్కారం పెట్టి "బావగారికి అభినందనములు - అభినందనలు" ఓ అందమైన గులాబి యిస్తూ చెప్పింది.

"హాయ్ వరుణ్" షేక్ హ్యాండిచ్చింది హిమ.

అందరూ లోపలికెళ్ళారు. లోపలికి ఎంటరవుతూనే త్రిల్లయిపోయాడు. "వండర్‌ఫుల్" కామెంటిచ్చాడు. కిటికీలోంచి కనిపిస్తున్న కాలువ - కాలువగట్టున ఆకుపచ్చని అందాలతో గాలికి తలలూపుతున్న చెట్లు ఓ పికాసో పెయింటింగ్ అనిపిస్తే - ప్రతిరోజూ, ప్రతిక్షణం ఈ అందాల దృశ్యాలు నా స్వంతం. అనుకుంటూ హాయిగా నిట్టూర్చాడు.

కాంట్రాక్టర్‌ను పిలిచి అభినందించాడు.

అప్పటికే కిచెన్‌లో దూరిపోయి కాఫీకప్పుతో వచ్చేసిన సుమ చూస్తూనే "ఏయ్ పిల్లా ఈ సారి విష్ణుబావతో వచ్చావా? అప్పారావుతోనా?" బనాయించింది.

"రెండూకాదు నేనూ అప్పారావు వరుణ్ బాబుతో వచ్చాం" సమాధానం యిచ్చింది లక్ష్మి.

మరీ అంత ముప్పేం కాదు అనుకుంది సుమ నవ్వుకుంటూ 'నవ్వులా అవికావు నవపారిజాతాలు' ఒక్కసారిగా ఫ్లాషైన ఏకవీర పాటను పెదాల నుంచి ప్రవహించకుండా అడ్డుకట్ట వేయడానికి ఆపసోపాలు పడ్డాడు.

ఇద్దరినీ క్యూరియాసిటీతో గమనిస్తున్న హిమ చిన్నగా నవ్వుకుంటూ తననే చూస్తున్న బోసుబాబును చూసి తడబడిపోయింది.

గుండె బరువెక్కిన ఫీలింగ్ రాత్రి తను పొందిన ఆవేదన గుర్తొచ్చింది. అన్యమనస్కంగా ఆలోచనలో కూరుకుపోయింది.

"బావగారూ మీకు యివ్వాళ లంచ్, డిన్నర్‌లు మా యింటివంటలే. మీరు తట్టుకోగలరు నాదీ గ్యారంటీ." సుమ అల్లరి మొదలుపెట్టింది.

"తమరి హస్తం పడకపోతే చాలు తల్లీ తట్టుకోవచ్చు" బోసుబాబు రిటార్టిచ్చాడు.

"హస్తంలేకపోతే హస్తినే లేదు. సింధువు లేకపోతే బిందువే లేదు" అని సుమ గర్వంగా చెపుతుంటే.

"ఎంతైనా వెనకొచ్చిన కొమ్ములు కదా?" సుమ తరచుగా వాడేవాక్యాన్నే గుర్తుచేసాడు బోసుబాబు.

మూతి తిప్పుకున్న సుమను దగ్గరకు తీసుకుని "నన్నేమన్నా ఓకే మా బంగారాన్ని మాత్రం" అంటున్న హిమతో

"ఐ ఎగ్రీ - టెన్ గ్రామ్స్ దర్టీ థౌజండ్ మరి మీ బంగారం నలభై ఐదు కేజీలు" యామై కరెక్ట్? చిలిపిగా సుమను చూస్తూ అన్నాడు.

వాళ్ళ సంభాషణను హృదయపూర్వకంగా ఎంజాయ్ చేస్తున్న వరుణ్ సెల్‌లో వస్తున్న ట్యూన్ వింటూనే "అమ్మ" అనుకుంటూ ఫోనెత్తాడు.

మధ్యాహ్నం లంచ్ ఏర్పాట్లను చూడటానికి అమ్మ వస్తుందని హిమ చెప్పగానే అందరికి కుంటిసాకు చెప్పి జంపైపోయాడు బోసుబాబు.

సుమ పగలబడి నవ్వుతుంటే అసలెందుకు నవ్వుతుందో అర్థంగాక అయోమయంగా చూశాడు వరుణ్.

లంచైపోయాక అందరూ హాల్లో సెటిలైపోయారు.

ఆ ఇంటీరియర్ రిచ్‌నెస్ చూస్తూ ఆశ్చర్యంతో నోరు తెరిచేసింది అనురాధ.

"అంతాకలిపి ఐదు లక్షలపైనే అయిపోయింది" వెంకటరత్నంగారు చెప్పారు.

"బాగా బలిసిపోయిన యవ్వారం" మనసులో అనుకోకుండా వుండలేకపోయింది.

"ఆంటీ ఇందాక మమ్మీ ఫోన్ చేసింది. మిమ్మల్ని అడిగింది మాట్లాడతారా?" నెంబర్ డయల్ చేసి తన సెల్ యిచ్చాడు వరుణ్.

సెల్ తీసుకుని బయటికెళ్ళిపోయింది.

"ఓ గంట తింటుంది నాదీ గ్యారంటీ" మమ్మీ చేస్తే అయిదు నిమిషాలు, మమ్మీకి చేస్తే అరగంట పైన మాట్లాడే తన తల్లి నైజం తెలిసిన సుమ కామెంట్ చేసింది.

"అంకుల్ ఏర్పాట్లన్నీ చాలా బాగున్నాయి. మనం రెడీ అంటే డాడీ కూడా రెడీనే. పెండింగ్ వర్క్స్ ఏమున్నాయో సార్టవుట్ చేస్తే?" వెంకటరత్నంగారిని చూస్తూ అన్నాడు.

"బోసుబాబూ, అతని ఫ్రెండ్స్ అంతా చాలా హెల్ప్ చేశారు. నాకు తెలిసీ పెండింగ్ అంటూ ఏమీలేదు. ఫ్యాక్టరీ ట్రయల్ రన్ కూడా చాలా బాగా జరిగింది. రేపు నువ్వు చూడొచ్చు."

"దెన్ ఓకే అంకుల్. డాడీతో ఆల్రెడీ చెప్పేసాను. ఓపెనింగ్ తనిష్టం. డాడీ అగ్రికల్చర్ మినిష్టర్ని ఇన్వైట్ చేస్తానంటున్నారు"

"ఔను అతనూ మన జిల్లావాడే ఇద్దరికీ మంచి పరిచయం కూడా వుంది."

"ఔనూ! ఈ లాయర్ గారేంటి ఒక్కసారిగా అదృశ్యమైపోయారు?" హిమను అడిగాడు.

"హిమ ఏం చెప్పాలా అని అని తటపటాయిస్తుంటే "తపోబా గారా! ఆయన క్లోజెస్ట్ ఫ్రెండ్ ఎవరో వస్తున్నారంట రిసీవ్ చేసుకోవాలని చెక్కేసారు."

అందంగా అబద్దం ఆడేస్తున్న సుమను చూస్తూ హమ్మయ్య అనుకుంది హిమ.

"ఓ ఐసీ" అంటూ నమ్మేస్తున్న వరుణ్ని చూస్తూ హిమ చెవిలో 'ముద్దపప్పు బావా! మెదడు పాలకోవా' అంటూ పాట పాడేసింది.

నవ్వలేక, నవ్వు ఆపుకోలేక పొలమారుతున్న హిమను చూస్తూ "అక్కా నిన్నెవరో, ఎవరో ఏంటి బావగారే తలచుకుంటున్నారు. ఒన్ మినిట్.. వాటర్ తెస్తా" అంటూ తుర్రుమంది.

సుమ మూమెంట్స్నే గమనిస్తున్న వరుణ్ "యూ వార్ మై స్వీట్ హార్ట్, అండ్ ఆల్సో మై హార్ట్ బీట్" అనుకున్నాడు.

అంతలో అనురాధవచ్చి సెల్ అందిస్తూ "మీ మమ్మి, రజనీ రేపు వస్తామన్నారు. అయితే రేపు కూడా నే వంట చేసి పంపిస్తాను. వస్తాబాబూ! పిల్లలూ మీరొస్తున్నారా?" సుమని, హిమని వుద్దేశించి అడిగింది.

హిమ మొహమాటంగా చూస్తుంటే "బావగారికి బోరుకొట్టకుండా కంపెనీ ఇచ్చి సాయంత్రం వస్తాంలే అమ్మ." చేతిలో గ్లాసు హిమకు అందిస్తూ అదే తన ఫైనల్ డెసిషన్ అన్నట్లు చెప్పింది.

చుట్టుపక్కల బోస్ కనబడకపోవడంతోబాటు విజయలక్ష్మిగారు ఆప్యాయంగా మాట్లాడ్డంతో ప్రసన్నంగా మారిన ఆమె "సరే" అనేసి వెళ్ళిపోయింది.

ఆమె అటు, బోసుబాబు ఇటు అన్న లెవల్లో లాయర్ ఎంటర్ అయిపోయాడు.

సుమ అతన్ని చూస్తూనే పక్కుమని నవ్వేస్తే హిమ ముసిముసిగా నవ్వుకుంది.

ఇద్దరి నవ్వులు అర్థంకాని వరుణ్ బుర్రగోకేసుకున్నాడు.

హిమ వరుణ్ బోసుబాబులు ముగ్గురూ ఆఫీసులో కూర్చున్నారు. హిమ వరుణ్నే సూటిగా చూస్తూ "వరుణ్బాబూ ఎంప్లాయీస్ అరియర్స్ గ్రాట్యుటీ గురించి ఏం ప్లాన్చేశారు?" అడిగింది.

"యా! డాడీతో డిస్కస్ చేశాను. ఈ నెలలో ఎరియర్స్ ఇద్దామన్నారు డాడీ. గ్రాట్యుటీ గురించి కూడా మాట్లాడతాను." వరుణ్ సిన్సియర్గా చెప్పాడు.

"ఈ విషయంలో నేనేమైనా ఇన్వాల్వ్ కావచ్చా?" మళ్ళీ డాడీ 'అఫెండ్' కాకూడదు.

"హిమాజీ ఫ్యాక్టరీ విషయాలు డాడీకి, నాకూ వదిలెయ్యండి. ఏదైనా చేయాలనిపిస్తే మరోలా చేయండి"

"ఔను హిమా! మనూళ్ళో మంచి వైద్య సదుపాయాల్లేవు. ఇదే విషయంలో స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న మనూరి వాళ్ళందరినీ అప్రోచ్ అయ్యాను. నువ్వు స్టార్ట్ చెయ్యి మేం హెల్ప్ చేస్తామన్నారు. నేను లైన్స్ క్లబ్ మెంబర్ని. లైన్స్ క్లబ్ కూడా తప్పక హెల్ప్ చేస్తుంది" హిమను ఆరాధనాపూర్వకంగా చూస్తూ అన్నాడు.

"యా! గుడ్ ప్రపోజల్" మెచ్చుకున్నాడు వరుణ్.

"బాబూ ఎస్టిమేట్ చేయించగలవా? నా పేరున వున్న ఐదు ఎకరాల పొలంలో కట్టిద్దాం"

"చాలా మంచి ప్రపోజల్ హిమా! అయితే మమ్మీ డాడీ?" ఆగిపోయాడు బోసు.

"నో ప్రాబ్లం ఆ విషయం నాకొదిలెయ్" ధృఢంగా చెప్పింది హిమ.

"రేపే స్టార్ట్ చేస్తాను హిమా! నా ఫ్రెండ్ మంచి ఆర్కిటెక్ట్ వాడిని పిలిపిస్తాను" రెడీ అయిపోయాడు బోసు.

"అయితే మీరు అమెరికా వెళ్ళరా?" వరుణ్ అడిగాడు.

అనుకోని ప్రశ్నకు తడబాటు పడిపోయింది. వెంటనే సర్దుకుంటూ "నేనున్నా లేకపోయినా మీరంతా వున్నారుగా?" అనేసింది.

నో అంటుందేమో కనీసం కళ్ళముందు కనిపిస్తుందని ఆశపడ్డ బోసుబాబు నిరాశగా నిట్టూర్చాడు.

"యస్ నేనైతే యిక్కడే వుండిపోవాలని అనుకుంటున్నాను మీరు హెల్ప్‌చేస్తే" అంటూ మధ్యలో ఆపేశాడు వరుణ్.

హిమ చిన్నగా నవ్వేస్తూ "నేనా! మీకా! హెల్పా?" అనేసింది ఒక్కసారిగా.

ఏం చెప్పాలో అర్థంకాక చిన్నగా బుర్ర గోకేసుకున్నాడు.

"ఫ్యాక్టరీ బాధ్యతలు మీవేగా వుండకపోతే ఎలా?" బోసు కామెంట్ చేశాడు.

లాయర్ గారి బుర్రకు అసలు విషయం తట్టలేదని అర్థం చేసుకుంది హిమ. తన హెల్పేంటో అర్థం చేసుకున్న హిమ ఇది జరిగిపోతే 'సుమ' చాలా అదృష్టవంతురాలు అనుకుంది.

"ఓకె వరుణ్‌బాబూ ట్రై చేస్తాను ఆ హెల్పేంటో చెప్పండి" సీరియస్‌గా అడిగింది.

"నాట్ నౌ" తడబడుతూ అన్నాడు.

"మరి 'ఆలస్యం అమృతం విషం' అన్నారు పెద్దలు మీ యిష్టం."

"మరీ అంత ఆలస్యం చేయను నాదీ గ్యారంటీ" అంటూనే నాలుక్కరుచుకున్నాడు.

ఆ మాటతో ఏదో లైట్ వెలిగినట్లు హిమను చూశాడు బోసుబాబు.

"ఔను" అన్నట్లు తలూపింది హిమ.

"కంగ్రాచ్యులేషన్స్ వరుణ్‌బాబూ!"

బోసుబాబు షేక్‌హ్యాండిస్తుంటే అయ్యో తన సీక్రెట్ యిప్పుడు యిద్దరికీ తెలిసిపోయిందని సిగ్గుపడి పోయాడు వరుణ్.

భోజనాలు పూర్తయిపోయాయి.

సుమ గదిలోకి వెళ్ళిపోయి నిద్రాదేవిని ఆహ్వానించే కార్యక్రమంలో మునిగిపోయింది.

తన గదిలోకి వెళ్ళబోతున్న హిమను ఆపి తనతోబాటు ముందు వరండాలోకి తీసుకెళ్ళింది అనురాధాదేవి.

"హిమా! వారం అన్నావ్? వచ్చి ఎన్నిరోజులయ్యిందో గుర్తుందా? అమ్మా నాన్నంటే కోన్‌కిస్కాగాళ్ళు అనుకుంటున్నావా? తెలియాలి? నాకు యిప్పుడే తెలియాలి?" బలవంతంగా అరుగుమీద కూర్చోబెడుతూ అడిగింది.

హిమ మాట్లాడకుండా తల్లినే చూస్తూ వుండిపోయింది.

"అమ్మా హిమా! మంచైనా చెడైనా మాతో చెబితే మాకు చేతనైంది మేం చేస్తాం. నువ్వలా మౌనంగా వుండిపోతే సమస్య మాకెలా అర్థం అవుతుంది చెప్పు?" అనునయంగా అడిగింది.

కళ్ళు దించుకుంది హిమ.

"తల్లీ నీకు బలవంతపు పెళ్ళిచేసి అన్యాయమే చేశాం. జరిగిపోయినదానికి నేను బాధపడుతూనే వున్నాను. అయినా మీ అమ్మ అంత పట్టుబట్టింది నువ్వు సుఖంగా వుండాలనే కదా?" అప్పుడే వచ్చిన వెంకటరత్నంగారు హిమ తలమీద చెయ్యి ఆనిస్తూ అన్నారు.

"ఆ బలవంతపు పెళ్ళి చేసుండకపోయుంటే తెల్లచొక్కాలు, నల్ల కోట్లు వుతుక్కుంటూ వుండేది."

మామూలు ధోరణికొచ్చేసింది హిమ తల్లి.

"నువ్వు నోరు మూస్తావా? అయిపోయిన పెళ్ళికి బాజాలెందుకు? అసలు సమస్య వదిలిపెట్టి ఈ సతాయింపులేమిటి? ముందు తనని చెప్పనీ" కసురుకున్నాడు హిమ తండ్రి.

నెమ్మదిగా తలెత్తి యిద్దరినీ చూస్తూ "నా మీద నమ్మకం వుంటే నన్ను యిప్పుడేమీ అడగొద్దు. ఫ్యాక్టరీ ఓపెన్ అయ్యేంత వరకు నాకో అవకాశం యివ్వండి ప్లీజ్" రిక్వెస్టింగ్‌గా అంది.

ఎలాంటి హిమ యిలా బేలగా? బాధతో కళ్ళు మూసుకున్నారు వెంకటరత్నంగారు.

"బోడి ఫ్యాక్టరీ అది తెరిస్తే ఎంత తెరవకపోతే ఎంత? ఏం జరిగిందో నువ్వెందుకొచ్చావో యిప్పుడే కక్కేయాలి" వాయిస్ రైజ్ చేసింది అనురాధ.

వెంకటరత్నంగారు కోపంతో వూగిపోయారు. "అందరూ నిద్రపోతున్నారు. అనవసరంగా అల్లరి చేయకు. అమ్మా హిమా అమ్మ మాటలు పట్టించుకోకు నువ్వెళ్ళి పడుకో" చేయిపట్టుకుని లేపి లోపలికి పంపించేశారు.

కోపంతో వూగిపోయింది అనురాధ. భర్తవంక క్రోధంగా చూస్తూ స్పీడ్‌గా లోపలికి వెళ్ళిపోయింది.

దిక్కుతోచనట్లు నిస్సహాయంగా నిలబడిపోయారు వెంకటరత్నంగారు.

గుండెనిండా సుడిగుండాలు తిరుగుతున్న ఫీలింగ్‌తో అరుగుమీదే కూలబడిపోయారు.

నిద్రకు దూరమైన హిమ పరిస్థితిని తలుచుకుంటూ తల్లడిల్లిపోయింది.

ఎవరికి చెప్పుకోవాలి? ఎలా చెప్పుకోవాలి? నిప్పులాంటి నిజం గుండెల్లో పెట్టుకుంటే దహించివేసే నిజం.

తన బాధలు షేర్ చేసుకునేవారు ఎవరున్నారు తనకు. అమ్మ వినదు, నాన్న వింటారు కానీ విని తట్టుకోలేరు. సుమ వయసు, మనసు రెండూ సున్నితమే. మిగిలింది బోసుబాబు మాత్రమే. తనమీద అతనికున్న అభిమానం, ప్రేమ అమరం అని తెలిసినా అటువంటి ప్రేమ మూర్తికి అసలు విషయం చెప్పి అతని హృదయాన్ని అల్లకల్లోలం చేసే హక్కు తనకెక్కడిది? జీవితం యింత భయంకరంగా వుంటుందా? బ్రతుకు బాటలో యిన్ని కాలసర్పాలా? ఏం చేయాలి?

అగ్నిగుండాల్లా మారిన కళ్ళల్లోంచి ఆవిరైపోకుండా అప్రయత్నంగా కారిపోతున్న కన్నీళ్ళను కట్టడి చేసుకోలేక కుమిలికుమిలి ఏడ్చింది హిమ.

"అమ్మా సుమమ్మా అమ్మగారు లేపమన్నారు లేవండి" సీత మాటలు వింటూనే మత్తుగా కళ్ళు తెరిచింది సుమ.

"ఆరైపోయింది అర్జంటుగా తలంటాలి లెండమ్మా! మళ్ళీ రాగం తీస్తుంటే"

రోజూ ఎనిమిది దాటందే లేవని సుమకు చిర్రెత్తుకొచ్చింది. "లేచానంటే నీకంటుతా తల.. గెటౌట్" అంటూ మళ్ళీ ముసుగు తన్నేసింది.

"హిమమ్మా మీరైనా రండమ్మా! ఈ గొడవకు కళ్ళు తురిచిన హిమను చూస్తూ" అంది సీత.

"ఏంటే యింత ఎర్లీగా?"

"ఇవ్వాళ అట్లతద్దె పండగమ్మా అమ్మగారు తయారైపోయారు. మీరూలేస్తే తలంటు స్నానాలు చేయించాలి" సీత చెప్పింది.

"నిన్ననే షాంపూతో చేశాను అమ్మతో చెప్పు" బద్ధకంగా మళ్ళీ కళ్ళు మూసుకుంది హిమ.

"ఏమే? లేపావా?" తల్లి కంఠం వింటూనే లేవడానికి తయారైపోయింది హిమ.

"ఏయ్ సుమా! లే పొద్దెక్కిపోతోంది" దుప్పటి లాగేసింది అనురాధాదేవి.

ఇద్దరికీ అర్థమైపోయింది యిక తప్పదని.

సున్నిపిండితో నలుగుపెట్టి కుంకుళ్ళ రసంతో తలంటి అభ్యంగన స్నానాలు పూర్తిచేసింది సీత.

ఇద్దరితో పట్టుచీరలు కట్టించి ఒంటినిండా నగలు పెట్టింది అనురాధాదేవి.

అదో సంబరం. ముఖ్యంగా పల్లెటూరి సంబరం. పెళ్ళీడుకొచ్చిన ప్రతి ఆడపిల్లా రాబోయే భర్తకోసం వ్రతాలూ పూజలూ చేయడంతోబాటు ఇరుగమ్మలకు పొరుగమ్మలకు వాయినాలు యివ్వడం ఈ పండుగ ప్రత్యేకత. సాయం సమయాలో చెట్లకు ఉయ్యాలలు కట్టి వుత్సాహంగా వుయ్యాలలూగుతారు.

"అట్లతద్దె ఆరట్లు ముద్దుపప్పు మూడట్లు" అంటూ కన్నెపిల్లలంతా ఒకేచోట చేరి ఆనందోత్సాహాలతో పాటలు పాడుతూ కేరింతలు కొడతారు.

ఏ వ్రతంలోను లేని వింతొకటి ఈ అట్లతద్దె వ్రతంలో వుండడం విశేషం.

తెల్లవారుఝామున లేచి స్నానాలు చేసి కంది పచ్చడి, గోంగూర పచ్చళ్ళతో, గడ్డపెరుగు చద్దులు తిని రాత్రి చంద్రోదయం వరకు ఉపవాసముండడం విశేషం.

"అమ్మా మనం రెడీ అయిపోతే భీముడు గూడుబళ్ళు తెచ్చేస్తాడు. ఇయ్యాలంతా మనం వూటబావి పొలంలోనే" సీత హడావుడి చేసింది.

"అయితే నువ్వూ తయారైరా" అంటూ తన పెళ్ళికి కొనుక్కున్న అందమైన చీరయిస్తూ చెప్పింది హిమ.

"అయిదే అయిదు నిమిషాల్లో లగెత్తుకొస్తా" చీరను అపురూపంగా గుండెలకదుముకుంటూ పరుగుతీసింది సీత.

కుందనపు బొమ్మల్లా కనులముందు మెరిసిపోతున్న యిద్దరమ్మాయిల్ని కనులారా చూసుకుంటూ -అమెరికా సంబంధాలు చేస్తూ పిల్లల్ని తమకు దూరం చేసుకుంటూ పిల్లలకి కూడా సంస్కృతిని, సరదాలను దూరం చేస్తున్న తల్లిదండ్రుల జాబితాలో తనుకూడా వున్నందుకు ఖిన్నుడయ్యారు వెంకటరత్నంగారు.

అమ్మాయిలొచ్చి పాదాలకు నమస్కరిస్తుంటే గుండెలు నిండిన ఆనందంతో కండువాతో కళ్ళొత్తుకున్నారు వెంకటరత్నంగారు.

పదిగంటల ప్రాంతంలో హిమ ఫ్రెండ్స్ అంతా పట్టుబట్టలు పసిడి అలంకారలతో ప్రత్యక్షమైపోయారు. ఆ తరువాతంతా హడావుడే

అప్పుడే మోగింది హిమ సెల్. చూస్తూనే రజని అనేసి హాయ్ "రజనీ" అంది.

"హిమక్కా! ఉయ్ ఆర్ యిన్ యువర్ పొలెం. కమింగ్ విథిన్ ఫైవ్ మినిట్స్" రజని ఆనందంగా చెప్పింది.

హిమ చెప్పిన కబురు వింటూనే అమ్మాయిలంతా హాయిగా చప్పట్లు కొట్టేసారు.

అప్పటికే అందంగా అలంకరించిన మూడు గూడుబళ్ళు తెచ్చి యింటిముందు నిలిపాడు భీముడు.

కాలికి ఘల్లు, ఘల్లు గజ్జెలపట్టాలు, తలనిండుగా సన్నజాజి పూలు, హిమిచ్చిన చీరలో జానపద నాయికిలా వస్తున్న సీతను చూస్తునే "యిప్పటికే మన భీముడు ఢమాలైపోయుంటాడు నాదీ గ్యారంటీ" అనేసింది సుమ

అందరూ "యస్" అనేసారు.

"అక్కా యివ్వాళ దీంతోనే దీని లవ్ స్టోరీ చెప్పిస్తాను చూసుకో" అంటుంటే సీతొచ్చి అమ్మాయిలందర్నీ చూసి నోరు తెరిచేసింది.

"ఏయ్ సీతా! నందమూరి తారకరామారావుకి కనిపించవా?" సుమ అడిగితే

బిక్క ముఖం పెట్టేసిన సీతను చూస్తూ "ఏయ్ పిచ్చిదానా యన్.టి.ఆర్ అంటే భీముడి వేషం వేసార్లే - నువ్వు భీముడికి కనిపించావా అని అడుగుతోంది సుమ" హిమ నవ్వుతూ చెప్పింది.

"ఆడు యన్.టి.ఆర్ అయితే నేను సావిత్రి" సిగ్గుతో చెప్పింది సీత..

"నీ యెంకమ్మ నిన్నేదో తిక్కదానివనుకొని బనాయిస్తోంది సుమ. నిజంగా తిక్కది అదే" అన్నపూర్ణ హాస్యమాడింది.

అంతలో ఇన్నోవాతోబాటు, స్కోడా కూడా వచ్చి ఆగడంతో రజనీతోబాటు వరుణ్ కూడా వచ్చాడని గ్రహించింది హిమ.

ఇన్నోవాలోంచి దిగిన రజని గ్యాంగ్‌ను ఆప్యాయంగా ఆహ్వానించారు అందరూ.

**కారులోంచి సుమను** చూసిన వరుణ్ త్రిల్లైపోయాడు. అందమైన చీరకట్టుతో అలంకరించుకున్న ఆభరణాలతో అప్సరసలా మెరిసిపోతున్న సుమనే చూస్తూ చూపులు తిప్పుకోలేకపోతుంటే "హాయ్ బావా" అంటూ సుమే వచ్చేసింది.

తడబడుతున్న కాళ్ళతో అదుపు తప్పుతున్న హార్ట్‌బీట్‌తో నెమ్మదిగా కారుదిగాడు.

అప్పటికే అమ్మాయిలంతా చుట్టుముట్టేశారు.

"రండి బావా రండి. అట్లతద్దెకు అరుదెంచిన బావగారికి స్వాగతం" సుమ సహజధోరణిలో అనేసింది.

"అబ్బా! ఎంత హ్యాండ్‌సంగా వున్నాడే మీ బావ. పేరు మహేష్‌బాబా?" చెవిలో గుసగుసలాడేసింది హేమలత నిజంగా సుమకి బావేనన్న ఫీలింగ్‌తో.

"రజని బ్రదర్ పేరు వరుణ్‌బాబు"

"పేరేదైతేనేం హీరోలావున్నాడు మీ బావ" చిన్నగా గిల్లేసింది.

"మేమంతా ఊటబావి పొలానికి వెళ్ళిపోతున్నాం సాయంత్రందాకా అక్కడే మకాం" మీరూరండి అన్నపూర్ణ ఆహ్వానిస్తుంటే.

పక్కుమని నవ్వేసిన టాన్యా "ఇది అమ్మాయిల పండగ - అబ్బాయిలకి నో ఎంట్రీ" అనేసింది.

"అయితే యింకేం మనమో చుడీదారో చుక్కల చీరో యిస్తే సరి" హేమలత యింకా అడ్వాన్స్ అయిపోయింది.

"అన్నయ్యా! అమ్మో...అందరూ అమ్మాయిలే. మేం సాయంత్రం ఫ్యాక్టరీకొస్తాం" అడ్డం పడిపోయింది రజని.

"లోపల డాడీ వున్నారు మీరెళ్ళండి వరుణ్" ఆహ్వానించింది హిమ.

అట్లతద్దె ఫెస్టివల్‌ను అమ్మాయిలకే అంకితం చేసిన అలనాటి పెద్దల్ని అక్కసుతో గుర్తుచేసుకుంటూ తన 'డిజికామ్‌ని' రజనీకి యిచ్చాడు కంప్యూటర్లో ఫోటోలైనా చూసుకోవచ్చని.

ఊరికి కిలోమీటర్ దూరంలో వుంది ఊటబావిపాలం.

సంవత్సరంలో అన్నివేళలా నీటితో నిండిపోయే ఆ బావి ఆ వూరికే ప్రత్యేకం.

నిండు వేసవిలో కూడా పొంగి పొర్లే ఆ బావే వూరి గంగానమ్మ దేవత.

మూడు బళ్ళూ చూసి ముచ్చటపడిపోయారు అమ్మాయిలంతా, ఆనందంగా సర్దుకుపోయారు.

బళ్ళు బయలుదేరుతుంటే "ఇవ్వాళంతా వుపవాసముండాలి పొలంలో ఏమీ తినకండి" హెచ్చరించింది అనురాధాదేవి.

అమ్మాయిలంతా ఉపవాసమా? అనుకుంటూ ఢీలా పడిపోతుంటే -

"చుట్టూ తోటలే కొబ్బరిబొండాలు, జామ, దానిమ్మ పళ్ళు, బత్తాయి, నారింజలు మీ యిష్టం" నెమ్మదిగా చెప్పాడు భీముడు.

"హాయ్ రే హాయ్ జాంపండురోయ్" పాట మొదలెట్టింది రజని ఫ్రెండ్ హారిక.

అంతలోనే పరుగెత్తుకుంటూ వచ్చేసారు లక్ష్మి, రమ్యలు. బందరు కాలువ రోడ్డు మీద బళ్ళు బయలుదేరాయి.

అమ్మాయిలందరూ ఆనందంతో వూరువూరంతా వులిక్కిపడేలా అట్లతద్దె ఆరట్లు - ముద్దపప్పు మూడట్లు పాట స్టార్ట్ చేసారు.

దాదాపు పొలంలోకి వస్తుండగా "అమ్మా! అయిదు వుయ్యాలలు కట్టించాను సరిపోతాయా యిమమ్మా? కావాలంటే యింకా" భీముడు అడిగాడు.

"చాల్లేరా. పందిరి వుందిగా?" అడిగింది హిమ.

"పందిరేంటమ్మా. రాతిరే షామియానా వేయించా. కార్పెట్ పరిపించా" సీతను చూస్తూ రెచ్చిపోయి చెప్పాడు భీముడు.

"మరింకేం పంతులుగారిని కూడా తీసుకొస్తే సీతా - భీముల కళ్యాణం కూడా అయిపోయేది" సుమ అంది.

"పెళ్ళికి పంతులెందుకమ్మా! ఆ యిడాకులు రానీయండి. మూడేంటి? ముప్పై ముళ్ళు ఏచేత్తా" గాలిలో తేలిపోతూ చెప్పాడు భీముడు.

సీతా భీముళ్ళను చూస్తుంటే నండూరి వారి ఎంకి - నాయుడుబావ గుర్తొచ్చారు హిమకి.

ఊటబావి వచ్చేసింది. అక్కడున్న ఏర్పాట్లు చూసి అమ్మాయిలంతా బళ్ళు ఆగకముందే దూకేసి వుయ్యాలబల్లల్ని వూపేసారు.

బళ్ళను ఓ చెట్టుక్రింద ఆపి ఎద్దుల్ని తీసుకుని యిద్దరు పాలేర్లు వెళ్ళిపోయారు.

"అమ్మా యిమమ్మా మోటారు ఏత్తే నీళ్ళే నీళ్ళు మీ యిష్టం. నేనెళ్ళి పళ్ళు పలాలు తెస్తా. కొబ్బరి బొండాలు నీళ్ళతొట్టెలో రాత్రే ఏశా చల్లగుండాలని. వస్తానమ్మా!" భీముడు వెళ్ళిపోయాడు.

పన్నెండు మంది అమ్మాయిలు, సీత, లక్ష్మిలు మిగిలిపోయారు.

"ఎవరిష్టం వాళ్ళది" సుమ చీరలో చిరాకు పడిపోతుంటే హిమ సర్ది చెప్పింది.

రజని ఎన్ని ఫోటోలు తీసిందో లెక్కలేదు. అన్నయ్య మనసెరిగినట్లు ఎక్కువగా సుమనే కవర్ చేసింది.

సుమ గోల పెట్టినా వినిపించుకోని రజనీని, చిన్నపిల్లలా అల్లరి చేస్తున్న చెల్లినీ చూస్తూ ఎంత ఐటి జాబ్స్ చేసినా ఎన్ని లక్షల డాలర్లు సంపాదించినా ఈ మధుర క్షణాలు ముందు దిగదుడుపే అనుకుంటుంటే ఇక తన జీవితం అంతా యిక్కడే కదా అన్న మధురభావన హిమ మనసును మత్తుగా కమ్మేసింది.

ఏవేవో అందరితో మోయించుకుంటూ భీముడు వచ్చేసాడు.

తొక్కుడు బిళ్ళ, బిళ్ళంగోడు, కోకో, కబాడీ మొదలైన ఆటల్లో దేన్నీ వదిలిపెట్టని అమ్మాయిలంతా వాళ్ళు తెచ్చిన ఫ్రూట్స్ మీద పడిపోయారు. అన్నీ తినలేక నీరసపడిపోయారు. భీముడు కొట్టిచ్చిన బొండాలు తాగేసి మళ్ళీ అల్లరికి, ఆటలకి రెడీ అయిపోయారు.

పాలెర్లనెవరినీ మరో రెండు గంటలవరకూ రావద్దని చెప్పి పంపించేసి జలకాలాటలకు సన్నద్ధమైపోయారు.

బావిలో ఈత కొడదామన్న సుమ ప్రపోజల్‌కి భయపడిపోయి వాటర్ టేంక్‌తోనూ, బోర్ వాటర్‌తోనూ కుస్తీపట్టేశారు.

సాయంత్రం అయిపోయింది అందరూ రెడీ అయిపోయారు. కార్పెట్ మీద సొమ్మసిల్లిపోయారు.

సీత తాటాకు విసినకర్రతో హిమ దగ్గరకొస్తుంటే.

"అక్కా! యిది ఈ చీరలో, అద్దాల రవికతో అల్లరిమువ్వలతో అచ్చం బ్రైడ్‌లా వుందికదూ?" సుమ హిమను చేరిపోతూ అంది.

"నేనేం బ్రెడ్డులా లేను" అలిగింది సీత.

"బ్రెడ్ కాదే బాబు బ్రైడ్ అంటే పెళ్ళికూతురని" నుదురుకొట్టుకుంటూ చెప్పింది సుమ.

"అంతా బోసుబాబుగారి దయమ్మా! అయ్యేంటో యిడాకులో యిస్తరాకులో వచ్చేత్తే నేను బ్రేడ్‌నే" సిగ్గులమొగ్గైపోయింది సీత.

"నీ యెంకమ్మ ఇంగ్లీసొద్దుగానీ తెలుగుచాల్లే నీకూ నాకూ" విసుక్కుంది మళ్ళీ సుమ.

"ఆ విడాకులు అవే వస్తాయిగానీ అసలు నీ కదేంటో చెప్పవే" సుమ నవ్వుతూ అడిగింది.

"మీకు తలనొప్పి. నాకు నోరునొప్పి"

"ఫర్వాలేదులే మళ్ళీ యన్.టీవాడు వచ్చేస్తాడు నువ్వు మొదలుపెట్టు" సుమ హెచ్చరించింది.

అమ్మాయిలంతా ఆసక్తిగా చూట్టూ చేరిపోయారు.

సీత మొదలుపెట్టబోతుంటే

"అమ్మా రమ్యా! ఇది అడల్ట్ సినిమా నువ్వలా వెళ్ళి వుయ్యాల వూగుతూ భారతమాతకు జేజేలు పాటలు పాడేసుకో. లక్ష్మీ నువ్వెళ్ళి ఈ పాపాయికి వుయ్యాల వూపవే" అంటూ ఇద్దర్నీ పంపించేసి "సీతా ఫ్లాష్ బ్యాక్ పూరీ స్టైలా? శ్రీను వైట్ల స్టైలా?" హిమ ప్రక్కనే సెటిలైపోతూ అడిగింది సుమ.

"పూరీలూ అట్లూ యివ్వాళ తినకూడదు వుపవాసం కదా" సీత జవాబిచ్చింది.

తలబాదుకుంటూ సుమ ఏదో అనబోతుంటే హిమ వారించి "నువ్వు చెప్పు సీతా" హిమ అడిగింది.

"నేను అయిదో క్లాసుదాకా పాలెంలోనే వున్నానమ్మా. అప్పుడు మా యిల్లు భీముడిల్లు పక్కపక్కనే."

"వావ్! ఎలిమెంటరీ ప్రేమన్నమాట" సుమ కామెంట్.

"సుమమ్మ యేళాకోలమాడుతోంది అయితే నేను చెప్పను" సీత బిగుసుకుపోయింది.

"నువ్వు సుమ మాటలు వినకు. మాతో చెప్పు" హిమ మళ్ళీ అడిగింది.

"నేను అయిదో తరగతిలో వున్నప్పుడూ మా అయ్య వల్లూరు తీసుకెళ్ళిపోయాడు. అక్కడే ఏడుదాకా చదివి మానేసా."

"పాలెంలో వున్నప్పుడు నువ్వు పడవెక్కి వెళ్ళిపోతుంటే భీముడు టైరు దొర్లించుకుంటూ తూనీగా తూనీగా పాటపాడాడా?" మళ్ళీ సుమ.

"భీముడికి పాటలు రావమ్మా ఆడిదెప్పుడూ దెబ్బలాటలు గిల్లకజ్జాలే పెళ్ళీడు వచ్చిందని సంబంధాలు చూశాడు మా అయ్య. బల్లకట్టు కోటయ్య కట్నంలేకుండా తన కొడుక్కి చేసుకుంటానంటే ఎగిరిగంతేసాడు మా అయ్య. పాలెంలో కోటయ్య కొడుకు కూడా మా స్కూలులోనే చదివాడు. పెళ్ళి చూపులు పెట్టారు. ఆ రోజే చెప్పింది నా చెల్లి అక్కా బావకు గడ్డాలు మీసాలూ లేవే అని. అప్పుడు నవ్వుకున్నాను గానీ ఆరోజే ఆడ్ని వద్దని వుంటే నాకథ యిలా అయ్యేదికాదు" ఆగింది సీత.

సినిమాలో ట్విస్ట్‌లావుందే అమ్మాయిలంతా గుసగుసలాడేసుకున్నారు.

"అదీ నా మంచికే అయ్యిందనుకుంటానమ్మా! పాలెం కాపరానికొచ్చాకే మళ్ళీ భీముడు కనిపించాడు" సీత కళ్ళల్లో మెరుపులు.

"అద్దిరిపోయే ఇంట్రడక్షన్. చెప్పవే సీత. భీముడా! మజాకానా!" వుత్సాహపడిపోయింది నిర్మల.

"కాపరానికొచ్చానన్న మాటేగానీ ఆడు నాగేష్ గాడు నన్నసలు ముట్టుకునేవాడేకాదు. హాయిగా తిండం తొంగోడం."

"పోనీ సాక్షి సినిమాలో విజయనిర్మల్లా నువ్వే ముట్టుకుంటే బాగుండేది" టాన్యా సలహా యిచ్చింది.

"అదీ అయ్యిందిమ్మా, గొడ్డును బాదినట్లు బాదేసాడు. అందుకే వల్లూరు పారిపోయా. జరిగిందంతా మా అమ్మతో చెప్పా. అయ్యతో చెప్పింది. అయ్య మిన్నకుండి పోయాడు. మా పక్కింటి పాప ప్రసవానికొచ్చింది. పాపతో అంతా చెప్పాను."

"ఆడు మొగుడేకాదని మగాడు కాదని తేల్చేసింది."

"కోటయ్యమామ పంచాయితీకొచ్చాడు నిజం చెప్పేద్దామనుకుంటే అమ్మ అడ్డం పడిపోయింది. కోటయ్యమామ చాలా మంచోడు, ఆడికి యింకా యిద్దరమ్మాయిలు, యిద్దరు అబ్బాయిలున్నారు. నాగేష్‌గాడి సంగతి లోకానికి తెలిసిపోతే కోటయ్య మామ కుటుంబంతో బాటు బందరు కాలువలో దూకేత్తాడు. నేనూ, అయ్యా వచ్చి వెంకటరత్నం అయ్యతో చెప్తాం. చూద్దాం - ఏమవుతుందోనని" సముదాయించింది.

"అయితే మళ్ళీ కాపురానికొచ్చావన్నమాట" అన్నపూర్ణ ఆరాతీసింది.

"ఔనమ్మా మళ్ళీ పాలెం వచ్చాను. మళ్ళీ మామూలే. ఓరోజు కోపం వచ్చి నువ్వసలు మగాడివేనా? అడిగేసాను. దానికేవాడు గొడ్డును బాదినట్టు బాదేశాడు. అయ్యకు కబురు చేశాను. ఆయనొచ్చి వెంకటరత్నం అయ్యింట్లో పంచాయితీ పెట్టించాడు."

కళ్ళవెంట కారుతున్న కన్నీరును తుడుచుకుంటూ ఆగిపోయింది సీత.

"అయ్యగారు కోటయ్య మామను పిలిపించి మాట్లాడారు లాయర్ బోసుబాబుగారు కూడా ఏదో మాట్లాడారు. యిడాకుల కాగితం మీద నాగేష్ సంతకం చేసాడు. కేసు కోర్టులో వుందంట" సీత ఆగిపోయింది.

"ఓకే. ఓకే. ఇంతకీ అసలుదేది?" హేమలత అడిగింది.

సీత బ్లాంక్ ఫేస్ పెట్టేసింది.

"అదేనే తల్లీ సీతా - భీముల లవ్వాయణం" సుమ చెప్పింది.

సిగ్గుపడిపోయింది సీత. "నేను చెప్పను బాబూ ఆడ్నే అడగండి" ముఖం దాచుకుంది.

"ఆడ్ని అంటే? నాగేష్ గాడినా? భీముడినా?" రజని నోరిప్పింది.

"మొదటిసారి మాట్లాడుకున్నప్పుడు ఏం పాట పాడుకున్నారే?" హేమలత అడిగింది.

"పాటలేంటమ్మా? యిదేమన్నా సినీమానా?" ప్రశ్నించింది సీత.

"దీని ముందు సినిమా ఎందుకు పనికొస్తుందే? ఈ కథను ఏ వినాయక్కో, రాజమౌళికో అమ్మేయొచ్చు. నాదీ గ్యారంటీ" సుమ వుత్సాహపాడిపోయింది.

"మీరు కాస్త మూసుకుంటే అది నోరు తెరుస్తుంది" హిమ వార్నిగ్ యిచ్చింది.

"మా అయ్య నన్ను అయ్యగారింట్లోనే వుంచేసాడు. పంచాయితీ జరిగిన మర్నాడు భీముడి అక్క ధనక్ష్మి కలిసింది. చిన్నప్పుడు అది కూడా మా స్కూల్లోనే చదివేది.

"ఇదిగో సీతా! నిన్నోమాట అడుగుతాను ఏమీ అనుకోకూడదు" అదే మాట్లాడింది.

"ఏమీ అనుకోను అడుగు అన్నాను" ఆగిపోయింది సీత.

"చెప్పవే తల్లీ, చెప్పవే బాబూ సస్పెన్స్‌తో చెమటలు పట్టేస్తున్నాయి" నిర్మల ప్రాధేయపడింది.

"నువ్వంటే మా తమ్ముడికి చచ్చేంత యిష్టం. నువ్వు ఒప్పుకుంటే పెళ్ళిచేసుకుంటానంటున్నాడు. తిన్నగా నీతో చెప్పాలంటే భయపడి చస్తున్నాడు. మొన్న మీ అయ్యగారి యింట్లో పంచాయితీ జరిగినప్పుడు వాడు అంతా విన్నాడట. నీకు విడాకులు వచ్చాకే పెళ్ళి" అందమ్మా!

"ధనలక్ష్మికి ఏం చెప్పాలో నాకు అర్ధం కాలేదమ్మా" సీత ఆగిపోయింది.

"ఛాంగురే బంగారు రాజా" పాట పాడేశావా చెప్పు సీతా ప్లీజ్. టాన్యా రెట్టించింది.

"అప్పుడు మళ్ళీ ఐదోక్లాసులోకి అదే ఫ్లాష్‌బాక్ లోనికి వెళ్ళిపోయావా?" అన్నపూర్ణ అడిగింది.

"అయన్ని నాకు తెలీదమ్మా - భీముడంటే నాకిష్టం" అదే చెప్పాను.

"ఆ తర్వాత మీ అమ్మా నాన్నా చెల్లెళ్ళు రావడం వీరశోకాలు పెట్టడం నువ్వే నిర్ణయించుకున్నావు మేమంతా చచ్చామనుకున్నావా? అని బెదిరించడం బందరు కాలువలోకి దూకేయడం లాంటివేమీ జరగలేదా?" నిరాశగా అడిగేసింది మళయాళం సినిమాలు కూడా వదిలిపెట్టని రజని ఫ్రెండ్ ఆషా.

"అనవసరంగా డిజప్పాయింట్ గాకు. మీ అమ్మానాన్నలని నువ్వు దూకించేద్దువులే కృష్ణానదిలో" ఆషా లవ్ స్టోరీ తెలిసిన రజని కామెంట్ చేసింది.

"సరే మీరాపండే సోది - తర్వాత? " సీతను అడిగిందిహిమ.

"ఆ రోజే యిదంతా అయ్యగారికి చెప్పానమ్మా. అయ్యగారు భీముడిని పిలిపిస్తే సిగ్గుపడిపోయి గడ్డివాములో దాక్కుండిపోయాడు" నవ్వేసింది సీత.

"నీ యెంకమ్మా మా భీముడంటే అల్లరి నరేష్ అనుకున్నావా? వాడు రానీయ్. నీ సంగతి తేల్చకపోతే నాదీ గ్యారంటీ" సుమ ఆవేశం నటించింది.

"నీకు విడాకులు వచ్చాక భీముడు నిన్ను పెళ్ళాడకపోతే?" అనుమానం వ్యక్తం చేసింది టాన్యా.

"సీతను వదిలి ఏ పీతను చూసినా వాడైపోయినట్లే నువ్వేం టెన్షన్ పడకు" సుమ చెప్పింది.

"సీతా యు ఆర్ వెరీ గ్రేట్ - ధైర్యమున్న అమ్మాయివే నువ్వు. నాకాళ్ళు కడుగుతూ నన్నోమాటన్నావ్ గుర్తుందా? తమరెప్పుడూ మా పల్లెకూతురే అని. నాలాంటి వాళ్ళుకాదే పల్లెకూతుళ్ళు నీలాంటి అమ్మాయిలే" మనస్ఫూర్తిగా అంది హిమ సీత తన చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. తల్లికి ఎదురు చెప్పలేక తన బాబుకు దూరమైపోయిన తన చేతగానితనానికి మనసులోనే నిందించుకుంటూ.

ఐదు గంటలకే అందరూ బయలుదేరిపోయారు. మరోసారి ఫొటోసెషన్ ఏర్పాటు చేసింది రజని.

పూలు పెట్టుకుని బొండాలు తాగుతూ ఫోజులిచ్చేశారు కొందరు. కోతి చేష్టలు చేస్తూ కెమెరాకి దొరికిపోయారు మరికొందరు. సిగ్గుతో చితికిపోతున్న భీముడిని సీత పక్కన నిలబెట్టి ఫోటోలు తీయడం రజనికి శక్తికి మించిన పనైపోయింది. ఆ సీన్లన్నీ చూస్తుంటే అందరికీ బాపూ చిత్రం సాక్షి కళ్ళముందు కదలాడిపోయింది.

అమ్మాయిల బనాయింపును, దాడిని తట్టుకోలేని భీముడు పొలాల్లోకి పరుగులు తీస్తుంటే

"ఏయ్ సీతా నీ రాముడెళ్ళిపోతున్నాడు పట్టుకుని తెచ్చుకో" అంటూ సీతను కూడా పొలాల్లోకి నెట్టేశారు.

సీతవెళ్ళి భీముడికి నచ్చచెప్పి చెయ్యిపట్టుకుని తీసుకొస్తుంటే "ఇదేనమ్మా సీతాభీముల కళ్యాణమంటే" ఆనందంతో పాటపాడేస్తూ చప్పట్లు కొట్టేశారు అమ్మాయిలంతా.

చంద్రదర్శనం అయిపోయింది. వాయినాలు యిచ్చేశారు. అమ్మాయిల్తో బాటు ముత్తైదువులంతా తురాయి చెట్టుక్రింద చేరిపోయారు.

పడవ మల్లేసు తన పడవతో తయారుగా వున్నాడు. శుభ్రంగా కడిగి పడవని అందంగా అలంకరించాడు. గూడు క్రింద దీపాలు వెలిగించారు. చాలామంది అమ్మలక్కలు అమ్మాయిలతోబాటు అప్పటికే పడవ ఎక్కేశారు. అందరూ ఎక్కాక పడవను తీసుకెళ్ళి కాలువమధ్య లంగరు వేస్తాడు. ముత్తైదువులు ప్రమిదల్లో దీపాలు వెలిగించి అరిటాకు దొనెల్లో పెట్టి నీటిలోకి వదిలేస్తారు. దీపాలు వరుసగా కాలువలో ప్రయాణం చేస్తుంటే వూరువూరంతా తమ తమ యిళ్ళముందు నిలబడి ఆ దీపాలని, దీపాల ప్రతిబింబాల్ని నీటిలో చూస్తూ గంగమ్మ తల్లికి దండాలు పెట్టేస్తూ కాలువలో నీళ్ళు తలమీద చల్లుకుంటారు.

ఫ్యాక్టరీ కుంటుపడిన తర్వాత ఈ ఉత్సాహానికి దూరమైపోయిన పాలెం ప్రజలకు ఈనాటి ఈ సందడి అనిర్వచనీయమైన ఆనందదాయకమైపోయింది.

విజయవాడ అమ్మాయిలంతా ఆ రాత్రి అక్కడే వుండిపోయారు.

హిమతో బాటు సుమకి కూడా మళ్ళీ పట్టుచీర కట్టుకోక తప్పలేదు. ఆ ఉత్సాహానికి వాళ్ళిద్దరే మకుటాలై మెరిసిపోతున్నారు.

అంతా కోలాహలం, ఆనందంతో అరుపులు వుత్సాహంతో పాటలు గోలగోలగా వుంది.

ఒక్కసారిగా పిన్‌డ్రాప్ సైలెన్స్.

"ప్రిన్స్ ఈజ్ కమింగ్" టాన్యా కామెంట్ చేసింది.

అందరి దృష్టీ అతనిమీదే

పాలమీగడవంటి తెల్లని లాల్చీ పైజమా, దీపాల వెలుగుతో మెరుపులు కురిపిస్తున్న అందమైన గోల్డ్‌చైన్, పొందికైన బ్రాస్‌లెట్‌తోబాటు నాగ్ పూర్ చెప్పుల్స్‌తో నడిచొస్తున్న ఆరడుగుల అందమైన పర్సనాలిటీని చూస్తునే అమ్మాయిలంతా "వావ్... నిజంగా ప్రిన్సే" అనేసుకుంటూ త్రిల్లయిపోతుంటే 'గోపాలకృష్ణగారి అబ్బాయి' అంటూ అమ్మలక్కలు ఆశ్చర్యంతో చెవులు కొరికేసుకున్నారు.

"మా అన్నయ్య వరుణ్" అందరినీ చూస్తూ గర్వంగా చెప్పింది రజని.

"అందమైన బావా - ఆవు పాల కోవా" అంటూ సుమ పాడేస్తుంటే.

"మొత్తం పాడెయ్యవే ఓ పనైపోతుంది" హేమలత సపోర్టు చేసింది.

"అంత సీన్ లేదమ్మా" అని సుమ అంటే

"కొంత సీను వున్నట్లేగా?" టాన్యా కమ్ముకుపోయింది.

"ఏంటే? అంత సీను లేనిది? నీకా మా అన్నయ్యకా?" నిలదీసింది రజని.

కాగల కార్యం గంధర్వకన్యలే తీర్చేస్తున్నారని చిరునవ్వులు చిందించింది హిమ.

"మీ అన్నయ్యను హైదరాబాద్ పంపించవే వారసత్వమే తప్ప యాక్షన్ కూడా రాని వుడెన్ ఫేసు వారసులంతా మూటాముల్లే సర్దేయకపోతే నాదీ గ్యారంటీ" సుమను యిమిటేట్ చేస్తూ కామెంట్ చేసింది టాన్యా.

సుమ ముఖంలో అప్రయత్నంగా సిగ్గుదోబూచులాడింది. ఏ భావతరంగాలు గుండెల్ని తాకాయో మౌనముద్ర దాల్చేసింది.

"ఏయ్ రజనీ మీ అన్నయ్యని పడవమీదకి రమ్మనవే" అన్నపూర్ణ అడిగింది.

"మా అన్నయ్య? ఇక్కడికా? నో..వే.. అమ్మాయిలంటేనే ఆమడ దూరం. అమ్మాయితో మాట్లాడడమే అపురూపం. బావా అంటూ బనాయించే సుమతో తప్ప అంత క్లోజ్‌గా మాట్లాడడం నేను పుట్టాక చూడలేదు" రజని చెప్పింది.

"అయితే నువ్వే పిలవ్వే" హేమలత సుమను అడిగింది.

"అక్కా నీ ఫ్రెండ్‌ని తగ్గమని చెప్పు. లేదంటేనా నీళ్ళలోకి తోసేస్తా. అసలే ఈతరాదు. మూడు మునకలు నాదీ గ్యారంటీ" సుమ వుక్రోషంగా అంది.

సరంగులు పడవతాళ్ళు విప్పేసారు. మల్లేసు గెడ పట్టేశాడు. కాలవ మధ్యలోకి పడవ వెళ్ళిపోతుంటే అప్పుడే వచ్చిన లాయర్‌బాబు, స్వామితాత, వరుణ్‌లతో బాటు అందరూ చేతులూపుతూ నిలబడిపోయారు.

మల్లేసు కాలవ మధ్య లంగరు వేయించాడు.

అందరూ వెలిగించిన దీపాలను అరటిదోనెల్లో పెట్టి నీటిమీదకి వాలడం మొదలు పెట్టారు.

అంతా సందడే సందడి.

అప్పుడు జరిగిపోయింది ఆ సంఘటన.

నీటిలోకి దీపాన్ని వదులుతున్న సుమ తూలి నీళ్ళల్లో పడిపోయింది.

అందరూ హాహాకారాలు చేసారు. "అమ్మా సుమా" స్వామితాత అరిచేసాడు.

అంతలో మరో సంఘటన జరిగిపోయింది.

ఒడ్డుమీదున్న వరుణ్‌బాబు చెప్పుల్ని కూడా విడవకుండా కాలవలోకి దూకేసాడు.

నాలుగుబారల్లో వచ్చి సుమను చుట్టేసి పైకి ఎత్తేసాడు. మల్లేసు సాయంతో పడవమీదకు చేర్చేసాడు.

వరుణ్ బెడ్‌రూంలో అప్పుడే కళ్ళు తెరిచిన సుమ అమ్మాయిలందర్నీ చూస్తూ "అసలేమయ్యింది?" అడిగేసింది.

"ఏంటమ్మా యిది సినిమా షూటింగ్ అనుకున్నావా? దూకింది నువ్వు. అసలేమయ్యిందో నువ్వే చెప్పాలి" హేమలత వ్యంగ్యంగా అడిగింది.

"నేనా దూకానా? ఓకే దూకానే అనుకోండి. నా స్విమ్మింగ్ కెపాసిటీ మీకు తెలుసుగా" ప్రశ్నించింది సుమ.

"నీ కెపాసిటీ మాకు తెలుసు కానీ నీకోసం దూకేసిన ఆ దూకుడు హీరోకి తెలియదుగా?" టాన్యా నవ్వుతూ అంటించింది.

"దూకుడు హీరోనా?" అయోమయంగా చూసింది.

"తమరు తపక్‌మని నీళ్ళలోకి జారిపోయినప్పుడు పట్టుచీరకాళ్ళకు చుట్టుకుపోయి పల్టీలు కొట్టుకుంటూ వాటర్లో మునిగిపోయారు. షాక్‌తోనో సరదాతోనో నాలుగైదు గుటకలు కూడా వేసేశారు." టాన్యా గుక్కతిప్పుకుంటూ అంది.

"అబ్బా సుమా! అయిదు నిమిషాల్లో అందరినీ హడలెత్తించేశావి. హీరోయిన్ అంటే నువ్వేనే?" నిర్మల అనేసింది.

"నాకు ఈ కాలువ కొత్తా? ఈతకొత్తా? అంతగా కంగారెందుకు పడ్డారక్కా.?" హిమను అడిగింది.

"షాక్ మూలంగా స్పృహ కోల్పోతావనిలే" అన్నపూర్ణ అందుకుంది.

"అయినా హీరోయిన్లు వాటర్‌లో పడేది హీరోలు దూకుతారనే. హీరోయిన్‌కి ఈతొచ్చినా హీరోనే ఎత్తుకు తీసుకురావాలి ఇది వందేళ్ళ సినిమారూల్" జీవిత రహస్యం అన్నట్లు వివరించింది అన్నపూర్ణ.

"మొత్తానికి మా అన్నయ్యతో బరువులు ఎత్తించావ్. సిగ్గుల చిన్నోడ్ని సూపర్ మేన్‌ని చేశావు. నిన్ను భుజం మీద మోసుకుంటూ బోల్డు మెట్లెక్కేసాడు. బోల్డ్‌మేన్ అయిపోయాడు చాలా థాంక్స్ సుమ" అంది రజని.

"మీ అన్నయ్యేంటీ? బోసుబాబైతే బోలెడు గాభరా పడిపోయి అయిదే అయిదు నిమిషాల్లో ఆళ్ళ ఫ్రెండ్ డాక్టర్ రావుగారిని అదృశ్యం చేసి తెచ్చేసారు. సుమా! మజాకా?" టాన్యా కామెంట్ చేసింది.

"నన్ను తోసేస్తానని అది దూకేసింది. ప్చ్ ఏదైనా యిక్కడ రాసి పెట్టి వుండాలే" హేమలత సుమని టీజ్ చేసింది.

"నేను దూకానా? అంటే నేనే కావాలని సీన్ క్రియేట్ చేసానా? అక్కా నీ ఫ్రెండ్ సర్కిల్లో ఒక శాల్తీ మైనస్సే నాదీ గ్యారంటీ" వూగిపోయింది సుమ.

"ఆ సీన్ రాసింది రైటరో, డైరెక్టరో అయితే ఓకే. ఈ మధ్య హీరోలు, హీరోయిన్లు కూడా రైటర్లైపోయి సినిమాలను పల్టీకొట్టించేసి ప్రొడ్యూసర్‌లను ఎర్రగడ్డకో, వైజాగ్‌కో అంకితం చేసేస్తున్నారు." హిమవంక అదోలా చూస్తూ సాగదీసింది హేమలత.

హిమ పొంగుతున్న నవ్వును పెదాల మధ్య నవ్వును దాచుకుంటూ సుమ బుగ్గల్ని ముద్దాడేసింది.

"మా మీద దయవుంచి శుభం కార్డ్ వేసేస్తే డిన్నర్‌కెళ్ళిపోదాం. ఈ వార్త విని మీ అమ్మానాన్నలు యిప్పటికే బయలుదేరిపోయుంటారు. ముందు తమరు ధరించిన పైజమా లాల్చీలు మార్చుకుంటే" అంటున్న టాన్యాను చూడలేక చూపులు క్రిందికి దించుకుంది సుమ.

తను కట్టుకున్నది బావ బట్టలన్నమాట. అనుకుంటూనే యస్ హి ఈజ్ దూకుడు హీరోనే మనసులో ఫ్లాషైపోయిన హేమలత బనాయింపును తలుచుకుంటూ సిగ్గులమొగ్గైపోయింది సుమ సింధు.

***

వరుణ్ వచ్చి వారమైపోయింది. ఫ్యాక్టరీ వర్క్‌లో పూర్తిగా ఇన్‌వాల్వ్ అయిపోయినా, సుమ కనిపించినా పేరు వినిపించినా లయతప్పుతున్న 'హార్ట్‌బీట్' అర్థమవుతూనే వుంది.

హిమబిందును అడగాలంటే బిడియం అడ్డుపడిపోతోంది.

బోసుబాబు ఫ్యాక్టరీ పనుల్తో విజయవాడలోనే ఎక్కువ వుంటున్నాడు.

తన హృదయం తెలియని సుమ తన ఫ్రెండ్స్‌తో వచ్చి రెగ్యులర్‌గా అల్లరి చేసి మరీ అదృశ్యమైపోతోంది.

విజయలక్ష్మిగారొచ్చినప్పుడు అనురాధాదేవి వచ్చినా వాళ్ళ సంభాషణల్లో సుమ పెళ్ళిగురించి కనీసం ప్రస్థావన కూడా రాకపోవడంతో హిమబిందుగారింకా సుమసింధు విషయం సీరియస్‌గా తీసుకోలేదేమోనన్న డౌట్ మొదలైపోయింది. రజనిని కదిలిస్తే? అమ్మో దాని అల్లరితో అసలుకే ఎసరొస్తే కొంపకొల్లేరే అనుకున్నాడు వరుణ్.

కారు దిగి తండ్రితోబాటు వస్తున్న హిమబిందును చూస్తునే "వదినా వదినా వందనం" హమ్ చేసుకుంటూ జెట్ స్పీడులో మెట్లు దిగేసాడు.

స్వామితాతను చూస్తూనే మీ యిద్దరూ మాట్లాడుతూ వుండండి. నేను స్వామితాతతో మాట్లాడి వచ్చేస్తాను అంటూ వెంకటరత్నంగారు అటెళ్ళగానే "హిమ బిందూజీ ఏంటివాళ చాలా డల్‌గా వున్నారు?" కన్‌సర్న్‌గా అడిగాడు వరుణ్.

"ఏమిటివాళ చాలా హుషారుగా వున్నారు?" ఎదురు ప్రశ్న వేసింది హిమ.

"ట్రయిల్ రన్ సక్సెస్ చాలా ఆనందంగా చెప్పాడు. నా ట్రయిలే నాట్ సక్సెస్" అనుకుంటూ.

"హిమాజీ డాడీ ఇనాగరేషన్ టైంలోనే ఎరియర్స్ కూడా ఇచ్చేయాలన్నారు. మేనేజర్, స్వామితాత కలిసి ఆ పనిమీదే వున్నారు."

"వెరీ వెరీ హ్యాపీ న్యూస్. అవునూ సుమ ఏమైనా యిటొచ్చిందా? మార్నింగ్ నుంచి కనిపించటంలేదు.." ఓరగా చూస్తూ అంది.

"ఆ టాపిక్ కోసమే ఎదురు చూస్తున్న వరుణ్ "మార్నింగ్ స్వామితాత మనుమరాలు, తను అటువైపు వెళ్తూ కనిపించారు" వరుణ్ చెప్పాడు.

"అయితే అమ్మమ్మ దగ్గరికి వెళ్ళి వుంటుంది మార్నింగే చెప్పింది. అమ్మమ్మతో గోరింటాకు పెట్టించుకుంటానని" హిమ వూహించి చెప్పింది.

"ప్లీజ్ హిమాజీ నాకు ఓ హాఫ్ ఏన్ అవర్ టైం యిస్తే?"

"అరగంట చాలా? మొన్నేదో హెల్ప్ కావాలన్నారు?" హిమ క్యాజువల్‌గా అడిగింది.

**ఇద్దరూ మెట్లెక్కి** మేడమీదికొచ్చేశారు. లక్ష్మిని పిలిచి కూల్ డ్రింక్స్ తెమ్మని చెప్పి - "హెల్పంటే?"

నసిగాడు.

"అబ్బాయి సిగ్గుపడిపోతున్నాడని గ్రహించింది"

"మిమ్మల్ని వదినగారూ అని పిలవాలని" ఆపేశాడు.

"పిలవండి - ఎవరొద్దన్నారు?" అమాయకత్వం నటించింది.

"టీజ్ చేయకండి ప్లీజ్" ప్రాధేయపడ్డాడు.

"నేను టీజ్ చేస్తున్నానా? అసలు విషయాన్ని నువ్వే ఫ్రీజ్ చేస్తున్నావ్"

"అదీ - అదీ సుమ - సుమ గురించి"

"నాకున్నది ఒక్కతే సుమ మరి సుమ - సుమ అంటే రెండో సుమని నేనెక్కడినుంచి తీసుకురావాలి?" కవ్వింపుగా అడిగింది.

"ఐ మీన్ - సుమ సింధు. ఐ లవ్ హర్. సిగ్గుపడుతూనే కక్కేశాడు."

"ఓ అంత దూరం వచ్చేశావన్నమాట. ఒన్‌వేనా? అదికూడా?"

"అంత అదృష్టం లేదండీ. అందుకే మీ హెల్ప్ ప్లీజ్" డ్రింక్స్‌తో వస్తున్న లక్ష్మిని చూస్తూ ఆగిపోయాడు.

"నువ్వే చెప్పొచ్చుగా వరుణ్?" అంది హిమ.

"అనుకున్నానండి ఇప్పటికే 'బావ - బావ' అంటూ బనాయిస్తోంది. నేనడిగితే 'బావా బావా పన్నీరు' పాట పాడేస్తుందేమోనని భయంగా వుంది. తను ఓకే అంటే మా అమ్మా నాన్నలకూ ఓకే. నాకు బోలెడు ఆస్థివుంది. కట్నం పేరెత్తితేనే కంపరం పుడుతుంది. భార్యని కొనుక్కోవడం ఏంటండీ? అసహ్యంగా? అసలు కట్నం అడిగితే కాల్చేయాలి" ఆవేశపడిపోతుంటే.

హిమ హాయిగా నవ్వేస్తూ "అయితే నన్ను మీ ప్రేమదేశానికి అంబాసిడర్‌గా నియమించారన్నమాట?" అంది.

తల వంచేసుకున్నాడు వరుణ్.

"మరీ తొందరపడి తల వంచేసుకోకండి. దానికింకా టైముంది" టీజింగ్‌గా అంది.

"హిమాజీ ప్లీజండీ. మీరు ఓకే అనేయండి" ప్రాధేయపడుతున్న వరుణ్‌ని చూస్తూ

"మరీ అంత స్పీడా? నేను సుమతో మాట్లాడాలి - మమ్మీ డాడీలతో మాట్లాడాలి"

"అక్కర్లేదండీ - సుమ 'యస్' అంటే మా డాడీ మమ్మీలే మీ డాడీ మమ్మీలతో" ఆగిపోయాడు. మమ్మీకి తనెప్పుడో చెప్పేసానన్న విషయాన్ని దాచుకుంటూ.

"ఫస్ట్ ఫ్యాక్టరీ ఇనాగరేషన్. నెక్ట్ తమరి వివాహం కోసం నా హెల్ప్."

"ఫ్యాక్టరీ విషయం నేను చూసుకుంటాను.. సుమ విషయం మీరు ప్లీజ్ ప్లీజ్."

అతని వాలకం చూస్తుంటే వంగి పాదాలు పట్టేసుకుంటాడన్న సందేహంతో "ఓకే వరుణ్. నేను సుమతో మాట్లాడతాను తను యస్ అంటే ఫోన్ చేస్తాను."

"హిమగారూ ప్లీజండీ మీరే యస్ అనిపించాలి" అప్పుడే వచ్చిన బోసుబాబును గమనిస్తూ మధ్యలో ఆపేశాడు.

"వరుణ్ బాబూ కోర్టు వర్కు కూడా ఫినిష్ అయిపోయింది. కేసు విత్‌డ్రాయల్ పిటీషన్ కూడా ఓకె అయిపోయింది. ఏదో సీరియస్ డిస్కషన్‌లో వున్నట్లున్నారే?" సోఫాలో సెటిలైపోతూ హిమను చూస్తూ అడిగాడు.

"ఫ్యాక్టరీ ఇనాగరేషన్ గురించే" సమాధానం ఇచ్చాడు వరుణ్.

చిలిపిగా నవ్వేస్తున్న హిమను చూస్తూ ఇది డెఫినెట్‌గా సుమ విషయమేనని గ్రహించేశాడు బోసు.

అంతలో బాలయ్యొచ్చి "చిన్నమ్మగారు గోరింటాకు పెట్టించుకొచ్చి కారులో కూర్చున్నారు. మీరూ వస్తానంటే?"

హిమ లేచి "రేపేగా ఆంటీ వాళ్ళొచ్చేది మళ్ళీ కలుద్దాం" ఇద్దరికీ బై చెప్పేసింది.

ఐపోడ్‌లో పాటలు వింటూ బెడ్ మీద దొర్లుతున్న సుమను చూస్తూ దీని బ్రతుకు ప్రతిక్షణం ఇలాగే సాగాలి అనుకుంటూ ఇయర్ ఫోన్స్ లాగి ప్రక్కన పెట్టేస్తుంటే నువ్వు వింటావా అంటూ ఐపోడ్ ఇచ్చేయబోతుంటే "సుమా! నాకో సాయం చేయాలి చేస్తావా?" అడిగింది దగ్గరగా తీసుకుంటూ.

"అక్కా నేనా! సాయమా! నీకా?"

"నువ్వే - నాకే ఎంతైనా వెనకొచ్చిన కొమ్ములు కదా?"

"ఆ రూట్లో వచ్చావా? అయితే చెప్పు చెప్పు" మారాం చేసింది.

"లాయర్ బాబు ఫ్రెండ్‌కు ఓ సంబంధం కావాలట. వయసు ట్వంటీ ఫోర్, హైట్ ఫైవ్ లెవెన్, కలర్ వైట్. అబ్బాయి చాలా బ్రైట్. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. ఆస్థి లెక్కలేనంత ప్లస్ నో కట్నం గిట్నం. నీ ఫ్రెండ్ సర్కిల్‌లో ఎవరినైనా సజెస్ట్ చేయగలవా?" హిమ ప్రశ్న వింటూనే ఊహల్లోకి వెళ్ళిపోయింది.

ఫ్రెండ్స్ అందర్నీ గుర్తుచేసుకుంది "ఊహూ" అన్నట్లు పెదవి విరిచింది.

"ఎవరూ లేరా?" సుమనే గమనిస్తున్న హిమ అడిగింది.

"ఉన్నారు కానీ హైటూ కలర్‌లే అడ్డం పడిపోతున్నాయి" ఆలోచనల్లోంచి బయటికి వస్తూ చిన్నగా చెప్పింది.

"నీ సర్కిల్‌లో ఎవరూ లేరా?" ఆశ్చర్యం వ్యక్తం చేసింది హిమ.

"సుష్మ వుంది కానీ దానికి వాళ్ళ బావతో ఫిక్స్ అయిపోయింది. మ్యారేజ్ కూడా నెక్స్ట్‌మంత్‌లోనే. యింకెవరున్నారు?" సీరియస్‌గా ముఖం పెట్టిన చెల్లిని మురిపెంగా చూస్తూ.

"పోనీ నీ ఫోటో యిస్తే?" మామూలుగా అంది.

"అక్కా నాకు యిప్పుడు పెళ్ళా?"

"ఏ ఎందుకు కాకూడదు?"

"కనీసం గ్రాడ్యుయేషన్ కూడా అవ్వలేదు"

"పెళ్ళయ్యాక చేసుకోవచ్చు"

"నోవే.. అవునూ మనకి తెలియని ఫ్రెండ్ లాయర్‌బాబుకు ఎవరున్నారబ్బా? పేరేంటో?"

"రజని"

"రజనీకాంతా?"

"కాదు రజని అన్నయ్య."

"రజని అన్నయ్యా? అతనెవరూ?"

"విజయలక్ష్మి ఆంటీగారి అబ్బాయి"

అప్పుడెలిగాయి లైట్లు వరుణ్ బావా! తనకా? సిగ్గు అప్రయత్నంగా తొంగిచూసింది.

"అక్కా యు ఆరే ఛీట్" మీదపడి చిన్నగా కొడుతూ అంది.

"ఐ వాంట్ ఆన్సర్ ఫోటో ఇవ్వాలా వద్దా? " మాటల్లేనట్లు మౌనం వహించింది. అంటే అప్పట్నుంచి అక్క?

ఒక్కసారిగా వరుణ్ గుర్తొచ్చాడు. అక్క బనాయిస్తుందేమోనన్న అనుమానం తొంగిచూసింది. అది క్షణం మాత్రమే.

"అయితే ఆన్ ఒన్ కండిషన్. అమ్మాయి పేరు యస్‌తో స్టార్ట్ అవ్వాలట - పేరులో నాలుగు లెటర్సే వుండాలట. మాట మాటకీ నాదీ గ్యారంటీ అనే డైలాగ్ చెప్పాలట. కుర్రోడు మనూళ్ళో అడుగు పెట్టినప్పటినుంచి కునుకు తీయట్లేదట "లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అట వెడ్డింగ్ ఎట్ ఓన్ సైట్" చెప్పుకుపోతున్న హిమ తన చేయి చురుక్కుమనడంతో సుమను చూసి చెల్లి పెట్టిన బుంగమూతిని మురిపెంగా చూస్తూ ముద్దుల వర్షం కురిపించేసింది.

సుమకి అట్లతద్దినాడు జరిగిపోయిన పడవ యిన్సిడెంట్ ఒక్కసారిగా గుర్తుకొచ్చింది.

"అక్కా నేనొకటి అడుగుతాను నిజమే చెప్పాలి" గారాలు పోయింది సుమ.

"ఆ రోజు పడవలోంచి నెట్టేసింది తమరేకదా?"

"సిల్లీ డౌట్. హండ్రెడ్ పర్సెంట్ నేనే" చిద్విలాసంగా నవ్వేసింది హిమ.

"వై? నాతో చెపితే నేనే దూకేదాన్నిగా?"

"మరదే పూర్ డైరెక్షన్ అంటే. సీను అనెక్స్పెక్టెడ్‌గా వుంటేనే ఎఫెక్ట్ వుంటుంది. ఈ సీనుకి నాతో బాటు నిర్మల, టాన్యా హేమలతతో బాటు అన్నపూర్ణ కూడా డైరెక్టరే. స్క్రీన్‌ప్లే మాత్రం నాది."

"అక్కా నువ్వు అమెరికా వెళ్ళాక అందంతోపాటు అల్లరి కూడా పెరిగిపోయింది. నన్ను బీటవుట్ చెయ్యాలనా?"

"మరేం చేయమంటావ్ చెప్పు? అబ్బాయేమో వీరస్పీడు నన్నేమో తన ప్రేమదేశానికి అంబాసిడర్‌గా చేసేసాడు. అమ్మాయేమో అందమైన బావా అంటుందే తప్ప ఆ తర్వాత పాట పాడదు. అందుకే అలా ప్లాను చేశాం. ఎందుకైనా మంచిదని పడవ మల్లేసుతో ముందే చెప్పాం అయినా నువ్వలా గుటకలేస్తావని వూహించలా"

"అనెక్స్పెక్టెడ్ కదా! పైగా పట్టుచీరలో"

"మొత్తానికి హీరోయిన్ కోసం హీరో కాన్పూర్ చెప్పల్స్‌తోబాటు కాస్ట్లీ సెల్‌ఫోన్‌ను కూడా బందరు కాలవకి ప్రేమకానుకగా సమర్పించాడు. ఎనీహౌ యువార్ వెరీ లక్కీ కంగ్రాట్స్ అండ్ బెస్టాఫ్‌లక్"

ముద్దులు పెట్టేసింది హిమ.

అంతలోనే ఒక్కసారిగా హిమకు దూరంగా జరిగి ముఖంలోకి చూస్తూ.

"బట్ ఆన్ వన్ కండిషన్" అంది.

"బోలో బోలో బహెన్ జీ" అనేసింది హిమ.

"నేను అమెరికా వెళ్ళను గాక వెళ్ళను. నాకు అమెరికా అంటే అలర్జీ సూటిగా చూస్తూ చెప్పింది. వరుణ్ అమెరికా నచ్చకే వచ్చేశానన్నాడు."

"ఏమో? ఫ్యూచర్‌లో మళ్ళీ వెళ్తానంటే?"

"యూత్ యూతంతా ఛలో అమెరికా అంటుంటే నువ్వేంటిలా?"

"ఎవరేమన్నా నా లైఫ్ నా యిష్టం. నన్ను కన్నవాళ్ళు కన్నభూమే నాకిష్టం."

"ఒకే వరుణ్‌తో నీ కండిషన్స్ కన్‌ఫాం చేయిస్తాను. నాదీ గ్యారంటీ" మరోసారి ఆప్యాయంగా హత్తుకుంది హిమ.

మొదటినుండి యిద్దరినీ గమనిస్తున్న అనురాధాదేవి దీనికంత అదృష్టమా? అనుకుంటూ హాయిగా నిట్టూర్చింది.

విజయలక్ష్మి, రజని మధ్యాహ్న సమయానికి వచ్చేశారు.

వరుణ్ వర్కర్స్‌తో బిజీగా వున్నాడని లక్ష్మి చెపితే లక్ష్మిని తీసుకుని తిన్నగా అనురాధాదేవి ఇంటికి వచ్చేసారు.

వాళ్ళ రాకకోసమే వేయికళ్ళతో ఎదురుచూస్తున్న అనురాధాదేవి పొంగుతున్న ఆనందాన్ని అణుచుకుంటూ ఆప్యాయంగా అతిధి మర్యాదలు చేసింది.

అమ్మ పడుతున్న ఆపసోపాలు చూస్తూ హిమ, సుమలు తెగ ఎంజాయ్ చేస్తూ విజయలక్ష్మిగారికి నమస్కరించి రజనీతో తమ గదిలోకి వెళ్ళిపోయారు.

"అమ్మో - అమ్మో - ఎన్నెన్ని స్వీట్లో?" లక్ష్మి తెస్తున్న స్వీట్లు చూస్తూనే గుండెలు బాదేసుకుంది సీత.

"ఇవన్నీ ఎందుకు?" అంటున్న అనురాధాదేవిని చిరునవ్వుతో చూస్తూ.

"కాబోయే కోడలికోసం" అనబోయి అప్పుడే బయటపడడం ఎందుకని అమ్మాయిలున్నారుగా అనేసింది.

"అమ్మా సుమ ఓకె అందని బిందు వదినగారు మెసేజ్ ఇచ్చారు" అంటూ ఫోన్ చేసిన వరుణ్ ఎగ్జైట్‌మెంట్‌ను గుర్తుచేసుకుంటూ.

ఆ రాత్రే గోపాలకృష్ణగారు కూడా "వెంకటరత్నం నా క్లోజ్ ఫ్రెండ్" ఆ యింటి అమ్మాయంటే మనమ్మాయే అనేయడం ఆ మెసేజ్ వరుణ్‌కి పాస్‌కావడం రాత్రికి రాత్రే జరిగిపోయిన సంఘటనలు.

గదిలో ముగ్గురూ ముచ్చట్లాడుకుంటుంటే -

"అమ్మాయిగారండీ విజయవాడ నుండి పెళ్ళికి తెచ్చినన్ని స్వీట్లు తెచ్చారండి" అంటూ స్వీట్లు ట్రేతో వచ్చిన సీత మాటలకు తెగ సిగ్గుపడిపోయింది సుమ.

"ఫ్రెండ్ వదినైతే వదినకు ఫ్రెండ్ ఏమవుతుంది? రజని సుమను ఏడిపించాలని హిమను అడిగింది.

"ఫ్రెండ్ సుమైతే? సుమకు ఫ్రెండ్ మరదలవుతుంది."

"అక్కా పార్టీ మార్చేశావు కదూ? బావకు రిపోర్టిస్తా చూడు" బుంగమూతితో అంది సుమ.

"ఓ! అప్పుడే బావకు రిపోర్టిచ్చేంతగా ఎదిగిపోయావా కొమ్ముల చెల్లీ?"

"బావంటే? ఈ బావకాదు అమెరికా బావ సర్ది చెప్పింది" సుమ.

"సరే ఏ బావైతే ఏంటిగానీ మా అన్నయ్యను వరుణ్ అంటావా? బావ అంటావా? చిలిపిగా ప్రశ్నించింది రజని."

"మధ్యలో ఆ అనుమానం నీకెందుకొచ్చింది తల్లీ? చూసిన క్షణాల్లోనే ముద్దు అదే ముద్దు పేరు పెట్టేసిందిగా?" రజనికి విడమర్చి చెప్పింది హిమ.

"అయితే ఇవాల్టినుండి మీ యిద్దరితో కటాఫ్" బెదిరించింది సుమ.

"కరెక్ట్ యింకా మాతో పనేంటమ్మా మేమెంతైనా చెవులమే కొమ్ములం కాలేముగా?"

రజని సుమ అవస్థను చూస్తూ కామెంట్ చేస్తుంటే.

విజయలక్ష్మి అనురాధలు వెలిగిపోతున్న ముఖాలతో వచ్చి సుమ ప్రక్కనే కూర్చుండిపోయారు.

హఠాత్తుగా లేచిన సుమ అందర్నీ సంభ్రమాశ్చర్యాలలో ముంచేస్తూ విజయలక్ష్మిగారి కాళ్ళకు నమస్కరించేసింది.

ఆమె సుమను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని ముద్దు పెట్టుకుంది.

"చెల్లాయి జిల్లాయే అయిపోతే యిక లొల్లాయి పదాలే గతి" అని హిమ అంటే.

"ఎంతైనా చెవులు చెవులే కొమ్ములు కొమ్ములే అంతేగా అమ్మా?" తల్లిని నిలదీసింది రజని.

"చూశారా పాలెం మహిమ. మా రజనీకి కూడా మాటలొచ్చేస్తున్నాయ్" చమత్కరించింది విజయలక్ష్మి.

ఇంత సంతోష సమయంలో ఇది నోరిప్పితే బావుణ్ణు అనుకుంది అనురాధాదేవి.

భోజనాల టైంలో సుమ అదృశ్యమైపోతే వెదికి వెదికి కళ్ళు నొప్పులు పుట్టి ఆగిపోయాడు వరుణ్.

అసలు సంగతి గ్రహించిన హిమ, రజనీలు వరుణ్‌కి "కళ్ళమీద కీరాలు పెట్టుకుని రెస్ట్ తీసుకో" అని సలహా యిచ్చారు.

అడ్డంగా దొరికిపోయిన వరుణ్ "యా! ఒన్ మినిట్" అంటూ రాని ఫోనుకు ఆన్సర్ చేస్తు బయటపడిపోయాడు.

బోసుబాబు అర్ధరాత్రి మోగిన తన సెల్ స్క్రీన్ చూస్తూ "హిమ" అనుకున్నాడు అదురుతున్న గుండెను అదుపులో పెట్టుకుంటూ.

"హాయ్ హిమా!" ఉద్వేగం ఆనందం ఒక్కసారిగా తొంగిచూసాయి ఆ రెండు మాటల్లో.

"సారీ ఫర్ ద డిస్టబెన్స్ బాబూ"

"నీకూ నాకూ మధ్య సారీలా? నువ్వు ఫోన్ చేయడమే నాకు మహాభాగ్యం. టెల్మి?"

"మనం ఆనాటి హిమా - బాబుల్లా మాట్లాడుకోలేమా?"

తను తప్పుగా విన్నానేమోనని తడబడిపోయాడు. "హిమా!" ఇంకా తడబాటే మాటల్లో.

"యస్ ఐ మీనిట్" హిమ వాయిస్.

సంతోషంతో గుండె ఆగిపోతుందేమోనన్న ఫీలింగ్. మళ్ళీ చిన్న అనుమానం. "హిమేనా? సుమ ఏడిపిస్తోందా?."

అనుమానం అర్థమైపోయినట్లు "బాబూ నీ హిమనే" చిన్నగా నవ్వు.

"యస్ నా హిమే" కన్ఫం చేసుకున్నాడు ఆ నవ్వుతో.

"హిమా నాకింత అదృష్టమా?"

"అదృష్టం నీదికాదు నాది నీలాంటి స్నేహితుడు దొరకడం."

"స్టిల్ ఐ లవ్ యూ బాబూ"

"హిమా!"

"యస్ ఐ మీనిట్ బాబూ."

అలా దాదాపు రెండు గంటలు మాట్లాడుకున్నారు.

తెలతెలవారుతుండగా యిద్దరూ నిద్రాదేవి కౌగిలిలోకి జారిపోయారు.

ఉదయం పదిగంటలైనా నిద్రలేవని పుత్రరత్నాన్ని లేపాలని గదిలోకి వచ్చిన సుభద్రాదేవి దిండును వాటేసుకుని గాఢనిద్రలో వున్న కొడుకు వాలకాన్ని చూస్తూనే ఏదో జరిగింది అని అనుకోకుండా వుండలేకపోయింది.

అదే టైముకు అక్కను లేపాలని వచ్చిన సుమ నిద్రలోనే చిరునవ్వులు చిందిస్తున్న హిమను, గుండెల మీదున్న సెల్ఫోన్ను చూస్తూనే ఆశ్చర్యపోయి సెల్ తీసుకుని రిసీవ్డ్ కాల్డేటాను చెక్ చేస్తూనే యస్ లాయర్ బాబే దట్టూ టూ అవర్స్. ఆశ్చర్యపోతూనే ఆనందంగా నిట్టూర్చింది సుమ. ఏదో మిష్టరీ వుంది. ఏమై వుంటుంది?

తనలో తనే అనుకుంటూ ఫోన్ పక్కనే పెట్టేసి పిల్లిలా బయటికెళ్ళిపోయింది సుమ.

వారం రోజులు ఆ వూరు వూరంతా బిజీ అయిపోయింది.

అనుకున్న టైంకే మంత్రిగారు వచ్చేశారు.

ఊరూ వాడా అంగరంగ వైభోగంతో మెరిసిపోతుంటే

తెరచాపలెత్తి లంగరేసిన పడవలతో బందరు కాలువ పులకరించిపోయింది.

తన నీడలో ఆగిన లారీల కోలాహలాన్ని గమనిస్తున్న తురాయి చెట్టు ఎన్నాళ్ళకొచ్చింది పండగ పల్లె పల్లెంతా ఆనందం నిండగ అని తృప్తిగా తలవూపి తురాయి పుష్పాల్ని తలంబ్రాలుగా రాలుస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

గోపాలకృష్ణగారి ఫ్రెండ్స్, బంధువులతో పాలెం గ్రామం పరవశించిపోయింది. మిల్లులో నిర్మించిన వేదిక మీద గోపాలకృష్ణ, అతిధి మంత్రివర్యులతోబాటు ఆసీనుడైన స్వామితాతను చూస్తున్న కార్మికులంతా ఇదంతా మా స్వామితాత కృషే అనుకుంటూ కళ్ళవెంట ఆనందభాష్పాల్ని కురిపించారు

సభా మర్యాదలు మొదలయ్యాయి.

సుమ ఆహ్వానితులందరికీ పుష్పగుచ్చాలు అందిస్తే హిమ పూలదండతో అలంకరించింది.

ఆ యిద్దరినీ రెండు కళ్ళు చాలవన్న రీతిలో వీక్షించారందరూ.

గోపాలకృష్ణగారు మంత్రిగారి చేతుల మీదుగా పేరు పేరునా ఎరియర్స్ చెక్కులు అందించారు.

వరుణ్‌ని ఫ్యాక్టరీకి ఎమ్.డిగా పరిచయం చేశారు.

"యూత్ యూత్ అంతా తల్లిని, తల్లి దేశాన్ని విస్మరించి వేరే దేశాల దాస్యానికి వలసపోతున్న ఈ తరుణంలో అవకాశాలన్నీ వదులుకుని యువతకు స్ఫూర్తిగా పల్లెటూరికి ప్రాణం పోసిన ఆదర్శయువకునిగా వరుణ్‌ని అభివర్ణిస్తూ అభినందించారు మంత్రిగారు. చివరిగా తన ఉపన్యాసాన్ని ముగిస్తూ గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమకార్యక్రమాల గురించి వివరించి, పాలెం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎలాంటి సాయానికైనా సిద్ధం అని మాటిచ్చారు. సభ పూర్తి అయిన తరువాత విందు స్వీకరించి మంత్రిగారు వెళ్ళిపోయారు.

గ్గోపాలకృష్ణగారు వేదిక మీదకు వచ్చారు. గొంతు సవరించుకుని తన ఎంప్లాయిస్‌తో మాట్లాడడం మొదలు పెట్టారు.

"మిత్రులారా అపార్థాల మూలంగా అందరం కోర్టు ద్వారాలు తట్టాం. బాపిరెడ్డి పన్నాగంలో పావులమైపోయాం' నాలుగు సంవత్సరాల కాలం వృధాగా గడిచిపోయింది. హిమబిందు మా ఇంటికొచ్చినపుడు 'అంకుల్ ఫ్యాక్టరీ ఓపెన్ చేయండని ఎంతో బాధతో అర్థించింది. తన కష్టంతోబాటు తన పేరుమీదున్న పొలాన్ని కూడా వూరి సంక్షేమం కోసం వినియోగిస్తానంది.' నేను సిగ్గుపడిపోయాను. ఓ అమ్మాయి త్యాగం ముందు అల్పుడిగా ఫీలైపోయాను. ఆ రోజే అర్థమైపోయింది నేనెంత మూర్ఖంగా ప్రవర్తిచానో అని. ఆ రోజే హిమబిందుకు మాటిచ్చాను ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తానని. సరిగా అదే టైంలో మా అబ్బాయి వరుణ్ 'నాకు అమెరికా జీవితం వద్దు ఏదైనా పల్లెటూరిలో సెటిలైపోదామన్నాడు' మరో వూరెందుకు? మన వూరే వుందనిపించింది. వరుణ్ మీవాడు. వాడిని మీకే అప్పగిస్తున్నాను. 'సుమసింధును' నా కోడలిగా చేసుకుని వాడిని మీ వూరికి అల్లుడిగా చేస్తాను."

గోపాలకృష్ణగారి మాటలు అర్థం అవుతూనే కార్మికులంతా కరతాళ ధ్వనులతో కట్టలు తెంచుకున్న నదిలా దూకేశారు. వరుణ్‌ని ఆకాశానికెత్తేశారు.

అంత సందడిలోనూ అప్పుడే వస్తున్న గోపినాథ్‌ని అతని ఫ్యామిలీ మెంబర్స్ గుర్తుపట్టి ఆశ్చర్యంలో మునిగిపోయారు.

గోపిని చూస్తూనే "హాయ్ బావా" అంటూ ఎదురెళ్ళి చేతులు పట్టుకుంది సుమ.

వెలవెలబోతున్న ముఖంతో తల్లి భుజానికి తల ఆనించేసింది హిమ.

"రా బాబూ" అంటూ ఆహ్వానించి గోపాలకృష్ణగారికి పరిచయం చేసిన వెంకటరత్నంగారు అతని ప్రక్కనే వున్న కొత్తగా కనిపించిన అమ్మాయిని, ఆమె చంకలోని బిడ్డను చూస్తూనే అయోమయ స్థితిలో పడిపోయారు.

"నేను అంతా వివరిస్తాను అంకుల్. ముందు మీరీ సభను ముగించేయండి ప్లీజ్" అని అభ్యర్థించాడు గోపీనాథ్.

గోపాలకృష్ణగారి ఫ్యామిలీ మెంబర్స్, వెంకటరత్నంగారి ఫ్యామిలీ మెంబర్స్‌తో బాటు స్పెషల్ ఇన్‌వైటీగా బోసుబాబు కూడా మేడమీద సమావేశంలో మెంబరైపోయాడు.

బాబునెత్తుకుని వున్న అమ్మాయిని చూపుతూ "షి యీజ్ మై వైఫ్ మృదుల" పరిచయం చేశాడు గోపీనాథ్.

అప్పటికే విషయం అర్థమైపోయినట్లు అనవత ముఖంతో దుఃఖంతో తల్రకిందులైపోతున్న అనురాధాదేవి ఆవేశాన్ని, అవమానాన్ని అణుచుకుంటూ చూపుల్ని నేలకు అంటించేసింది. వరుణ్ తల్లి కమలమ్మ కన్నీటిని తుడుచుకుంటూ ఆమె ప్రక్కనే కూర్చుండిపోయింది.

అసలేం జరుగుతుందో అర్థం చేసుకోలేకపోతున్న గోపాలకృష్ణగారు అయోమయంగా వెంకటరత్నాన్ని చూస్తూ వుండిపోయారు.

**గోపీనాథ్ లేచి** అందరికీ నమస్కరిస్తూ -

"దయచేసి ప్రశాంతంగా నా మాటలు వినండి. దయతో అర్థం చేసుకోండి. నేను చేసిన పని తప్పా? కాదా? అనే కోణంలో కాకుండా రెండు నిండు జీవితాలకు సంబంధించిన విషయంగా చూడండి. నేను దాదాపు ఐదు సంవత్సరాల క్రితం అమెరికా వెళ్ళాను. ఎలా? డాలర్ల గలగలలు, ఐటీ జాబ్, ఫ్యాట్ శాలరీల వంటి రంగు రంగుల స్వప్నాలతో నా అమెరికా ప్రయాణానికి సామాన్య రైతయిన మా నాన్న ఉన్న ఐదెకరాల పొలం అమ్మేశారు. విజయవాడలో వెలిసిన ప్లేస్‌మెంట్ కంపెనీకి ముందూ వెనుకా చూడకుండా మనీ పే చేశాం. తీరా నేను అమెరికాలో కాలు పెట్టాక తెలిసింది. నా అపాయింట్ మెంట్ లెటర్ ఫేక్ అని అసలలాంటి కంపెనీ అమెరికాలో లేదని. ఏం చేయాలి? ఈ సంగతి అమ్మానాన్నలకు తెలిస్తే ఆత్మహత్య చేసుకుంటారని భావించాను. అప్పటికే అమెరికాలో సెటిలైన నా ఫ్రెండ్ సాయంతో సర్వైవ్ అయ్యాను. బ్రతకాలంటే ఉద్యోగం కావాలి. దొడ్లు కడిగే పనిచేయాలన్నా వర్క్ పర్మిట్ కావాలి. దొంగతనంగా చిన్న చిన్న జాబ్స్ చాలా చేశాను. " దుఃఖం పొంగుకొస్తుంటే మాటలు ఆపేశాడు.

"పోనీ ఇండియా వచ్చి ఏదైన్ జాబ్ చూసుకుందామనుకున్నా టికెట్ ఎలా? చాలా రోజులు పస్తులున్నాను. స్ట్రీట్ వెండర్‌గా పనిచేశాను. ఆరోగ్యం పాడైపోయి శక్తిహీనుడిగా మారిపోయాను. ఆత్మహత్యే శరణ్యమనుకుంటున్న క్షణాల్లో మృదుల నాన్నగారితో పరిచయం జరిగింది.

ఎంతో దయార్థ్రహృదయుడైన ఆయనకు నా కథంతా చెప్పి సాయం అర్థించాను.

ఆయన పేరు త్రినాధరావుగారు. ఆంధ్రా రెస్టారెంట్ అధిపతి. వసతి కల్పించి ఉద్యోగమిచ్చారు. చచ్చిపోవాలనుకున్న నాకు పునర్జన్మ నిచ్చారు. అమెరికా జీవితానికి అవసరమైన 'డాక్యుమెంట్లన్నీ' ఆయనే సంపాదించిపెట్టారు.

ఎంతో ఉదారంగా, ఉల్లాసంగా ఉండే ఆయన హఠాత్తుగా ఉదాసీనంగా మారిపోయేవారు. ఆయన మనోవేదనంతా తన మూగ కుమార్తె మృదుల గురించే. చూడండి అందంగా మీ ముందున్న ఈ అమ్మాయికి మాటలు తెప్పించాలని త్రినాధరావుగారు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

ఎప్పుడూ యిదే విషయం చెప్పి బాధపడేవారు. నన్ను ఆ కుటుంబ సభ్యునిగానే ట్రీట్ చేసేవారు. 'నీకూ ఓ రెస్టారెంట్ పెట్టిస్తాను గోపీ' అంటుండేవారు. అలాంటి ఆయన? "

ఆగిపోయాడు గోపి.

కళ్ళనుండి ధారాపాతంగా కారిపోతున్న కన్నీటిని అదుపుచేసుకోలేక సోఫాలో కూలబడిపోయాడు.

బోసుబాబుతోపాటు వరుణ్ కూడా ఓదార్చి వాటర్ తాగించారు.

కొంచెం సర్దుకున్నాడు గోపి.

"ఆ రోజు దుర్దినం. త్రినాధరావుగారు, ఆయన శ్రీమతి, నేను, మృదుల నయాగరాఫాల్స్ చూసి కార్‌లో తిరిగొస్తున్నాం. త్రినాధరావుగారు డ్రైవ్ చేస్తుంటే ఆయన శ్రీమతి ఆయనతోబాటు ఫ్రంట్ సీట్‌లో కూర్చున్నారు. నేనూ మృదుల బ్యాక్ సీట్‌లో, మృదుల

ఏదో వీడియోగేమ్ ప్లే చేస్తోంది తన సెల్‌లో. అవే ఆనందానికి ఆఖరి క్షణాలు. హఠాత్తుగా - ఓ నీగ్రో యూత్ తప్పతాగి ఓవర్ స్పీడ్‌లో డ్రైవ్ చేస్తూ మమ్మల్ని క్రాస్ చేసి రోడ్ డివైడర్‌కి డాష్ ఇచ్చి మా కార్ ముందు ల్యాండైపోయాడు.

త్రినాధరావుగారు ఎంత ట్రై చేసినా లాభం లేకుండా పోయింది. సడన్ బ్రేక్‌తోకూడా ఆగకుండా మా కార్ ఆ నీగ్రో యూత్ కార్‌ని గుద్దేసింది. మా కార్ ముందు భాగమంతా స్మాష్ అయిపోయింది.

త్రినాధరావుగారు ఆయన శ్రీమతి స్పాట్ డెడ్

అంతా క్షణాల్లో మా కళ్ళముందే -

ఆ దృశ్యాన్ని చూస్తూనే మృదుల ఫెయింటైపోయింది.

నేను చిన్న చిన్న గాయాలతో బ్రతికిపోయాను.

హాస్పిటలైజ్ అయిన మృదుల వారం రోజులు స్పృహ కోల్పోయేవుంది.

డాక్టర్స్ కూడా ఛాన్స్ ఫిఫ్టీ - ఫిఫ్టీ అన్నారు.

అదృష్టవశాత్తు మృదుల గండం నుండి బయటపడింది కానీ మెంటల్‌గా చాలా వీక్ అయిపోయింది. రాత్రిపూట నిద్రలో మమ్మీ డాడీ అని అర్థం వచ్చేలా ఎప్పుడూ నోరు కదుపుతూనే ఉండేది. నా శ్రేయోభిలాషి, పునర్జన్మ ఇచ్చిన తండ్రివంటి త్రినాధ్‌గారి మరణంతో బాటు మృదుల స్ట్రగుల్ ఎప్పుడూ బాధిస్తుండేది నన్ను.

'ఈ మూగదానికి పెళ్ళవుతుందా గోపీ! మేమున్నంత వరకు ఓకె. తర్వాత ఎవరు చూసుకుంటారు?' అని నిత్యం బాధపడే త్రినాధ్‌గారికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలను అని ఆలోచించేవాడిని.

ఆయన బాధను నిజం చేస్తూ ఏకాకిగా మృదుల.

డాక్టర్ల సలహామేరకు అనుక్షణం ఆసరాయిస్తూ 'నీకు నేనున్నాను' అన్న భరోసా కల్పించగలిగాను. తనని ఆపదనుండి రక్షించగలిగాను.

మృదుల పూర్తిగా నామీద డిపెండైపోయింది. నా మీద నమ్మకం ఏర్పాటు చేసుకుంది. నేనే తన సర్వస్వమనుకుంది. రెస్టారెంట్‌తో బాటు ఇన్సూరెన్స్ మనీని కూడా నా పేరునే ట్రాన్స్‌ఫర్ చేయించింది. ఇంతమంది మహామనుషుల ఔదార్యం, త్యాగాలే నా ఈ జీవితానికి ఆలంబనలయ్యాయి.

నేనెలా ఈ రుణాన్ని రుణభారాన్ని తీర్చుకోవాలి?

ఎడతెగని ఈ ఆలోచనల అంతిమరూపమే మృదులను నా భార్యగా చేసుకోవాలనే నిర్ణయం.

ఇన్ని బాధల వెనుక అమ్మా నాన్నలు అనుక్షణం గుర్తొచ్చేవాళ్ళు. వారి ఆశలు, ఆకాంక్షలు అన్నీ నేనే. నా ఉద్యోగం మీదా నా పెళ్ళి మీదా అనేక ఆశల హర్మ్యాలు నిర్మించుకున్నారు.

ఏం చేయాలి? త్రినాధ్‌రావుగారి నుంచి సంక్రమించిన ఆస్థి చాలా వుంది. ఆర్థిక పరిస్థితిని చూపించి అమ్మా నాన్నల్ని కన్విన్స్ చేయగలననుకున్నాను.

మృదులను వివాహం చేసుకున్నాను.

మూగపిల్లతో వెళ్ళి అమ్మానాన్నలకు కనిపిస్తే? వాళ్ళు బాధపడి మృదులను మానసికంగా గాయపరిస్తే? అన్న ఆలోచనతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నాను.

అప్పుడు చెప్పింది అమ్మ. ఓ పిడుగులాంటి వార్త. 'నీకు పాలెం వెంకటరత్నంగారమ్మాయి హిమబిందుతో వివాహం నిశ్చయం చేసాం. భారీకట్నం, అయిదెకరాల పొలం. మన కష్టాలు తీరిపోతాయి నీకు లీవ్ దొరికితే వెంటనే బయలుదేరు.'

తమ నిర్ణయాన్ని ఆనందంగా అంతిమ నిర్ణయంలా చెప్పింది అమ్మ.

అమ్మది చచ్చైనా సాధించాలనుకునే మనస్తత్వం ఏం చెప్పాలి? అప్పటికే తను ప్రెగ్నెంట్." మృదులను చూస్తూ చెప్పాడు.

"ఈ టైంలో తనకేమీ తెలియకూడదు. ముందెళ్ళి అమ్మా నాన్నల్ని కన్విన్స్ చెయ్యాలి. 'ఆల్ ఆఫ్ ఎ సడన్ జర్నీ' దాదాపు పదిహేను రోజుల తర్వాత గానీ ఫ్లైట్ టికెట్ కన్‌ఫం కాలేదు.

ఈ మధ్యలో మరో పిడుగు నాన్నగారికి హార్ట్‌ఎటాక్.

తిన్నగా వెళ్ళి అపోలో డాక్టర్ని కలిసాను.

'మైల్డ్‌స్ట్రోక్. మరోసారి స్ట్రోక్ రాకుండా చూసుకోండి. ఆయన చాలా వీక్‌గా వున్నారు. ఆపరేషన్ నాట్ అడ్వైజబుల్ ఆదుర్దా కలిగించే విషయాలు ఆయన హార్ట్‌కు ఎనిమీస్ 'బి కేర్‌ఫుల్' అన్నారు.

ఏం చేయాలి నేను?

ఏం చెప్పాలి?

చెప్తే నాన్న జీవితం.

మౌనంగా వుంటే హిమ జీవితం.

మూగపోయాను. మూగజీవినయ్యాను.

మా అమ్మ, హిమబిందు మదర్ పట్టుదల మూలంగా ఆ వారంలోనే ముహూర్తాలు పెట్టించేసింది. హిమబిందును బలిపశువును చేసేసారు.

నాన్నను రక్షించుకోవాలన్న స్వార్థం నన్ను చేతకానివాడిని చేసాయి. పెళ్ళి జరిగిపోయింది.

హిమబిందుకు నా కథ చెప్పి క్షమాపణలు కోరి ఆమె విధించిన శిక్షను మనఃస్ఫూర్తిగా అనుభవించాలని అనుకున్నాను.

ఓ విధంగా నా అదృష్టం. నా కథంతా విని కదిలిపోయి కన్నీరు కార్చింది హిమబిందు.

తన ప్రేమ కథ చెప్పింది.

'బాబే నా జీవితం అంది. బోసుబాబు నా జీవితంలో లేని క్షణం నాకు జీవితమే వద్దంది. నేను పెళ్ళికి ఒప్పుకుంది అమ్మకోసం కాదు. ఈ పెళ్ళి జరక్కపోతే నీ ముద్దుల చెల్లిని ముందు చంపి నేను బందరు కాలువలో దూకి చచ్చిపోతానంది. బోసుబాబును బ్రతకనివ్వనంది. ఇంటికి పిలిచి విషం పెట్టి తను జైలుకెళ్తానంది. అందుకే నన్ను నేను త్యాగం చేసుకోవాలనే నిర్ణయానికొచ్చాను. మీరుకాక నా జీవితంలోకి ఎవరు ప్రవేశించినా ఈ రాత్రే నా అంతిమ రాత్రి అయ్యేది.'

హిమ మాటలు నాలో కొత్త చైతన్యాన్ని, ఆలోచనలను రేకెత్తించాయి.

బోసుబాబుకు విషయం చెబుదాం అన్నాను.

'నో అంది. తన ప్రేమ మీద, బాబు మీద నమ్మకం వుంది అంది.'

ఏం చేయాలో ప్లాన్ చేసుకున్నాం. అర్జెంట్ మెసేజ్ వచ్చిందని అందరినీ నమ్మించి యిద్దరమే బయలుదేరి హైదరాబాద్ వచ్చేశాం.

అక్కడ వీసా ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని విడాకుల కోసం లాయర్ని సంప్రదించి ఫీజ్ చెల్లించి నా సహోదరితో అడుగుపెట్టినట్లు అమెరికాలో అడుగుపెట్టాను.

మృదులకు నా చెల్లెలుగా పరిచయం చేసి జాబ్ కోసం వచ్చిందని నమ్మించాను.

ఈ రెండేళ్ళ కాలంలో తను నాకు సోదరిగా మాత్రమే కాదు మృదులకు తల్లిగా మారిపోయింది.

బాబు పుట్టాడు, నాన్నకోలుకున్నాక బాబును చూపించి జరిగిన కథ చెప్పి కన్విన్స్ చేయాలని కాలయాపన చేశాము.

నిన్న నేను చెప్పేవరకు మృదులకు కూడా ఈ కథ తెలీదు.

అంతా విని కన్నీరు పెట్టుకుంటూ 'యు ఆర్ వెరీ గ్రేట్' అంటూ రాసి చూపించింది.

నేను స్వార్థం కోసం చేసాను. ఒక ఆడపిల్ల నిండు జీవితాన్ని పందెంలో పెట్టిన పాపాత్ముడిని. క్షమించండి. నన్నెవరు క్షమించినా క్షమించకపోయినా 'నా బావగారు బోసుబాబుగారు' క్షమించి నా సోదరిని భార్యగా గ్రహిస్తే నా జీవితం ధన్యమే" కన్నీటిని ఆపుకుంటూ కథ ముగించాడు గోపీనాథ్.

అందరికంటే ముందు రియాక్టైపోయింది అనూరాధాదేవి.

ఆపుకోలేని దుఃఖంతో "హిమా - నా తల్లీ" అంటూ శోకాలు మొదలు పెట్టింది.

"ముయ్ నోర్ముయ్. ఆస్థి అన్నావ్ అంతస్తన్నావ్, అందర్ని చంపి చస్తానన్నావ్. దాని బ్రతుకిలా చేసావ్. శోకాలు పెట్టకు. చస్తే చావు నీలాంటి తల్లులున్నా ఒకటే చచ్చినా ఒకటే" వెంకటరత్నంగారు అరిచేసారు.

గోపాలకృష్ణగారు రెండు చేతులూ పట్టుకుని శాంతింప చేసారు.

హిమబిందు దృష్టంతా బోసుబాబు మీదే బోసుబాబు ముఖంలో ఆనందం ఏదో జయించానన్న తృప్తి. అతని పరవశత్వాన్ని చూస్తూనే తన నమ్మకం ప్రేమలు ఫలించాయన్న పరవశం వివశురాలిని చేస్తుంటే సుమ బుగ్గ మీద గాఢంగా ముద్దు పెట్టేసింది హిమ.

కిలకిలా నవ్వేసిన సుమ 'నేను - నేను సుమనక్కా - బోసుబాబును కాదు' అంటూ హిమ చెవిలో గుసగుసలాడి బోసుబాబును చూస్తూ చిలిపిగా నవ్వింది.

తనముందు నిలిచిన గోపీనాథ్‌ను చూస్తూనే తన సంతోషాన్ని తెలియజేస్తూ గోపీ చేతిని తన చేతిలోకి తీసుకుని ఆనందంగా ప్రెస్ చేశాడు. గాఢంగా కౌగిలించుకున్నాడు బోసుబాబు.

గోపి కళ్ళవెంట ఆనందభాష్పాలు.

గోపి మరోసారి అందరికి నమస్కరించాడు.

గోపాలకృష్ణగారి నుద్దేసిస్తూ "అంకుల్ పాలెం ఫ్యాక్టరీ గురించి విన్నాను. మీరు మళ్ళీ ఫ్యాక్టరీ రీస్టార్ట్ చేయడం. దానికి మిష్టర్ వరుణ్‌ని ఎం.డిగా చేయడం వూరికే కాదు, యూత్‌కే ఆదర్శంగా మారిపోయింది. హిమ తరచుగా నాతో చెప్పేది పాలెం వెళ్ళాక పరిస్థితుల్ని బట్టి గ్రామాభివృద్ధికి ప్లాన్ చేయాలని. తన పెళ్ళికి యిచ్చిన కట్నంతోబాటు, అయిదెకరాల పొలం కూడా తన పేరునే వున్నాయి.

మా మామగారి పేరున ఆయన స్మారకార్థం హిమను కన్న ఊరికోసం ఏదైనా చేయాలనుకుంటున్నాను. పెద్దలు మీరు తగిన సూచనలనిచ్చి సాయం చేస్తే" ఆగిపోయాడు.

గోపాలకృష్ణగారు గోపిని కౌగిలించుకుని, "నేటి యూత్ యూతంతా దారీ తెన్నూలేక దారి తప్పిపోతోందని మాలాంటి పెద్దలంతా గగ్గోలు పెడుతున్న ఈ కాలంలో తండ్రికాని తండ్రి అయినా మీ మామయ్యగారికోసం నువ్వు పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయినా, ప్రేయసి మనసెరిగిన నిజమైన ప్రియునిలా ఆత్మవిశ్వాసంతో ఓ ఆదర్శంతో ప్రేమకు అమరత్వాన్ని కలిగించిన బోసుబాబు, చెల్లి ప్రాణాన్ని, ప్రియుని జీవితాన్ని కాపాడుకోవడం కోసం పెళ్ళి చేసుకుని, పట్టుమని పాతికేళ్ళు కూడా నిండని మీలో ఇన్ని త్యాగాలా? పల్లెపట్ల యింతటి

మమకారమా? అయిదో తరగతి వయసుకే మాతృదేశం పట్ల ద్వేషాన్ని విదేశాల పట్ల అనురాగాన్ని రంగరించిపోస్తున్న అధికశాతం తల్లిదండ్రులున్న ఈ దేశంలో అతి మామూలు పల్లెలో పుట్టిన మీరు మాకేకాదు మన జాతికే మార్గదర్శకులు.

అమ్మా హిమా! హిమబిందూ? నా చిన్నతనంలో అడివిబాపిరాజుగారి 'హిమబిందు' చదివాను. ఉత్తమ ప్రేమకు నిర్వచనంలా, ఉదాహరణలా చరిత్రలో నిల్చిపోయింది నాటి హిమబిందు. ప్రేమ చరిత్రను తిరగరాసిన నువ్వు బోసుబాబులు మరపురాని ప్రేమకావ్యానికి నాయకి నాయకులుగా నిలిచిపోయారు. వయసులో చిన్నవారైనా మీ ప్రేమకు త్యాగాలకు, చేతులెత్తి నమస్కరిస్తున్నాను" ఎమోషనల్ అయిపోయారు గోపాలకృష్ణ.

హిమ చేతిని పట్టుకుని నెమ్మదిగా తీసుకొచ్చి బోసుబాబు ప్రక్కనే నిలబెట్టారు. వెంకటరత్నాన్ని చూస్తూ "రెండు ఆణిముత్యాలను పొందిన మీ జన్మధన్యంరా" చేతిలో చేయికలిపి మనఃస్ఫూర్తిగా అభినందించారు.

అనురాధాదేవి కళ్ళు తుడుచుకుంటూ వచ్చి హిమను బోసుబాబును చూస్తూ "చదువులేని మూర్ఖురాల్ని. పంతం నెగ్గాలనే పట్టుదలతో పశువులా ప్రవర్తించాను. నిజమే పిల్లల మనసులు తెలుసుకోలేని నాలాంటి తల్లులున్నా ఒకటే లేకున్నా ఒకటే. అమ్మా హిమా! నీ తల్లిని క్షమించు. లాయర్ బాబు నువ్వుకూడా" పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేస్తుంటే ఆమె మాటలు పూర్తికాకుండానే "అయ్యో ఆంటీ ప్లీజ్ అంతమాట అనకండి" అన్నాడు బోసు.

బోసు హిమలు జంటగా వెళ్ళి గోపాలకృష్ణ విజయలక్ష్మి దంపతులతోబాటు వెంకటరత్నం అనురాధాదేవి కాళ్ళకు నమస్కరించారు. అందరూ హిమా బోసుబాబులను ఆశీర్వదించి అభినందించారు. సుమ, హిమని వరుణ్ బోసుబాబును కౌగిలించేసుకున్నారు.

ఆ దృశ్యాన్ని చూస్తున్న గోపీనాథ్ తన లక్ష్యం, జీవితాశయాలు నెరవేరిపోయాయని ఆనందపడిపోయాడు. అప్రయత్నంగా అతని కళ్ళల్లో ఆనంద భాష్పాలు సుడులు తిరిగిపోతుంటే ఒక్కసారిగా బోసుబాబును కౌగిలించుకుని ఎమోషనల్ అయిపోయాడు.

"ఎన్నోసార్లు తపోబా అని బోసుబావని ఆటపట్టించాను. తప్పిపోయిన బావవి నువ్వే" అంటూ హాస్యమాడుతున్న సుమను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని 'తపోబా' గురించి మర్చిపోయి వరుణ్ బావను గుర్తుంచుకో మరదలు పిల్లా అని రిటార్ట్ యిచ్చాడు గోపీనాథ్.

నవ్వుల పువ్వులతో ఆ ప్రాంతమంతా గుభాళించిపోయింది.

ఫ్యాక్టరీ ఓపెనింగ్‌తో 'పాలెం' కళే మారిపోయింది.

ఎక్కడ చూసినా ఉత్సాహం పరవళ్ళు తొక్కుతోంది.

మూడు షిఫ్ట్‌లో నిర్విరామంగా ప్రొడక్షన్ జరిగిపోతోంది.

ఫ్యాక్టరీ ఓపెన్ అయిపోయిన వారం రోజులలోనే బోసుబాబు హిమల వివాహం అతి నిరాడంబరంగా జరిగిపోయింది.

హిమ తన ఐదెకరాల భూమిని హాస్పిటల్ పేరున రిజిష్టర్ చేసేసింది.

త్రినాధరావు మెమోరియల్ హాస్పిటల్‌కు శంకుస్థాపన జరిగిపోయింది.

గోపీనాథ్ తన కొడుక్కి త్రినాథ్ అని నామకరణం చేసి మృదులతోబాటు త్రినాథ్‌ని కూడా అమ్మా నాన్నల దగ్గిరే వదిలిపెట్టి అమెరికా వెళ్ళిపోయాడు.

మృదుల తన తండ్రి పేరున నిర్మితమవుతున్న హాస్పిటల్ బాధ్యతలను 'బోసుబాబు హిమబిందులకు' అప్పగించేసింది. మృదుల, సుమలు విడదీయరాని ఆత్మీయులైపోయారు. అనురాధాదేవి, కమలమ్మలు మృదుల సుమలతో పోటీపడిపోతూ బాబును అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు.

వరుణ్, సుమ సింధుల ఎంగేజ్‌మెంట్ కూడా విజయవాడలోని ఓ పెద్ద హోటల్లో ఘనంగా జరిగిపోయింది.

వరుణ్ బాయిల్డ్ రైస్ ఫ్యాక్టరీని మల్టీపర్పస్ ఇండస్ట్రీగా తీర్చిదిద్దే ప్రయత్నాలు స్టార్ట్ చేశాడు.

ఒక చిన్న ఇండస్ట్రీ ఓ గ్రామ చరిత్రనే మార్చివేయగలదన్న నిజాన్ని నిరూపించిన వరుణ్ యువతకే ఆదర్శప్రాయుడైపోయాడు.

చుట్టుప్రక్కలున్న ఎన్నో గ్రామాలకు 'పాలెం' మార్గదర్శకమైపోయింది.